

40
Ps
24-4-70

ఆంధ్రసచిత్ర
వారపత్రిక




దగ్గు, జలుబులు నీర్సమును కలిగిస్తాయి — యితర వ్యాధులకు దారితీస్తాయి

బలము మరియు ఆరోగ్యమునకు వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి

దగ్గు, జలుబులతో రోగ నిరోధక శక్తిని గోల్పోతారు. మీరు నీర్సముగా వుంటారు. అటువంటప్పుడు మీకు యితర వ్యాధులు సోకే అవకాశ ముంటుంది. గనుక వాటర్‌బరీస్ కాంపౌండ్ క్రమంగా త్రాగండి. దీనిలోగల ఓషధులు ఆకలిని వృద్ధి పరుస్తాయి. కోల్పోయిన శక్తిని తిరిగి చేకూరుస్తాయి, యితర వ్యాధులు కలగకుండా రోగ నిరోధక శక్తిని యిస్తాయి. దీనిలో చేర్చబడిన 'క్రియోసోట్' మరియు 'గయోకోల్' దగ్గు, జలుబులనుండి ఉపశమనము కలిగిస్తాయి.

వాటర్‌బరీస్ కాంపౌండ్ – అత్యంత నమ్మకమైన టానిక్



వార్నర్-హిందుస్తాన్ లిమిటెడ్

WH 7965 TE

ఉత్తరాలు

కథలు

ఉగాది సంచికలో శ్రీ ఎస్. ఉమామహేశ్వరరావు గారు వ్రాసిన 'బాగుపడే దెప్పుడు' కథ, కథలాగా కుండా నాటకాల తెరవెనుక జరిగే నిజమైన సంఘటనలా వున్నది. అందులో అర్జునరావుపాత్రను చూస్తుంటే మా సమాజంలోని ఒక వ్యక్తికి ప్రతిరూప కల్పనలా వున్నది. నాటకాలాడే వారి తెర వెనుక బాధలు చాలా మందికి తెలియవు. యీ కథ ద్వారా కొంతవరకూ తెలుసుకొన వచ్చును.

అందరూ సారధిలాంటి వాళ్ళే వుంటే మన ఆంధ్ర నాటక రంగం ఏనాడో బాగుపడేది. కాని యింకా అధోగతికి పోతోంది. విశ్వేశ్వరయ్యలాంటి కాంట్రాక్టరు ఎంత ఉత్సాహంతో ముందుకు వచ్చినా యిలాంటి వాళ్లను చూసి నీరసపడి పోతారు. బ్యాలెట్ ఫలితాలు తృప్తికరంగా వున్నవి.

బోగాల రామచంద్రరావు,
శ్రీ గురజాడ నటసమాఖ్య, [విజయవాడ]

* * *

3–4–70 సంచికలోని 'సున్నంటే నాకిష్టం' అనే కథ చదివాను. ఇంతకుముందు ఎప్పుడూ పత్రికలకి ఉత్తరాలు వ్రాయకపోయినా, ఈ కథ చదివిన తరువాత కోడూరి శ్రీరామమూర్తిగారికి అభినందనలు అందజేయకుండా ఉండలేకపోతున్నాను కథ చాలా అద్భుతంగా [ఇంతకంటే మంచి మాట తెలియటంలేదు] ఉంది. చాలా సంతోషం.

శేఖర్‌బాబు [నాందేడు]

* * *

10–4–70 సంచికలో 'బాగు పడే దెప్పుడు' కథ చాలా బాగుంది. నాటక సమాజంలో జరిగే వాగ్వివాదాలు, అప్యాయతలు, మోసాలు ముఖ్యంగా నేటి సమాజంలోనున్న యువతుల శీలాన్ని గురించిమరియు నాటక సమాజంలోనున్న ప్రతి వ్యక్తికి కనువిప్పు కలిగించేలా కథను సృష్టించారు శ్రీ యస్. ఉమామహేశ్వరరావుగారు.

యస్. కె. షరఫుద్దీన్ బాన్నీ [హైద్రాబాద్]

సీరియల్

ఈవారం(10–4–70)సంచికతోఅంతమయిన 'మేఘమాల' సీరియల్ ఈ మధ్య పత్రికద్వారా ప్రచురించబడిన సీరియల్స్ అన్నింటిలో తలమానికంవంటిదనటంలో సందేహ మేమీ లేదు. ఇంకో సీరియల్ 'అపరాజిత' కూడా చక్కని పంధాన నడుస్తోంది.

'ఫిలిం బాలెట్' ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. పూర్తి న్యాయం చేకూర్చారనే చెప్పాలి. ఎన్. టి. ఆర్. లోని ప్రత్యేకతను పాఠకులకు తెలియజేసినందుకు విలేఖరికి నా కృతజ్ఞతలు [సోదర పాఠకుల తరపున] తెలియజేసు కొంటున్నాను.

కుమారి పద్మిని [సినీతార]తో యింటర్వ్యూ చాలా బాగుంది. ఎని హౌవు, ఉగాది సంచిక ఆశించిన ప్రమాణంలో [ఐ. మీన్ అన్ని రకాల ఆర్టికల్స్‌తో రూపొందించినందుకు చాలా థాంక్స్.

రాష్ట్రి, (కాకినాడ)

* * *

నలుగురి రచయిత్రుల సంయుక్త నవల 'అపరాజిత' క్రమక్రమంగా రక్తి కడుతోంది. ఆ నవల చదువుతూ వుంటే 'పండి మబ్బు' 'తామర కొలను' నవల్స్ చదువుతున్నప్పుడు కలిగిన ఉత్సాహము మరల చాన్నాళ్ళకు కలుగు తున్నది. కధాసంవిధానంలో తేడా వున్నా స్టైలీ, ఆకర్షణ ఆ నవల్స్‌కు తీసిపోలేదు. ఈ నవలకు, వేసే చిత్రాల విషయంలో తగు శ్రద్ధ వహిస్తే.... పాఠకులకు చలనచిత్రం చూసినట్లే అనిపిస్తుందనుటలో అతిశయం లేదు. పత్రికలో ముందుగా నన్నాకర్షించే శీర్షికలు 'సినిమా' 'ఒక వారం విపరీతం' తరువాత ఎన్నీ యధాలాపంగా చదివేస్తాను. బాగుంటే మెచ్చుకుంటాను. సంపాదకులకు పాఠకులకు, రచయిత్రులకు అందరికీ 'పత్రికా ఫేన్'గా యిదే అభినందనలు—

'పాఠక రచయిత' [కశింకోట]

* * *

10–4–70 వారపత్రికలో ప్రచురితమయిన నండూరి విఠల్‌గారి 'మమత' సీరియల్ కథ చాల బాగుంది. అందులోని నాయకుడు స్వామి అమాయకత్వము చూస్తే చాల నవ్వు వస్తోంది. ముఖ్యముగా ఈ సీరియల్లో నేటి యువతీ యువకుల విద్యావిధాన మెట్లున్నదో రచయిత చాల చక్కగా విమర్శించారు. ఇకముందు కూడ ఈ సీరియల్ ఇలాగే పాఠకులకు ఉత్సుకత కలిగిస్తూ సాగిపోతుందనే భావిస్తున్నాను.

మంజుల. బి. [నెల్లూరు]

* * *

ఈ వారపు ఆంధ్రపత్రికలో 'మేఘమాల' సీరియల్ చాల బాగా పూర్తి చేశారు. రాజేశ్వరి త్యాగరాజును ప్రోగ్రాం అను వంకతో రాణి సుందరమూర్తిని త్యాగరాజును కలుపుట ఇందు రాజేశ్వరి పాత్రకు చాల మంచి పేరు తెచ్చిపెట్టినది. కాని చివర శకుంతలను గూర్చి వ్రాయకపోవుట ఆఖరుకు ఆవిడ ఏమయినట్లు తెలుపకపోవుట కథలో కొంచెము లోపము వున్నట్లు కనబడును. గొలుసు నవల 'అపరాజిత' మొదటి భాగం కూడ చాల బాగున్నది.

కె. యస్. రామచంద్రమూర్తి, [వేగేశ్వరపురం]

ఉగాది ప్రత్యేక సంచిక

గెనిసెట్టి గారి అందమైన ముఖచిత్రంతో మా చేతుల కందిన ఉగాది సంచిక మాకు పూర్తి ఆనందాన్ని కలిగించింది. ఆంధ్ర నాటకరంగం గురించి ఆవేదనతో ఉమామహేశ్వరరావుగారు వ్రాసిన 'బాగు పడే దెప్పుడు' అన్న కథ ఎంతో బాగుంది. విశ్వేశ్వరయ్యలాంటి స్పాన్సరు కంట్రాక్టరు, డబ్బే ప్రధానంగా తలచి, తాగి తందనాలాడే అర్జున్‌రావులాంటి హీరోలు— నడుపు వృత్తికి, నాటకాలను సావుగా వాడుకొనే హీరోయిన్ సుభద్రలాంటి చీడ పురుగులతో మన నాటక రంగం నిండి ఉన్నప్పుడు— ఆ రంగం మరి బాగు పడదు— పడలేదు. సారధిలాంటి యువకులు ముందుకు వచ్చి పాటుపడితే తప్ప నాటకరంగం అభివృద్ధి చెందటం కష్టం. ఇటువంటి మంచి కథను వ్రాసిన ఉమా మహేశ్వరరావుగారికి, ప్రచురించిన మీకూ మా ఉగాది పార్థిక శుభాకాంక్షలు అందజేస్తున్నాము. బాలెట్‌లో గెలుపొందిన నటులకు మా శుభాకాంక్షలు. సాధారణ సంవత్సరములో వారు నటించిన చిత్రాలు అసాధారణ విజయాలను సాధించాలని మా ఆకాంక్ష.

కె. నరసింహాచార్యులు, కె. నాగేశ్వరరావు,
[బరంపురం]

* * *

ఈ వారం ఉగాది సంచిక మాకు ఎంతగానో నచ్చింది. ముఖ్యంగా ఉత్తమనటుడుగా పద్మశ్రీ నాగేశ్వరరావుగారు ఎన్నికైనందుకు మాకు చాలా సంతోషంగా వున్నది. అంతేకాదు. ఊర్వశి అవార్డు పొందిన శ్రీమతి శారదా చలం ఉత్తమ నటిగా ఎన్నికైనందుకు ఎంతో ఆనందముగా వున్నది.

బేబి పద్మిని 'సారీ' కుమారి పద్మినితో ఇంటర్‌వ్యూ చాలా బాగుంది. 'మేఘమాల' సీరియల్ ముగింపు ఒక మాదిరిగా వున్నది. కొత్త సీరియల్ శ్రీ నండూరి విఠల్‌గారి 'మమత' ప్రారంభమునే చాలా బాగుంది. 'ఇది న్యాయం' 'బాగుపడే దెప్పుడు' ఈ రెండు కథలు రెండ ఆణిముత్యాలుగా వున్నవి.

శ్రీమతి కె. వి. యస్. విమలా శ్రీనివాస్,
[నైవేలి]

* * *

మీ ఉగాది ఆంధ్రసచిత్ర వారపత్రిక నా కెంతో నచ్చింది. ఎందుకంటే అందులో నాకు అన్ని నాకు నచ్చినవే ఉండడం. ముఖ్యంగా శ్రీ నండూరి విఠల్ గారి సీరియల్ 'మమత' చాల నచ్చింది. ఇంకా ముందు ముందు ఎలా ఉంటుందో అని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాను. కాని అందులో పేర్లన్నీ ఏమిటో విచిత్రంగా వున్నవి. మంచిపేర్లు వ్రాసి యుంటే బాగుండేది. 'మేఘమాల' త్వరగానే ముగించినారు. ఆ ముగింపు నేను ముందే అనుకున్నదే. అందులో ఏమి మార్పులేదు. రాణిని త్యాగరాజుని కలిపిన రాజేశ్వరిని మెచ్చుకోకుండ ఉండలేము.

ఈ వారం పత్రికలో 'బాగు పడేదెప్పుడు' ఎస్. ఉమామహేశ్వరరావు గారి కథ నన్నెంతో ఆకర్షించింది. అందులో వ్రాసినవి అన్ని నేటి సమాజంలో జరుగుతున్నవి. నిజంగా వారు అన్నట్లు ఆంధ్ర నాటక రంగం అధ్వాన్నంగా తయారైంది. అందరిలోను మార్పు రావాలి. వారికి నా ధన్యవాదాలు తెలుపండి. ఇది న్యాయం కథ కూడ బాగుంది.

సీరియల్ 'అపరాజిత' మరో మలుపు తిరిగింది. శారగా జానకీరాణిగారు కథను చక్కగా నడిపించుకొస్తున్నారు.

పి. ఎం. శ్యామలాదేవి, [రేపల్లె]

సినిమా బాలెట్

మీరు నిర్వహించిన ఆంధ్రసచిత్ర వారపత్రిక సింధాల్ సినిమాబేలట్ ఫలితాలు చూసిన తరువాత ఈ ఉత్తరము రాయాలనిపించింది. ఎప్పుడు ప్రచురించే బేలట్ వివరాలు మీరు ఈసారి ప్రచు

రించ లేదు. శ్రీ ఎన్. టి రామారావుగారు బాలెట్ పోటీల నుండి విరమించుకొని, తనను ఎన్నిక చేయ వద్దని ప్రజలను కోరినందువల్ల, మనకు మిగి లింది నాగేశ్వరరావుగారే. అందువలన ఆయనే ఉత్తమనటుడిగా ఎన్నుకోబడ్డారు. ఇక మీ రెన్ని బాలట్‌లు నిర్వహించినా నాగేశ్వరరావు ఉత్తమ నటుడిగా ఎన్నికవడం ఖాయం. [ఎందుకంటే రామా రావుగారు పోటీ చేయుటం లేదు. పైగా నటులంటే ఈ ఇద్దరే అని చాలామంది అభిప్రాయ పడుతు న్నారు.] అందువలన ఇకనుండి మీరు బాలట్ పత్రంలో ఉత్తమనటుడి పేరు తొలగించవచ్చు. నా ఈ సలహాను హృదయపూర్వకంగా స్వీకరిస్తారని కోరుతున్నాను.

ఎస్. ప్రకాశరావ్, [బెంగుళూరు]

* * *

1969 వ సంవత్సరపు సినిమా బాలట్ ఫలి తాలు మేం వూహించిన విధంగానే యున్నవి. పోటీ లేనపుడు ఉత్తమనటుని ఎన్నికలో ప్రత్యేకత లేదు. ఇకముందు 'బాలట్‌పత్రం'లో 'ఉత్తమనటుని కాలమ్' అనవసరమేమో!

ఈ సంవత్సరం వోట్ల శాతం ప్రకటించక పోవడం కూడ శోచనీయాంశం. ఏమైనా బాలట్ విజేతలందరికీ మా అభినందనలు.

యల్. వి. వి. సత్యనారాయణమూర్తి, [కాకినాడ]

సి ని మా

ఉత్తరాలు శీర్షికలో శ్రీ రవి శర్మగారు [27—3—70 సంచిక] మరియు శ్రీ నరసింహా చార్యులుగారు [10—4—70] సంచిక వ్రాసిన 'తల్లా— పెళ్ళామా' చిత్రంపై విమర్శలు చదివాను.. శ్రీ రవి శర్మగారు వ్రాసిన దానిలో తప్పేమిటో నా కర్థం కాలేదు. ఆయన వ్రాసిన విమర్శ చాలా చక్కగానే ఉన్నది. శ్రీ రామారావు గారు తాను అనుకొన్న విధంగా చిత్రం తీయ లేదన్నది నిజం. హరికృష్ణ పోర్షను, కోర్టు సీనులు ఈ చిత్రానికి ఏవిధంగాను పనికిరావు. అంతే కాకుండా చాలా అసహజంగా వున్నాయి. కోడళ్ళను నానా బాధ పెట్టే కాలంపోయి స్త్రీలకు సమాన హక్కులు ఇచ్చి కొన్ని ప్రత్యేక హక్కులు కూడా ఇస్తూ గౌరవిస్తున్న ఈ ప్రస్తుత కాలంలో ఈ చిత్రాన్ని సరిగ్గా తీయలేదని చెప్పాలి. పోనీ, పెళ్ళాం కన్నా తల్లే గొప్పదని చెప్పదలచుకొన్నప్పుడు ఆ తల్లినే ఏ కన్న కొడుకుల సహాయం లేకుండా నిర్దాక్షి ణ్యంగా చనిపోయినట్లు చూపించటం అసహజంగా వున్నదని నా వుద్దేశం.

డి. వి. కూర్మనాథరావు, [వైజాగ్].

న్యూఢిల్లీ లేఖ

న్యూఢిల్లీ లేఖలో నిష్పక్షపాతమైన విమర్శ నిస్తున్నందులకు మీకు మా అభినందనలు. శ్రీ కృష్ణ గారికి నా నమస్కారములు.

జె. దేవిప్రసాద్ [అమ్మాపురం]

ఉత్తరాలు

వ్యాసాలు

మీ ఉత్తరాల శీర్షిక, వ్యాసాల తీరు చూస్తుంటే నిష్పక్షపాతంగా వ్యవహరిస్తునారని తేల్చి చెప్పడం సత్యదూరం కాదని దృఢంగా చెప్పగల్గుచున్నాను. ఆంధ్ర సచిత్రవారపత్రికకు ప్రాంతీయ దురభి మానం లేదని చెప్పడంలో పొరపాటు పడడం లేదను కుంటాను.

ఆంధ్రప్రదేశ్‌కే గాక క్రితం ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ విషవలయానికి అల్లంతదూరంలో ఉన్నందువల్లే మీరు నిష్పాక్షికంగా ఉండ గల్గా రన్నది నిర్వివాదాంశమనిపిస్తుంది. విశాలాంధ్ర ప్రదేశ్‌లో గల అన్ని ప్రాంతాల వారికి మీ పత్రి కలో సమానావకాశాలను కల్పిస్తూ, అందరి అభి ప్రాయాలకు సమాన విలువనిస్తున్నందులకు మీరు అభినందనీయులు.

విభేదాలన్నవి నిజంగా ఉంటే అవి పైకి చెప్పు కొని అసలు లోప మెక్కడుందో తెలుసుకొనుటకు పత్రికలు దోహదం చేస్తాయి. ఎవరో ఏదో వ్రాసి నందువల్ల అనవసరంగా లేనిపోనివి వూహించుకొని ఉరుకులెత్తటం అసహజంగా ఉంటుంది. ఇకముందు కూడా మీరీ బాధ్యత తు. చ. తప్పక నిర్వహించ గలరని నమ్ముచున్నాను.

ఉమెన్ కార్టూనులలో రాజకీయాలు ఒక అద్దంలో పట్టిన ప్రతిబింబాలను మరొక అద్దంలో [డూప్లికేట్సు అనుకునేరు. కుడి, ఎడమ తేడాలు రాకుండా] చూస్తున్నట్లుంటున్నాయి.

3—4—70 పత్రికలో పాఠకులను ఏప్రిల్ ఫూల్స్ చేసినప్పటికీ, 'సారీ సార్' అని చెప్పి నందువల్ల స్పోర్టివ్‌గా తీసుకునేట్లు చమత్క రించారు.

ఎస్. మూర్తి, [పూనా]

కార్టూన్

3—4—70 సంచికలో 'బాపు' పేరుతో సుబ్బారావుగారు వేసిన కార్టూన్లు చూశాము. కాని, వారనుకొన్నట్లు మా మిత్రమండలి 'ఏప్రిల్ ఫూల్స్' కాలేదు. 13—14 సంవత్సరాలుగా కార్టూన్లు వగైరాలను ఆసక్తితో పరిశీలించే మా వంటివారిని, సుబ్బారావుగారి బొమ్మలు, 'బాపు' అనే పేరు మోసం చేయలేవు. పేరు చూడనక్కర లేకుండానే, సుబ్బారావుగారి బొమ్మ లను మేము అవలీలగా గుర్తించగలం. సత్యవర్తి, సుబ్బారావు, జయదేవ్, చంద్ర, వంటి వారి స్ట్రోక్ చాలా తేలిగ్గా తెలిసిపోతుంది. పాఠకుల్ని ఏప్రిల్ ఫూల్స్‌ను చేద్దామనుకొన్న ప్రయత్నం పూర్తిగా నెరవేరలేదు!!

కె. రవిశర్మ, [విశాఖ]

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 24—4—'70
శ్రీ సాధారణనామ సం॥ చైత్ర బహుళ తదియ
సంపుటము : 63 సంచిక : 32

స్థాపితము
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్


ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
హిందీతార మహమూద్ మగాని


ఎస్ ఎస్ పి. ప్రదర్శకులపై పోలీసులు చర్యతీసుకున్న తర్వాత చవాన్ ప్రతిరూపం
కొత్త కాంగ్రెస్ నించి నిష్క్రమిస్తున్న పట్నాయక్
పట్నాయక్
కొత్త కాంగ్రెస్
పాత కాంగ్రెస్
లోపలికి దయ చేయండి. కాని వెనుక నుంచి కాలు నడపడానికి ప్రయత్నం చేయవద్దు
ఉ. ప్ర మంత్రివర్గం
కొత్త కాంగ్రెస్
సంస్థానాధీశులం పోరాడ లేరని ఎవరన్నారు?
సంస్థానాధీశులు
రాజభరణాలు

లోక్‌సభలో మెజారిటీ తగ్గిపోతున్న శ్రీమతి గాంధీ ప్రభుత్వం

లోక్‌సభలో ప్రభుత్వానికి ఉన్న మెజారిటీ 39కి తగ్గిపోయింది. పోయిన సోమవారంనాడు ఉదయం పార్లమెంటువీధిలో ఎస్. ఎస్. పి. ప్రదర్శకులపై 144 సెక్షన్‌ని అతిక్రమించినందుకు పోలీసులు చర్య తీసుకోడం జరిగింది. దానిపై న్యాయ విచారణ జరపాలన్న ప్రతిపక్షం కోర్కెని ప్రభుత్వం అంగీకరించింది. దాని ఫలితం యిది.

ఉద్దేశ్యాలు రెండు...

ఏది ఏమైనా రెండు తప్పులు కల్పి ఒక ఒప్పు కాదు. మేడమ్‌గాంధి బాంకుల జాతీయకరణకి ప్రచారం తీసుకురావడానికి తసంవత్సరం యిలాంటి అతిక్రమణే ఒకటి జరిగింది. రెండు ముఖ్యోద్దేశాలతో యిక్కడ న్యాయాన్ని అతిక్రమించడం జరిగింది. ఒకటి మేడమ్ గాంధి పలుకుబడి పెంచేందుకు. రెండోది ఆమె విధానాలపై అసమ్మతి ప్రదర్శించడం.

అదే ఒక కమ్యూనిస్టు ప్రదర్శనే అయి వుంటె ఇలాగే చర్య తీసుకోడం జరిగి ఉండేదా అన్నది ప్రస్తుత పరిస్థితికి వర్తించే వో ప్రశ్న.

విచిత్రమైన కోరిక

ఈ విషాదకరమైన సంఘటనలో మరో ఆసక్తికరమైన అంశం ఉన్నది. కమ్యూనిస్టులు, ప్రతిపక్షంవారి కోరిక ప్రస్తుతం పదవిని కొనసాగిస్తున్న హైకోర్టు లేక సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తి ఆ న్యాయ విచారణ జరపాలని దేశంలోని న్యాయవిధానాలపై కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లోపలా బయటా ఉన్న వారి సహాయకులూ క్రమ పద్ధతిలో దాడిచేసిన పిదప ఈ కోరిక కోరడం వింతగా ఉన్నది.

అంతర్నాటకం

గత సోమవారంనాడు లోక్‌సభలో ప్రభుత్వానికి కొద్దిలో తప్పిన వోటమికి యింకో ఆసక్తికరమైన అంతర్నాటకం ఉన్నది. పార్లమెంటు వీధిలో జరిగిన పోలీసు చర్యని అధిక్షేపించడానికి కమ్యూనిస్టు నాయకులు ప్రొఫెసర్ హీరేన్‌ముఖర్జీ నాలిక మడత పెట్టి వోళ్ళంతా కదిలించారు.

శ్రీ హిరేన్‌ముఖర్జీ సి. పి. ఐ. వర్గానికి ఉప నాయకులు. శ్రీ లిమాయే మొదలగువారు పోలీసుల చేతిలో దెబ్బలుతిన్న తర్వాత వారిని చూసినప్పుడు తనకి పోలీసు దెబ్బల కారణంగా ప్రాణాలని కోల్పోయిన లాలాలజపతిరాయి, పూర్తిగా వికలాంగులైన పండిట్ గోవింద్ వల్లభ్ పంత్‌గార్లు తనకి జ్ఞాపకానికి వచ్చారని శ్రీ ముఖర్జీ అన్నారు.

న్యాయవిచారణ పదవీ విరమణ చేసిన న్యాయమూర్తిచే కాకుండా ప్రస్తుతం పదవిలో ఉన్న న్యాయాధికారే జరపాలని శ్రీ ఇ. కె. నాయనార్ [సి. పి. ఎం.] అన్నారు. దోషులైన అధికారులని శిక్షించాలని కూడా అన్నారాయన.

నాగరిక దేశాల్లో నమ్మకద్రోహంగా చెప్పుకునే మామూలు కమ్యూనిస్టు చిట్కాలు ఆ తర్వాత ఉండనే ఉన్నాయి.

ప్రధానికి స్నేహపాత్రులైన పార్టీ నాయకులు సీట్లలోనుంచే ఓట్లని నమోదు చేశారు. కానీ వారి అనుయాయులుమాత్రం త్వరగా పలచబడిపోయారు. వోటింగ్ సమయంలో డి. ఎం. కె., పి. పి. ఐ. సి. పి. ఐ. [ఎం] మొదలైన స్నేహంగాఉన్న ప్రతిపక్షాలు గైరు హాజరు కావడం కాయుక్తితో వచ్చిన ఒక కార్యక్రమం. ఈ పథకం ప్రధాని వోటమిని తప్పించుకోడానికి వీలు కలిగించింది కాబట్టి వారికి ఆమె యింకా ఋణపడి ఉండేలా చేసింది.

ఈ చర్చలో యింకో కొత్తవర్గం తల ఎత్తింది. అదే 'శాసన సభ్యుడు' అన్న వర్గం. అనామకుడైనా శాసన సభ్యునిగా ఎన్నిక అవటం తరువాయి తనకి అధిక సౌకర్యాలు కావాలని కోరుతాడు.

రూపొందించేవారే ఉల్లంఘించేవారూ

కీ. శే. డాక్టర్ రామ్ మనోహర్ లోహియాకి ఢిల్లీ ఆస్పత్రిలో సరైన చికిత్స జరగలేదనే ఆరోపణపై చర్చ లోక్‌సభలో జరిగింది. పార్లమెంటు సభ్యుల కారణంగా అత్యవసరంగా వైద్య సహాయం అవసరం ఉన్న ఎందరు రోగులు నిర్లక్ష్యం చెయ్యబడుతున్నారో కూడా గమనించాల్సి ఉన్నది. సోమవారంనాడు పోలీసు ప్రదర్శకులపై చెయ్యి చేసుకోడానికే పార్లమెంటులో జరిగిన చర్చలో అధిక ప్రాధాన్యత యివ్వబడింది. ముఖ్యంగా పార్లమెంటు సభ్యులపై పోలీసువారు చెయ్యి చేసుకోడం అన్నది ఎత్తి చూపడం జరిగింది. ఇక్కడ అసలు ప్రశ్న అన్నది శాసనాలు రూపొందించేవారే వాటిని ఉల్లంఘించడానికి ప్రయత్నించేవారుగా ఎందుకుండాలి అన్నది. వారు యితరులకోసం చేసిన చట్టాలని అమలు జరుపుతున్న పోలీసుని ఎదిరించడానికి ఎందుకు ప్రయత్నించాలి?

కమ్యూనిస్టుల ఆయుధాలు

కమ్యూనిస్టులు బయటి సమాజానికి ప్రధాన శత్రువులని దగినవారు. వాళ్ళ దగ్గర మూడు రకాల ఆయుధాలు ఉన్నాయి. వారు రాజ్యాంగాన్ని పడగొట్టడానికి దానినే ఉపయోగిస్తారు. దీనికి ఉదాహరణ పశ్చిమ బెంగాల్, న్యూఢిల్లీలు. ఇక రెండోది సర్వీసులలో విభేదాల్ని సృష్టించడం. ఇది చాలా ఏళ్ళుగా జరుగుతూ ఉన్నది. శ్రీ ఎస్. ఎం. బెనర్జీ కొన్ని సంవత్సరాలపాటు కేంద్ర సర్వీసులలో పలుకుబడి కలిగి ఉన్నారు. మూడేళ్ళక్రితం ఢిల్లీ పోలీసు సమ్మెలో ఆయనముందు నిలబడ్డారు. కేంద్రప్రభుత్వోద్యోగులు రెండేళ్లకిందట చేసిన విఫలమైన సమ్మె సమయంలో కూడా ఆయన అదేవిధంగా చేశారు. ఇండియన్ సివిల్ సర్వీసుమాత్రం యింతవరకూ వారికి అందకుండాఉన్నది. బాబూ జగ్‌జీవన్‌గారి సిద్ధాంతం, దేశీయాంగమంత్రి తాము నిలదొక్కుకోడానికిపడుతున్న అవస్థల దయవల్ల యిప్పుడు ఐ. సి. ఎస్. కూడా వారి దాడికి గురవుతున్నది.

రాజ్యాంగం అన్న కట్టడానికి న్యాయపీఠం అన్నది మూడవ స్తంభం. బాంకుల విషయంగా సుప్రీమ్ కోర్టు తీర్పు అనంతరం న్యాయపీఠంపై దాడి ఆగకుండా జరుగుతూనే ఉన్నది.

విచారకరమైన విషయం ఏమంటే శ్రీమతి గాంధి అటు న్యాయపీఠాన్నికానీ యిటు సర్వీసులని కానీ సమర్థించకపోవడమే. పైగా దానికి విరుద్ధంగా రాజ్యాంగంలోకి ప్రమాదకరమైన మార్పుల్ని తీసుకొస్తున్నారు.

తమ పార్టీలోనే టిక్కెట్టు దొరకనందున రాజ్యసభలో సభ్యత్వాన్ని కోల్పోయిన మంత్రులసంఘాన్ని, ముగ్గురు డెప్యూటీ మంత్రులని బడ్జెట్ చర్చ ముగిసేవరకూ కొనసాగించవలసిందని అన్నారు. ఆమె రాజకీయ సౌలభ్యంకోసం వారిని పదవులలో కొనసాగించనీయడం అన్నది రాజ్యాంగ విరుద్ధం. ఇది తప్పకుండా తర్వాత ఆమెకి చిక్కుల్ని తెచ్చిపెడుతుంది. పరిపాలనలో ఉన్న కాంగ్రెస్ పక్షంలో పురోగమనవాదులు అనబడే యువతరంవారు శ్రీమతి గాంధి గారి కోరికని రాజ్యాంగ విరుద్ధం అంటూ ఆక్షేపించి ప్రతిపక్షంలో కలవడం దీనిని విశదంచేస్తుంది.

కాంగ్రెస్‌లో చీలిక అనంతరం శ్రీమతి గాంధి తమకు రాజకీయపరంగా ఎంతో ఋణపడి ఉన్నారని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఆమె సలహాదారులు కొందరు ఎన్నికలు వాయిదా వేయాల్సిందిగా సూచనచేసినట్లు తెలుస్తోంది. దీనివల్ల ఆమె వోర్పు సవాలుకి నిలబడాల్సి ఉంటుంది.

కమ్యూనిస్టులు, వారి అనుయాయులు ఇండియాకి పశ్చిమ దేశాలతో సంబంధం లేకుండా చేయడానికి కంకణం కట్టుకున్నారు. అంతేగాక కేంద్రం తన మాటని తాను నిలబెట్టుకోలేనిదిగా అందరికీ ప్రదర్శించాలని వారిప్రయత్నం ఐ.సి.ఎస్. వారి సదుపాయాలని రద్దు చేయాలన్న ఆందోళన దీనిని స్పష్టం చేస్తుంది.

ప్రస్తుతం ఐ. సి. ఎస్. ఉద్యోగులు 115 మంది మాత్రమే ఉన్నారు. వారిలో ఆఖరు వ్యక్తి 1979లో పదవీ విరమణ చేస్తారు. కానీ ఇది ఒక్క ఐ. సి. ఎస్

లకే పరిమితంకాదు. ఏ రకమైన పరిపాలనా దొకతకల వారైనా చాలా కొద్దిమంది ఉంటారు. అయితే పాతబడిపోయిన ఈ .ఐ. సి. ఎస్. వారి సౌకర్యాలు దేశ ఐక్యతకి ఏవిధంగా ముప్పు తెస్తాయన్నది యింకా తేలాల్సి ఉన్నది. కానీ కేంద్రం ఐ. సి. ఎస్. వారి సౌకర్యాలని, రాజభరణాలని రద్దు చేయాలనుకోవడం ఐక్యతకి ముప్పు వాటిల్లుతుందని మాత్రం కాదు. అది రాజకీయ దృష్ట్యా లాభసాటిగా ఉంటుందనే ఉద్దేశ్యంతోనే.

ఇతరుల అభిప్రాయాలు

దేశపురోగమనం ఎలా ఉందన్న దానిని యితరుల అభిప్రాయాలని బట్టి అవగాహన చేసుకోవచ్చు. "ది లండన్ ఎకానమిస్ట్" పత్రిక గతవారం ప్రచురించిన ఒక వ్యాసంలో యిలా ఉంది.

భారతరాజకీయ వాదులని ఆపి ఆలోచింపజేసిన నెల మార్చి. రాజ్యసభ ఎన్నిక ఫలితంగా శ్రీమతి గాంధికి పార్లమెంటులో 14 వోట్లు తగ్గిపోయాయి. పరిపాలనలో ఉన్న రెండుపార్టీల లోని విభేదాల కారణంగా పంజాబ్, కాశ్మీర్‌లలో ప్రభుత్వం అనేది లేకుండా పోయింది. పశ్చిమ బెంగాలులో మూడు సంవత్సరాల కాలంలో రెండోసారి రాష్ట్రపతి పరిపాలన నెలకొల్పడం జరిగింది. మాజీ ఉప ప్రధాని స్వంతరాష్ట్రంలోనే పక్క రాష్ట్రం అయిన బీహారులో రాజకీయ పర్యటనకి వచ్చిన మార్క్సిస్టు నాయకుడు శ్రీ జ్యోతిబాసుపై హత్యా ప్రయత్నంజరిగింది.

ఈ సంఘటన లన్నిటిలో ప్రధానంగా కనిపించేది రాజకీయ సంబంధమైన అవకాశవాదం. పంజాబ్, కాశ్మీర్‌లను మంత్రివర్గాలు పడిపోవడానికి వ్యక్తిగత అధికారదాహం, విధానాలేకారణం. అదే రాజ్యసభ ఎన్నిక విషయంలో కూడా జరిగింది. అందులో ప్రధానిని బలపరచే కుడి, ఎడమ పక్షాలలోని అతివాదులు ఓడిపోయారు. వామపక్షం కమ్యూనిస్టులు రెండు సీట్లు, హిందూ జనసంఘ్ అయిదు సీట్లు గెల్చుకున్నాయి. అంతేకాకుండా వివరణ అనేది లేని, శ్రీమతి గాంధిని బలపరచే, కాంగ్రెస్ వారు నిలబెట్టిన ఇండిపెండెంట్లు రంగంలోకి రాలేకపోయారు. అయితే పార్టీ క్రమశిక్షణ అన్నది భారతరాజకీయాలకేమీ కొత్తవిషయంకాదు. అది 1967 సాధారణ ఎన్నికలనుంచీ ప్రభుత్వాలు తలక్రిందు లవుతున్న రాష్ట్రాలకి మాత్రమే పరిమితమైనది. రాష్ట్ర శాసన సభ్యులుకూడా పాల్గొనే రాజ్యసభ ఎన్నిక రాష్ట్రాల రాజకీయ అలవాట్లు భారత జాతీయ రంగంపై ప్రదర్శించినపుడు ఎలా ఉంటున్న విషయం ప్రస్ఫుటం అయింది

పధ్నాలుగు పార్టీలు కలిసి రూపొందించిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పడిపోవడానికి ఈరకమైన అవకాశవాదమే కారణం. ప్రభుత్వంలో తమకు గల పదవుల సహాయంతో మార్క్సిస్టుల విధ్వంసాత్మకమైన కల్లోలాలని సృష్టించారు. కమ్యూనిస్టేతరులైన వారి భాగస్తులు తమపదవుల్ని శాశ్వతం చేసుకోవాలని పాటు పడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేకత ఏమంటే 'అరాష్ట్రంలో ఉద్రిక్తత, నియంమం అన్నవి లేని రాజకీయాలు ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. మిగతా రాష్ట్రాలకీ దానికీ గల తేడా అదే. దేనిని చేయరాదో ఈ రాష్ట్రంలోని పరిస్థితి నిరూపించింది. కనుక ఇండియాలోని మిగతా రాష్ట్రాలలో అలాంటి పరిస్థితి ఏర్పడకుండా చేసుకోడానికి అది పనికి వస్తుంది.

అసలు బెంగాలీలు తాము మిగతా భారతీయుల కన్నా తెలివిగల, రాజకీయాలలో ప్రజ్ఞ ఉన్న, ఉడుకురక్తం కల ఒక ప్రత్యేక జాతిగా అనుకుంటారు. తోటి భారతీయులు యింకోవిషయయాన్ని కూడా చేర్చాతు. అది వారు మిగతా వారికంటే ఎక్కువ బాధ్యతారహితంగా కూడా ప్రవర్తిస్తారని. ఏదైనా అతిగా జరగటానికి బెంగాలు పెట్టింది పేరు. ఈకరకమైన మనస్తత్వం, పరిస్థితి కమ్యూనిజం అక్కడ పుట్టడానికి దోహదం చేసింది.

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నించి చీలిన చిన్న ముఠాలు అధికార గర్వం అన్నదాన్ని అక్షేపించడం, పాతుకుపోయిన నాయకుల లంచగొండితనాన్నిదుయ్యబట్టడం ప్రారంభం అయింది. అయితే ఈ మిశ్రమ వర్గాలన్నిటికీ వాటికి తగ్గ చిక్కులు వాటికి ఉండనే ఉన్నాయి. అయిదు రాష్ట్రపతి పాలనని అనుభవించాయి. రెండు కాంగ్రెస్ప్రభుత్వాలతో కలిపి మొత్తం ఏడు ప్రభుత్వాలు తమ రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాన్ని కనీసం ఒక్కసారైనా మార్చుకోవడం జరిగింది. ఇప టివరకూ ఒక్క ఒరిస్సామాత్రం అంచంచలంగా ఉంది. కాని అదికూడా యిటీవల సభ్యుల పార్టీ మార్పు బెదిరింపు వల్ల చలించింది. గతవేసవిలోకాంగ్రెస్‌లో మూడు వంతులని పాత కాంగ్రెస్‌వారి నుంచి వేరుగా నడిపినప్పుడు యిదే పద్ధతి న్యూఢిల్లీలో కూడా అనుసరించడం జరిగింది. ఆమె ఐక్యసంఘటనకి అంగీకరించలేదు. అయితే రాజ్య సభ ఎన్నిక తర్వాత యిప్పుడు కమ్యూనిస్టులు , యితర ప్రతిపక్షాలపై మెజారిటీకోసం శ్రీమతిగాంధి ఆధారపడతారన్న విషయంలో అనుమానం లేదు.

అందువల్ల కేంద్రంతో పాటు మరి ఏడు రాష్ట్రాలు పూర్వాంగాలు పరిస్థితిని చవి చూస్తాయి. అస్తవ్యస్తత, సహజత్వంలేని, పథకం ప్రకారం ఏర్పడనట్టి సఖ్యత కొరవయిన పార్టీల ఐక్య సంఘటన లేకాకుండా రాజకీయ పరమైన హింసాకాండలు కర్షకులలో, కార్మికులలో అసంతృప్తి, సమ్మెలు అన్న యింకో రెండిటిని 'ాడా భారతదేశంలోని ఎక్కువభాగం చవి చూస్తుంది.



ఒకప్పుడు నేను పశ్చిమ బెంగాల్‌లో బంగ్లా కాంగ్రెస్‌ని బలపరిచాను.
తర్వాత సి. పి. ఐ. కి మారాను. ఇప్పుడు రాష్ట్రపతికి అనుకూలుడిని.

సంపాదించని డబ్బు



తేళ్లపల్లి వెంకటలక్ష్మీనారాయణ

ధర్మారావు కాలేజినుంచొచ్చి యింట్లోకి వెళ్లబోతూ తన యింటికి రెండు వైపుల వున్న యిళ్లవంక వకసారి చూశాడు. ధర్మారావుకు యిలా ఆ యిళ్లవైపు చూసి లోపలికెళ్లటం రోజూ అలవాటు. అందుకు కారణం లేకపోలేదు. అతను అద్దెకు వుండే ఆ పెంకుటింటికి మూడు ప్రక్కలా వున్న ఆ యిళ్లు అతనింట్లో వచ్చే మనస్తాపాలకి, అశాంతికి కారణం. అతనలా ఆ యిళ్లవైపు చూస్తూ వుండగానే ఒక యింట్లోంచి ఫియట్‌కారు, యింకో యింట్లోంచి అంబాసిడర్‌కారు బయటకు దూసుకొచ్చి రోడ్డెక్కినయ్. అయిదింటిదాకా కాలేజీలోవుండి అయిదున్నరకు యింటికొచ్చే ధర్మారావుకు ఆవేల్టికి కార్లల్లో క్లబ్బులకి బయల్దేరుతున్న ప్రక్కయిళ్లల్లోని శివరామ్, నారాయణ రోజూ కనిపిస్తూనే ఉంటారు. శివరామ్, నారాయణ వుండేవాట్ని యిళ్లు అన కూడదు. అవి భవంతులు. ఆ భవంతులమధ్య యీ పెంకుటిల్లెందుకున్నదా?' అని ధర్మారావు రోజూ విచారిస్తాడు. ఉన్నా తనీ యింటినే ఎందుకు అద్దెకు తీసుకున్నానా అని బాధపడ్తాడు. చిన్న యిల్లు, ముందువైపు పూలమొక్కలు ....యివన్నీ ధర్మారావుకు ఆ యిల్లంటే యిష్టాన్ని కల్పించినయ్. పైగా మూడు వందలు జీతం వచ్చేతను యేభై రూపాయల కంటె ఎక్కువ అద్దె యిచ్చుకోలేడు. ఆ మాత్రం అద్దెకు ఆ పట్టణంలో అలాంటి యిల్లు దొరకటం నిజంగా అదృష్టమే. ఆ మాటే ధర్మారావు భార్య రమ కూడా మొదట్లో అనేది. కానీ నాలుగయిదు రోజులు ఆ యింట్లో వుండి ప్రక్క యిళ్లల్లోని వ్యక్తుల్ని, వాళ్ల వస్తువుల్ని చూస్తూ వుంటే తాముండేదీ వక యిల్లేనా, తాము జీవించేదీ ఒక జీవితమేనా అనే బాధ రమలో రోజు రోజుకూ అధికం అవుతోంది.

'రమా!' అంటూ తలుపు తట్టాడు ధర్మారావు.

రమ తలుపు తీసింది. ముందు గదిలోకి వెళ్లి బూట్లు విప్పుకుంటుండగానే రమ చెప్పటం మొదలెట్టింది.

"వీ, వీ.....మధ్యాహ్నం మూడు గంటల్నుంచి మొదలెట్టినా యీ కుంపటి వెలిగించటం నా చేత కాలేదు.....నాకు తెల్సు. నా ప్రాణం యీ కుంపటి వెలిగించటంతోనే పోతుంది. ఎవరింట్లో చూసినా స్టౌలు, కొల్‌గ్యాస్‌లు.....నా మొహాని కా అదృష్టం లేదు......"

ధర్మారావు బూట్లు విప్పుకోవటం ఆపి ఒక్క క్షణం భార్య ముఖంలోకి చూశాడు. ఒకనెల క్రితంవరకూ భార్య యిలా చెప్పినపుడల్లా 'ఉన్నదాంతో సంతృప్తి పడటం' అన్న విషయంమీద ఒక చిన్న లెక్చెరు సమాధానంగా యిచ్చేవాడు. తను చెప్పేదంతా వృథా అని తెల్సుకుని యిప్పుడు మానేశాడు. వేదాంతిలా ఒక నవ్వుమాత్రం బలవంతంగా నవ్వుతాడు. ఇప్పుడూ అదే పని చేసి మళ్లీ బూట్లు విప్పుకోవటం మొదలెట్టాడు.

"ఇంకో అరగంటాగితేగానీ మీకు కాఫీ రాదేమో....అప్పటికయినా నా ప్రాణం తియ్యకుండా యీ కుంపటి వెలిగితేను" అంటూ లోపలికి వెళ్లింది రమ.


ధర్మారావు బూట్లు విప్పి సాక్సు తియ్యటం మొదలెట్టాడు. సాక్సు రెండు మడమల దగ్గర, ముందువైపు చిరిగున్నయ్. బొటన వ్రేళ్లు ఆ చిరుగుల్లో పడి సాక్సు ఒకంతట కాళ్లనుంచి రాలేదు. ధర్మారావు నవ్వుకున్నాడు. కొత్త సాక్సు కొందామని రెండు నెలలనుంచీ ప్రయత్నం. ఎప్పటికప్పుడు 'టైట్ బడ్జెట్'వల్ల పై నెలకి వాయిదా వెయ్యటం అలవాటయిపోయింది.

బూట్లని ఒక మూలకి తోసి కిటికీ దగ్గర నిలబడ్డాడు. శివరావ్ భార్య పోర్టికోలో కూర్చుని నాజూకుగా అల్సేషియన్ కుక్కకి బిస్కట్లు విసుర్తోంది. చైనావాళ్లని భారత భూభాగంనుంచి కదిలేట్టు చెయ్యొచ్చేమోగానీ, యీవిణ్ణిమాత్రం పోర్టికోలోంచి నాలుగడుగులు బయటకు వేయించలేం. వాళ్ల బ్యాంకుఎకౌంటు, ఇనస్పెక్టర్ల సైజుకి సాక్ష్యం అన్నట్టు ఆవిడ శరీరం పెరిగిపోకుండా అలాగే ఉండిపోయింది. పోర్టికోలో కూర్చునుంటె ఒక చిన్న సైజు పర్వతం మాదిరుంటుంది...నౌకరు కాఫీ కప్పు తీసుకొచ్చి ఆవిడ కిచ్చాడు. ఆ నౌకరు తెచ్చింది 'కాఫీ' అనుకున్నాడు ధర్మారావు. కానీ అదేదో విలువైన టానిక్కు అయ్యుంటుంది. ధర్మారావుకు యీ విలువైన పానీయాల్ని ఎడ్వర్టయిజుమెంటుల్లో చూసిన గుర్తేగానీ తనింట్లో ఎప్పుడూ చూడలేదు...ఆవిడ కాఫీలాంటి దేదో తాగుతుంటె తను కాఫీ తాగలేదని గుర్తుకొచ్చి వంటింట్లోకి చూశాడు ధర్మారావు. రమ కుంపటి విసుర్తోంది. కుంపటిలో నిప్పంటుకున్న సూచనలేవీ కనిపించలేదు. రమ ముఖం ముప్పయ్యో తారీఖున ధర్మారావు ముఖం ఉన్నట్లుంది. మళ్లీ ముందు గదిలో కొచ్చాడు ధర్మారావు.

పక్కింటి భారీ శరీరం ఆవిడ ద్రాక్షపళ్ల బుట్ట ముందు పెట్టుక్కూర్చుంది. ఆవిణ్ణి ఎప్పుడు చూసినా ఏవో చిరుతిళ్లు తింటూనే వుంటుంది. 'మీ రీ జన్మకి తినాల్సిందంతా యిప్పటికే తినేశారు. యింక అన్నం తినొద్దు' ని డాక్టరు ఆమె ఆరోగ్య పరిస్థితిదృష్ట్యా సలహా యిచ్చాట్ట. ఆవిడ 'సరే'నని అన్నం మానేసి చిరుతిళ్లమీద పడింది. పైగా డాక్టరు తినమన్నాడంటుంటే కూడాను. ఆవిడకేం తినక? ఆవిడొక దత్తపుత్రుడి భార్య. ఈ దత్తపుత్రుల్ని చూస్తుంటె ధర్మారావుకొక విధమైన అసహ్యం. ఒక ప్రసిద్ధ రచయిత అన్నట్టు వీళ్లని గురించి ఆలోచిస్తుంటె ధర్మారావుకు ఒళ్లు గరిపొడుస్తుంది. అయినా వీళ్లు పెట్టిపుట్టిన అదృష్టవంతులు. ఈ భారీ శరీరం ఆవిడ భర్త పెంపకానికొచ్చిన పెద్దమనిషి. ఆయనెవరో అడ్డమైన గడ్డితిని డబ్బు సంపాదించి చచ్చిపోతూ యితగాణ్ణి పెంచుకుని యితగాడు యింటి పేరు మార్చుకున్నందుకుగాను లంచంగా కాబోలు తన ఆస్తినంత యిచ్చిపోయాడు. చచ్చిపోతూ 'నాయనా! నువ్వు చెయ్యాల్సిందల్లా ఏమీ లేదు.; నా ఆస్తి తింటూ, పిల్లల్ని కంటూ నా వంశాన్ని వృద్ధి చెయ్యి' అన్నాట్ట. అలాగే చేస్తానని మాటిచ్చాడీ గాడు. అయినా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోటం ఇష్టంలేక రాజకీయాల్లోకి దిగుదామనే వుద్దేశ్యం వచ్చి స్నేహితుల్ని సలహా అడిగాడు. వాళ్లు—భేషుగ్గా వుంది నీ వుద్దేశ్యం. ఆ పనే చెయ్యి. ఈనాడు రాజకీయ నాయకునికి పార్టీలు మార్చాల్సిన అవసరం ఎంతయినా వుంది. ఆస్తికోసం తల్లితండ్రుల్ని వదిలేసి యింకోళ్లని తలిదండ్రులుగా చేపట్టిన నువ్వు రాజకీయాల్లో బాగా షైనవుతావ్' అన్నారు. అందుకనితగాడు రాజకీయాల్లోకి దూకాడు. ఇలా ఎవరో సంపాదించిన ఆస్తిని ఖర్చు చేస్తూ యింట్లోకి అన్నీ అమర్చుకోవటం ఒక గొప్ప విషయంగా వాళ్లు భావించవచ్చు; కానీ రమకు కూడా యీ వుద్దేశ్యమే రావటం విచారించదగ్గ విషయం.....

ధర్మారావు వంటింట్లోకి తొంగి చూశాడు. రమ కుంపటి విసురుతోంది. కుంపట్లో అడుగు నెక్కడో నిప్పురవ్వ మెదుల్తోంది. రమ ముఖం ముప్పయ్యొకటో తారీఖు సాయంత్రం ధర్మారావు ముఖం వున్నట్లుంది.

ధర్మారావు మళ్లీ ముందు గదిలో కొచ్చాడు. ఇటువైపు కిటికీలోంచి నారాయణ యింటివైపు చూశాడు. నారాయణ పిల్లలు మైదానం లాంటి యింటి ఆవరణలో బంతులతో ఆడుకుంటూ...ఏంవిటి మనిషీ!... ఏంవిటీ మనిషీ! అని యింగ్లీషులో ఒకళ్ళనొకళ్లు కసురుకుంటున్నారు. మధ్యమధ్య బంతితో నౌకరు



వీపుమీద కొడుతూ శేరింతలు కొడుతున్నారు. ధర్మారావుకు పూలచెట్ల దగ్గర కూర్చుని విరిగిన గిలక్కాయలు ముందు వేసుకు కూర్చుని వీధిలోపోయే కార్లవంక పక్కింటి పిల్లలవంక చూస్తున్న రాము, లక్ష్మి కనిపించారు. వాళ్లిద్దరూ వాళ్ళు పుట్టిన దగ్గర్నుంచి గుండ్రంగా తిరిగే రైలు బండి కొనిపెడ్తానని ఆశ పెడుతున్నాడు...

'నాన్నగారూ!' అంటూ రాము ధర్మారావు దగ్గర కొచ్చాడు.

'ఏవిటి బాబూ!' అన్నాడు ధర్మారావు రాముని దగ్గరకు తీసుకుంటూ.

సంపాదించని డబ్బు


'వానగారూ! ఇందాక సురేష్ వాళ్ల మూడు చక్రాల సైకిల్ మీద ఎక్కనివ్వమంటె ఎక్కనివ్వలేదు. నాకు అట్లాంటి సైకిలు కొనిపెట్టండి' అన్నాడు రాము.

ఆ సురేష్ పక్క భవంతిలోనిదత్తపుత్రుని పుత్రుడు. 'అలాగేబాబూ......కొంటాను' అన్నాడు ధర్మారావు బాబుని ఒళ్లో కూర్చోబెట్టుకుంటూ.

'ఆ.....నీకు సైకిలు కూడాను!! ఒక స్టౌ కొంటానికే మనకు గతిలేదు' అంటూ రమ కాఫీ కప్పుతో గదిలో కొచ్చింది.

'రమా! నోర్ముయ్...ఇష్టం వచ్చినట్టు మాట్లాడకు' అంటూ ధర్మారావు విసురుగా కుర్చీలోంచి లేచాడు. రమ మాట్లాడలేదు.

'అయినా యిది నీ తప్పుకాదు. చుట్టూ వున్న వ్యక్తుల్నిచూస్తుంటె నీకు మన పేదరికం గుర్తుకు రావటం సహజం. కానీ నేను బ్రతికేది, మిమ్మల్ని బ్రతికించేది నా శక్తితో న్యాయంగా సంపాదించే సంపాదనతో. అందులోని సంతృప్తి నువ్వు గ్రహించనంతవరకూ నీకసో, నాకూ...యీ యింట్లో ఎవ్వరికీ మనశ్శాంతి ఉండదు' అని ధర్మారావు పెరటివైపు వెళ్ళాడు.



నారాయణ యింట్లోని రేడియోగ్రాం తెలుగు పాటలు వినిపిస్తోంది. వాళ్లింట్లో బోల్డు మెత్తని పరుపులు, ఫేన్లు, రేడియోలు, రేడియోగ్రాంలు. వీటన్నిటిమధ్య వుంటూ తమ కేమీ లేదని రమ బాధపడటం సహజం..... ధర్మారావు నూతి గట్టుమీద కూర్చున్నాడు. నారాయణ పెళ్లాం, పిల్లలు పెద్దగా నవ్వుతున్నారు. ఏదో అశ్లీలపుపాటకు అర్థం విడమర్చి చెప్పుకుని కాబోలు! నారాయణ యీనాడు యీవూళ్లో పెద్ద వ్యాపారి. కానీ నారాయణ తండ్రి కొన్నేళ్ల క్రితం హైదరాబాదులో కూలి పని చేసుకునేవాడు. ఒకసారి మూసీనదికి ఉధృతంగా వరదలొచ్చినయ్. వరద రెండు మూడు రోజులు నగరాన్నంతా భీభత్సం చేసింది. ఆ రెండు రోజులూ ప్రాణాల్నెలాగో రక్షించుకుని వరద యింకా తగ్గుముఖం పట్టకముందే నారాయణ తండ్రి వీధులవెంట పడ్డాడు. ఎందరో మార్వాడీ వాళ్ల భార్యల శవాల దగ్గర అయ్యో.. అక్కయ్యో అనో యింకా ఏదో వరస పెట్టో ఏడుస్తూ, వాళ్ల తాలూకు మనిషినేనని ప్రజల్ని మభ్యపెట్టి, ఆ శవాలమీది నగలన్నీ చేజిక్కించు కున్నాడు. ఈ నగలన్నీ పోగు చేసుకుని హైదరాబాద్ వదిలేసి యీ వూరొచ్చి స్థిరపడి యింతటి యిల్లు కట్టించి, ఆస్తినంతా కొడుకులైన నారాయణకూ, రాజుకూ వదిలి చచ్చిపోయాడు. కొంత డబ్బు సంపాదించిన తర్వాత ఆ డబ్బే యింకా ఎక్కువ డబ్బు సంపాదిస్తుంది. నారాయణ విషయంలో కూడా యిట్లాగే అయ్యింది. నారాయణ ఏదో వ్యాపారం పెట్టాడు. చెయ్యి గల్గిన అన్యా

శస్త్రచికిత్సవల్ల నీరసమా ?



బిడ్డల వికాసములో లోటా ?



ఆకలి లేదా ?



ఆరోగ్య క్షీణతయా ?



—అయితే వింకోలా-12 ఎందుకు తీసుకోరు ?

...ఇదే మీ ఆనందమయమైన ఆరోగ్య జీవితానికి మార్గము

వింకోలా-12 అద్భుతమైనది. క్షణంలో ఎంత స్ఫూర్తినిస్తుందో!
మీరు శక్తివంతమైన అనుభూతిని పొందుతారు. మీరు
జీవితమాధుర్యాన్ని చవిజూడ గోరుతారు. వింకోలా-12
ఆనందదాయకమైనదేగాక: మీ రక్తములోని ఎఱ్ఱకణములను వృద్ధింయు
శక్తివంతమైన లోహ పదార్థమునూ సమకూర్చి, మీలో ఉత్తేజమును తిరిగి
ప్రసాదింయను. విటమిన్ బి-12 ఆకలిని పెంచి, పటుత్వమును వృద్ధిచేయును.
ఆరోగ్యక్షీణతను నిర్మూలించుటకు ప్రఖ్యాతి చెందిన భారతీయ ఔషధము
ప్రాశస్త్యతో పాటు ఆరోగ్యమును ప్రసాదించి, బలము,
పటుత్వము, సౌష్ఠవమునకు కావలసిన ఖనిజ లవణములు, విటమినులు గలవు.



వింకోలా-12 సేవించి
ఆనందమయమైన ఆరోగ్యజీవితమును అనుభవించండి.

వింకోలా-12

పుష్టిమైన విటమిను - ఖనిజపు టానిక్

స్టాండర్డ్
ఫార్మస్యూటికల్స్
లిమిటెడ్, కలకత్తా

SHILPI-SPL [illegible]

సంపాదించని డబ్బు

శాలన్నీ చేస్తూ డబ్బు సంపాదిస్తు న్నాడు. నారాయణ తమ్ముడు రాజు బి. ఎల్. బలపంతం మీద పేస్తే బోర్డు కూడా కట్టాడు. దారేపోయే వాళ్ళు ఆ బోర్డు చూసి బోర్డు వెనకాల వుండే ఆ భవంతిని చూసి చాల పెద్ద ప్లీడరు కాబోలు అని అను కుంటారు. నారాయణ కూడా 'అవునవు నం'టాడు తన దగ్గర ఎవరన్నా ఆ మాటంటే. కానీ నిజం మాత్రం యిది: రాజు ఆడే క్రికెట్టు గ్రౌండు దగ్గర ఏ రిక్షా వాడన్నా రాజుని 'బాబు గారూ' కోర్టు కెటువైపెళ్ళాలి అని అడిగితే కాస్సేపు బజారుకు అటు వైపు యిటువైపు చూసి 'ఆ పైకెళ్ళి ఆ హోటల్దగ్గర అడగవోయ్' అంటాడు. 'తండ్రి సంపాదించిన డబ్బువల్లే తామిలా గొప్పగా చెప్పుకోబడుతున్నారు' అని వ్నా దమ్ముల్లో ఎవ్వరూ ఒప్పుకోరు.

ధర్మారావు అప్పుడప్పుడూ రమతో అంటూ వుంటాడు: 'ఈ శివరావ్, నారా యణ, రాజు.... వీళ్ళ నెప్పుడూ యింత ఆస్తి వుంది గనుక గొప్ప వాళ్ళని ప్రజలు అనుకుంటున్నారు. వీళ్ళ మేనస్ వీళ్ళ తండ్రులు లిచ్చిన ఆస్తి ఏవిటో తెల్సా? జీరో.... కానీ ఈ రోజుల్లో యిలా ఎవ్వరూ ఆలోచించరు. అదే ఈ నాటి దవుర్భాగ్యం' అయినా యింట్లోకి కావ ల్సిన వన్నీ వాళ్ళు అమరుస్తున్నారుకాబట్టి రమ దృష్టిలో వాళ్ళు సమర్థులే. రమ ఆలోచనాపరిధి నూతిలోని కప్పకన్నా అధ్వాన్నం.

ధర్మారావు నూతి గట్టు మీద కూర్చుని తన యింటికి వెనక వైపునున్న మేడ మీదికి చూశాడు. అక్కడేదో పేరంటం జరుగుతోంది. ఆడవాళ్ళందరూ 'గల గల' మాట్లాడుకుంటూ ఆ యింటి నొక రైల్వే ప్లాట్‌ఫారం మాదిరి మార్చేశారు.. ధర్మా రావుకు గుర్తొచ్చింది. ఆ యింట్లోని ఒక పిల్లకి పుట్టిన్రోజు పండగ చేస్తున్నార్ట. పొద్దున పేరంటానికి కూడా పిల్చారుట. మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు రమ సాధించటం మొదలెట్టింది.

'ఎవరికైనా వుంది ఈ అచ్చటా ముచ్చటా. మనింట్లోనే యీ విపరీతాలన్నీ. పిల్లలకి పుట్టిన్రోజు పండగ జరపటానిక్కూడా మనకి గతిలేదు.!

ధర్మారావు అన్నం మధ్యలోంచి లేచి వెళ్ళిపోయాడు. ఇలా సాధించటం అనేది ఆడవాళ్ళకు మామూలే. తండ్రి చిన్నప్పుడే చనిపోయి ఆడ పెత్తనంతో పెరిగిన ఆడ పిల్లలకు మరీ ఎక్కువగా అలవడుతుంది. రమ యీ కోవకు చెందిందే. ఇలా యిందర్ని పిల్చి ఒక పాతిక రూపాయలు ఖర్చు చేసే కంటె, ఒక అయిదు రూపాయలు పెట్టి ఒక చొక్కాకొని పిల్లల కిస్తే పుట్టిన్రోజు ఘనంగా జరుపుకున్నట్టే లెక్క అని ధర్మా రావు సిద్ధాంతం.... మామూలు పరిస్థి తుల్లో అయితే రమ యీ విషయంలో గల అవుచిత్యాన్ని అర్థం చేసుకునేదే. కానీ చుట్టూవున్న ఆడంబరాన్ని చూస్తూ తన ప్రస్తుత పరిస్థితులలో రాజీ పడలేక పోతోంది.

వెనకి యింట్లో వున్న వాళ్ళు ఏన్ని పుట్టి(నోజు పండగలయినా చెయ్యగలరు. ఆయనేదో గవర్నమెంటాఫీసులో — ఏదో టాక్సాఫీసులో కాబోలు— పనిచేస్తున్నాడు. నెల కొచ్చేది మూడు వందల జీతం. నూట యాభై రూపాయల అద్దె పెట్టి ఆ మేడ పై భాగాన్ని తీసుకున్నాడు. ధర్మారావు యింట్లో లేని వస్తువులు చాలా ఆ ఇంట్లో వున్నయ్. 'ఈనాడు వ్యక్తులు తమకొచ్చే జీతంతో (బతక నక్కర్లేదు., పై సంపాద నొచ్చే మార్గాలనేకం' అన్నదానికి యీ వెనకింటాయన (పత్యక్ష సాక్ష్యం. పైగా రెండు చేతులా సంపాదిస్తున్న పెద్దమని షని వూళ్ళో పెద్ద పేరు!!

ఇలాంటి యిరుగు పొరుగుల మధ్య వుంటున్న ధర్మారావుకు అశాంతికి లెక్క లేదు. పైగా రమ పై సంపాదన కొచ్చే మార్గాలనేకం చెపుతుంది. కాలేజీలోని విద్యార్థులకు (పయివేట్లు చెప్పి మేడలు కట్టిన లెక్చెరర్లని అనేకమందిని చూపించి 'మీరూ ఆ పని చెయ్యరాదూ?' అంటుంది. కానీ ధర్మారావుకిదేం నచ్చలేదు. (పయివేటు చెప్పమని వచ్చిన కు(ర్రాళ్లతో 'మీకు తెలియనివి చెప్పించుకునేందుకు నా దగ్గరకు మీ రెప్పుడయినా రావచ్చు. అందుకు మీరు నా కేమీ యివ్వ నక్కర్లేదు' అని చెప్పేవాడు.

* * *

(చదువరికి రచయిత మనవి: మధ్యలోని గొడవేమిటని కోప్పడకండి సార్! ఆర్ మేడమ్! మధ్యలో కాదండి. చివరి కొచ్చేశాం. ఇప్పుడు నాకో చిన్న చిక్కొచ్చి పడిందండి. ఈ ధర్మారావు యింతవరకూ బాగానే వుండి యిప్పుడు పెద్ద (టబులిస్తున్నాడు. ఇంత వరకూ యితనిచేత ఎంత చక్కగా, ఎంత ఉదాత్తంగా సినిమాలో హీరోమాదిరి, అందులోనూ తెలుగు సినిమాలో హీరోమాదిరి, సుఖాన్ని త్యాగం చేయించి, కష్టాలకి స్వాగతం పల్కించానండి! "ఇలాగే చివరిదాకా ఉండు ధర్మారావ్!" అంటె వినటం లేదండి. "అలా ఉంటానికి నేను నీ కథలోని పాత్ర ననుకున్నావా?" అని ఎదిరిస్తున్నాడండి. అతన్ని నేను సృష్టించలేదుట. అతనీ దేశంలో యీనాడు జీవిస్తున్న ఒక మనిషిట! నేనాడించినట్లాడడుట. అంతా తనిష్టమేనుట. ఇంకా పైగా "నన్నిట్లా కష్టాల్లోకి తోసేస్తావెందుకు? నీ చుట్టూ వున్న మనుషు ల్నొకసారి చూడు....వాస్తవాన్ని రాయవోయ్" అని ఎదురు (పశ్నలు వేస్తున్నాడండి..... ఇహ లాభం లేదండి. అత నిష్టాని కతన్నొది లేస్తున్నాను.....ఇంక అతన్చేసే పనులకి నేను బాధ్యుణ్ణి కాను. మీరతన్ని హీరో అనిపిలిస్తే పిలవండి. లేకపోతే లేదు.....ప్చ్....నేనాడించినట్లాడితే చక్కగా చివరికి అతన్ని పెంకుటింట్లోంచి పూరిపాకలోకి మార్పించి 'అహా! ఈ గృహమేకదా స్వర్గసీమ!" అని అనిపిద్దామనుకుని ఎంత ఉబలాటపడ్డాను!...... 'హుం....నీ సంతోషంకోసం నా సంతోషం పాడు చేశావ్ ధర్మారావ్! పాడు చేశావ్!' రచయిత ఫేడౌవుట్)

* * *


ఒక ఏడాది గడచింది. ఈ ఏడాదిలో ధర్మారావు చాలా మారిపోయాడు. ఆ పెంకుటింటిని తనే కొనేశాడు. వచ్చే సంవత్సరం ఆ పెంకుటింటి స్థానంలో ఒక డాబా కట్టా లనుకుంటున్నాడు. ధర్మారావు యిప్పుడు ట్యూషన్లు చెపుతున్నాడు. (పొద్దున ఆరింటినుంచి తొమ్మిదింటిదాకా మూడు బ్యాచ్‌ల స్టూడెంట్లు వస్తూవుంటారు. సాయంకాలం అయిదింటినుంచి ఆరింటిదాకా ఒక ట్యుటోరియల్ కాలేజీలో లెక్చెర్ యిస్తాడు. సాయం(తం ఆరున్నర దగ్గర్నుంచి రా(త్రి తొమ్మిదిన్నరదాకా మళ్లీ యింకో మూడు బ్యాచ్‌ల స్టూడెంట్లకో ట్యూషన్.

రమ ముఖంలో యిప్పుడెంతో సంతృప్తి. టెర్లిన్ చీర కట్టుకుని అతి సుకుమారంగా కాల్ గ్యాస్ స్టౌ దగ్గర నిలబడి వంట చేస్తుంది. కొత్తల్లో కొన్నాళ్లు కాల్‌గ్యాస్ మండుతుంటె ధర్మారావు గుండెల్లో కొన్నివేల కాల్‌గ్యాస్ మంటలు ఉండేవి. ఆ మంటలకు అంతరాత్మఆహుతయిపోయింది. ఇప్పుడుధర్మారావుకా అంతరాత్మ బాధలేదు. ఈ కాలేజీలో చెయ్యాల్సిన పని నేను సవ్యంగా చేస్తున్నాను. కాలేజీ వదలిన తర్వాతగదా నేను మిగతా విషయాలు చూసుకుంటున్నాను" అధైర్యంగా సమాధానం చెప్పుకుంటున్నాడు. అంతేగాదు.

'మేష్టారూ! ఈ (పాబ్లెమ్ తెలియలేదు. చెప్తారా?' అని స్టూడెంటు స్టాఫ్‌రూంకొస్తే—

'నీకు వకంతట అర్థం కాదోయ్!.... నా దగ్గర (పయివేటుకు చేరు' అని చెప్పే ధైర్యం కూడా ధర్మారావుకొచ్చేసింది.

అయ్యా!......రోజులు మారాయ్! మనిషి విలువ మనీపర్సుపై జానిబట్టి ఉంటోంది. అందులోకి ఆ డబ్బు యెలా వచ్చిందా అన్నది యెవ్వరికీ అక్కర్లేదు. అందులో డబ్బుండటమే కావల్సింది. ఈరోజుల్లో డబ్బుకోసం బాధ పడక్కర్లేదు. దాన్ని సంపాదించటానికి చాలా మార్గాలున్నాయ్. డబ్బు చేసుకోవాలనే ధ్యాస ఉండాలిగాని సంపాదించని పాపపు డబ్బు యిలా వచ్చి పడుతుంది. అలా డబ్బు సంపాదించలేనివాడు అసమర్థుడు. మనిషిఅసమర్థుడనిపిలిపించుకునేందుకు భయపడ్తున్నాడు గానీ అవినీతిపరుడనిపిలిపించుకునేందుక్కాదు. పాపపు డబ్బొచ్చే మార్గాలు చాలా ఉన్నాయ్ గనుక వెన్నెముకలేని ధర్మారావులాంటి మనుషులు ధర్మారావులుగా ఎంతోకాలం ఉండలేరు. ●



వరంగల్ నరసంపేట తాలూకా వినగల్లు అనే గ్రామంలో మార్చి 28 వ తేదీన ఒకామె మరణించిందట. ఆమె చావు కేవలం హత్యేనని, ఆమె భర్త తోబుట్టువు [బావ లేక మరది] శ్రీపతి కోమాల అనే అతనే ఆమెను చంపాడని నిర్ణయించి ఆమె బంధువులు అతన్ని పెడరెక్కలు విరిచికట్టి చితి మీద పడేసి, ఆమెతో పాటు అతని దహనం చేశారట. నేరం చేసినవానిని శిక్షించే హక్కు మనకివ్వకపోతేనే ఇలాంటి ఘోరాలు జరుగుతుంటే... ఇక అది కాస్తా ఇనకాస్తే— డోంట్ విషిట్!

ఒక వారం విపరీతం పాలాక్షుడు

చుంబనం కూడా యాగంలో ఒక భాగం!

కాకినాడలో ఓ యాగం చేయ సంకల్పించిన స్వామీజీగారు చక్కని ఆడవాళ్లను ముద్దుపెట్టుకోడం [తనే] కూడా యాగంలో ఒక భాగమేనని



'గురూ! మనమూ అలాంటి యాగం ఒకటి చేద్దామూ!'

బోలెడుమంది ఆడవారిని ముద్దుపెట్టుకుని అంతతో ఆగక ఓ పద్నాలుగేళ్ల అమ్మాయి మెడలో తాళికూడా కట్టారట. దాంతో ఊరు చెలరేగేసరికి భయంతో పారిపోయారట—కాషాయ బట్టలను నమ్మచ్చున్నారు గానీ, అవి కట్టుకున్నవారిని నమ్మచ్చునలేదు పెద్దలు. దె ఆర్ రైట్.

నమ్మలేని కాలం

ఢిల్లీలో యస్. యస్. శర్మ అనే ఆయనకూ ఆయన భార్యకూ ఇల్లు మారడంతో తగాదా వచ్చిందట. దాంతో శర్మగారు తన ఐదుగురు పిల్లల్నీ ఓ ట్రంకు పెట్టెలో తాళం వేసి, ఇంటికి మరో తాళం వేసి, కాన్పూరు వెళ్ళిపోయారట. ఇల్లు చూసి వచ్చిన ఆయన భార్య తనింటికి తాళం చూసి, భర్త కోసం కాస్సేపు చూసి, చివరికి ఓ కిటికీ గుండా లోపలికు వెళ్లేసరికి ట్రంకు పెట్టెలోంచి కేకలు వినిపించాయట్ట. ఆమె తాళం పగులకొట్టేసరికి పెట్టెలోంచి ఐదుగురు పిల్లలూ బయటికొచ్చారట. వారిని ఆసుపత్రిలో చేరుస్తే ఐదేళ్ళ పిల్ల మాత్రం చనిపోయిందట— ప్రపంచంలో తల్లిదండ్రులనే నమ్మి భయపడే సంఘటనలు జరుగుతుంటే ఇక మన్నదేలా!

అన్నకి విషం పెట్టిన తమ్ముడు

కోరపట్టరై అనే ఊళ్లో అర్జునన్ అనే అతను పిత్రార్జితమైన భూమిని తనొక్కడే అనుభవిస్తున్నాడని అతని తమ్ముడు దామోదరన్ ఆ భూమి అమ్మేస్తే, నేను కొంటానన్నాడట. దానికి అర్జునన్ సమ్మతించక పోయేసరికి పాలల్లో పాలిటాల్ విషం కలిపి అన్నగారికి ఆపేక్షతో, ఇచ్చాడట. అది త్రాగిన అర్జునన్ వాంతి చేసుకుని పడి, చనిపోయాడట— రానురాను ఎవర్ని నమ్మాలో తెలియటంలేదు.

బస్సులో బాలుడి శవం

ఒకటో తేదీన హైదరాబాదు నుంచి తిరుపతికి బయలుదేరిన డీలక్సు బస్సు నంద్యాల వచ్చేసరికి కాలి కడ్డంగా ఓ ట్రంకు పెట్టె వుండడం చూసిన కండక్టరు ఇది ఎవ్వరిదీ అనడిగి, ఎవరూ, పలక్కపోయేసరికి సర్లే అని దాన్ని లగేజి గదిలోకి తోసేశాడట. కండి తిరుపతి వచ్చాక కూడా ఆ ట్రంకు పెట్టె సొంతదారు ఎవరూ రాలేదట. పైగా పెట్టెలోంచి దుర్వాసన రావడం ప్రారంభమయ్యిందట. పెట్టె పగులకొట్టి చూస్తే లోపల ఓ బాలుని నగ్న దేహం రెండు గోనెలలో చుట్టి వుందట. అతని పేగులు బయటికి వచ్చి భయంకరంగా వున్నాడట. గుండెలో రెండు పెద్ద గాయాలున్నాయట. కాళ్ళకి తెల్ల మేజోళ్ళు, మొలలో ఓ నీలం త్రాడూ మాత్రమే వున్నాయటంతే! ఈ ఘోర దుష్కార్యం చేసిన కర్త కోసం పోలీసు గాలిస్తోంది.

* * *

మైసూరు, రాష్ట్రానికిచెందిన రాబర్ట్సన్ పేటలో 29 ఏళ్ల వెంకటలక్ష్మి అనే గర్భిణీస్త్రీ కడుపు నొప్పి భరించలేక, తన ఏణ్ణర్థం పిల్లను నూతిలో తోసేసి, తనూ దూకేసిందట. మొత్తం ముగ్గురూ చచ్చిపోయారు.

పిల్లల్ని ఎత్తుకుపోతూ పట్టుబడిన బౌద్ధ భిక్షువు

భోపాల్ రాజవీధిలో ఓ బౌద్ధభిక్షుగారు భుజాన్ని పెద్దమూట తగిలించుకుని పోతున్నారట. మూట ముందు భాగంలో ఒక మానవుని తలవంటి ఆకారం కనుపించిందట. అంతలో వెనకభాగంనుంచి ఓ చిన్న చేయి బయటికి వచ్చిందట. అది చూసిన 11 ఏళ్ల లవీందర్ కౌర్ అనే ఆమె కెవ్వున కేకవేసి, అందర్నీ పిలిపించిందట. అంతా చేరి ఆ బుద్ధభిక్షుగారి మూట దింపి, విప్పిచూస్తే ఆమూటలోంచి ముగ్గురు పిల్లలు [సజీవంగా ఉంచాడా పుణ్యాత్ముడు] బయట పడ్డారట. ఇదేమంటే, 'వీరికి' 'నా అన్న వారెవరూ లేరు, అని నాతో బోలెడుమంది చెప్పారు. అందుకని బౌద్ధాశ్రమానికి తీసుకువెళుతున్నాను' అని శలవిచ్చారట. వీరిని పోలీసులు అరెస్టుచేసి, పట్టిచ్చిన ఆ 11 ఏళ్ళ పిల్లకు వంద రూపాయలు బహుమతిచ్చిందట.

కవిగారి రిమార్కు

మన దేశంలో ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆఫీసులలోనూ ఒక పని జరగాలంటే [ఫైలు కదలాలంటే] ఒక అందమైన ఆడపిల్లనుగానీ, నిషా కలిగించే పానీయాన్నిగాని ఎరగా పెట్టాలి. అని పట్నాలో జరిగిన ఓ కవిసమ్మేళనంలో ఒక యువకవి అన్నారుట. ది రేడియో టెలివిజన్ ప్రచారం కూడా అయ్యిందట. దీనిమీద బొంబాయిలో అబిద్ ఆలీ అనే ఆయన కేంద్ర ఇన్ఫర్మేషన్ బ్రాడ్‌కాస్టింగ్ [సమాచార శాఖ!] మంత్రి శ్రీ సత్యనారాయణసిన్హాకు రాశారట. దీనికి ఏ విధమైన సమాధానమూ రాలేదని అబిద్ ఆలీ [పాత కాంగ్రెసు] అన్నారట—విన్నారా!

[ఏమండోయ్! మీలాగా అర్థంటీ ఏమండంటూ......

'ఈ ఈ ఏవర్నా ఓ అమ్మాయిలో వచ్చాడా?'



25 మందికి ఒక కాన్సర్ రోగి

ప్రతి 25 మందిలో కనీసం ఒకరు కాన్సర్ వ్యాధివల్ల మన దేశంలో చనిపోతున్నారనీ, కాన్సర్ చావులు ప్రపంచంలోకల్లా భారతదేశంలోనే ఎక్కువనీ ఆ శాఖ తేల్చింది. ప్రపంచంలోని 50 లక్షల కాన్సరు రోగాలలో 2 లక్షలు మనదేశంలోనే వున్నాయట.

*   *   *

క్రిష్ణగిరి తాలూకా మాదినాయనపల్లిలో 25 ఏళ్ళ చిన్నసామి అనే అతను పెళ్ళయిన ఊసి అనే ఆమెను లేవదీసుకొచ్చి యింట్లో పెట్టుకున్నాడట. ఆతని తలిదండ్రులు బాబూ: 'యిది మంచి పని కాదురా' అని పోరుపెట్ట నారంభించారట. విసుగెత్తిన చిన్నసామి క్రిష్ణగిరికి వెళ్ళి బోండాలు కొని, ఆనక పాలిటాల్ అనే విషం కొని, యీ విషాన్ని చిన్నకన్నాల గుండా బోండాల్లోనికి ఎక్కించి, అవి పట్టుకెళ్ళి 60 ఏళ్ళ తండ్రికి, 50 ఏళ్ళ తల్లికి 27 ఏళ్ళ అన్నగారికి, 15 ఏళ్ళ తమ్మునికి పెట్టేశాడట. తనయుడాపేక్షతో యిచ్చాడన్న సంబరంతో తల్లి మాత్రం మొత్తమంతా తినేసిందట. మిగతా ముగ్గురూ ఆ బోండాలు రుచిగా లేవని ఉమ్మేశారుట. వారు ముగ్గురూ మాత్రమే బ్రతికారు. ఈ మాతృహంతకునికి యావజ్జీవ శిక్ష విధించింది న్యాయం.

హోటల్ గదిలో అమ్మాయి శవం

ఉడిపి [ఊరు]లో ఒక హోటల్లో వో జంట ర్వాము తీసుకున్నారట. 29 న తీసుకున్నాక, ఆ రోజు నుంచీ రూముకు తాళమే వుందట. 30 తేదీన లోపల నుంచి వాసన వస్తున్నట్టనిపించి తలుపు పగులకొట్టి చూస్తే లోపల ఒక స్త్రీ శవం వుందట. ఆమె, మరొకతనూ వచ్చినట్టు హోటలు అధికారులు చెప్పారట. అతను కనుపించుట లేదు. అమ్మె చిక్మగులూరులో ఒక పోస్టలు ఉద్యోగినిట— పాపం!

*   *   *

రవిభూషణ్ అనే అతను ఢిల్లీలో శ్యామ్‌లాల్ అనే అతనికి మూడు రూపాయలు అప్పిచ్చి, ఆ అప్పు ఎంత కాలానికి శ్యామ్‌లాల్ తిరిగి తీర్చకపోయేసరికి నడిబజార్లో నాలుగు జాడించాడట. విషయం కేశాకేశి అని వచ్చేసరికి దారిన పోయేవారు ఆపారట. ఆనక రవిభూషణ్ శ్యామ్‌లాల్ యింటికి వెళ్ళాడట. అక్కడ శ్యామ్‌లాల్, అతని అన్న ప్రేమ్ యిద్దరూ కలిసి రవిభూషణ్ [అప్పిచ్చిన వానిని] పొడిచి చంపి, పరారైపోయారట—తస్మాత్ అప్పివ్వరాదు.

*   *   *



కూటి విద్యలు

కొత్తగా పెళ్లయిన జంటలూ, ప్రేమికులూ, తత్సంబంధమైనవారూ సామాన్యంగా పొదలచాటున కాస్త కనుమరుగైనచోటున సరదాగా కాలక్షేపం చేయబోవడం రివాజు. అయితే [ఢిల్లీలో] యీ ప్రదేశాలను పోలీసులు వో కంటితో కనిపెట్టి వారాస్థితిలో వున్నప్పుడు గమ్మున వెళ్లి 'నలుగురూ తిరిగేచోట పబ్లికు నిలా ప్రవర్తిస్తారా! కమాన్ స్టేషనుకు పదండి' అంటున్నారట. దాంతో భయపడినవారు పదో, ఇరవయ్యో పడేసి చల్లగా జారుకుంటున్నారట. అయితే యీ మధ్య వో పోలీసాయన వో యువ ప్రేమికుల జంటను అటకాయించేసరికి ఆ యువకుడు లొంగక, పద స్టేషనుకు—మేమేం తప్పు చేశాం అని మొండికేశాడట. దాంతో పోలీస్ కాళ్ల బేరానికి వచ్చాడట. ఇంతకీ ఆవ్యక్తి పోలీసు కాదట. అదేమంటే 'కూటికోసం కోటి విద్యలు' అన్నాడట.

*   *   *


ఉలగం [అరవంలో ప్రపంచమని అర్థంట!] అనే వూళ్లో మునియప్ప అనే అతను నెళికొండకు చెందిన మరియమ్మ అనే ఆమెను ప్రేమించాడట. ఆమెకు వివాహమై, భర్త వదిలేశాడట. అయినా తనామెను పెళ్లి చేసుకుంటానని చెప్పి, సుమారు వో ఆరొందలు తత్సంబంధంగా యిచ్చాడట మునియప్ప. తరువాతో మూడు నెలలయ్యాక మన పెళ్ళి మాటేమంటావ్ అని ఆమె నడిగితే యిష్టం లేనట్టూరుకుందట. దాంతో ఆవేశపరుడై మునియప్ప కొడవలితో ఆమె తల నరికి, తలా, మొండెం వేరు చేసి, అదే కొడవలితో తనూ పీక కోసుకుని, రక్తం కార్చుకుంటూ వెళ్ళి పోలీసులకు పట్టుబడిపోయాడట. వారు అతన్ని అరెస్టు చేసి, ఆసుపత్రిలో చేర్చారట.

*   *   *

ముళ్ళపానార్ అనే వూళ్లో 21ఏళ్ళ కిట్టాళ్ అనే ఆమెకు పళని అనే అతనికి వివాహం అయిందట. వివాహమైన వారానికి కిట్టాళ్ తన భర్త తనకు నచ్చక పుట్టింటికి వచ్చేసి, ఎవరూ చూడకుండా విషం త్రాగి చనిపోయిందట—రానురాను ప్రాణం తీసుకోడమో ఫ్యాషనైనట్టుంది—దట్స్ బ్యాడ్.

*   *   *

దొంగ బంగారం గొడవలో శ్రీ పాటిల్ పేరు వినబడుతున్నట్టే భారతదేశం అమెరికా డగ్లస్ కంపెనీనుంచి విమానాలు కొనడంలో శ్రీ మొరార్జీ దేశాయ్‌పుత్రుడు కాంతిదేశాయ్ పేరు వినబడుతోంది. మొరార్జీదేశాయ్ ఆమధ్య యు. యస్. ఏ. వెళ్లినపుడు పనిగట్టుకు డగ్లస్ కంపెనీ బోయింగ్ విమానసంస్థకు వెళ్లిన మర్మమేమి అని సి. పి. ఐ. లీడర్ భూపేష్‌గుప్త అన్నారట—అదీ కథ. ●



ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

ఆర్. పి, కొత్తగూడెం

వరకట్న నిషేధంపై మీ అభిప్రాయం తెలుప గోరుతాను.

వరకట్న నిషేధం నిజంగానే ఒక గొప్ప చట్టం. కాని చట్టాన్ని ఉల్లంఘించడానికి ఎన్నో దారులు ఉంటాయి. అదీ చట్టంతప్పు కాదు.... కాని అమలులో అంతంత మాత్రంగానూ ఉండని యీ కట్న నిషేధం, మద్యనిషేధం ఎందుకో అనిపిస్తుంది. మానవ చాపల్యాన్ని పరీక్షకు పెట్టే— ఇవి చట్ట రూపంగా ఉండక పోవడమే మంచిది.

వి. యస్, చినరావూరు

అక్కయ్యా అయిదుమంది భర్తలను పెళ్లాడిన ద్రౌపది ఎంతవరకు పతివ్రతో ఎవరు చెప్పకలరు.

ఆ అయిదుగురు అన్నదమ్ములే చెప్పకలరు— ఈ రోజు ద్రౌపది పాతివ్రత్యానికి నీదీ నాదీ సర్టిఫికేటు అనవసరం సోదరి, భారత కాలం నాటి జాతుల సాంఘిక అలవాట్లూ కట్టుబాట్లూ దృష్ట్యా మనం ఆలోచించాలి కాని మన కాలంలో కాదు.

పి ఆర్. ఆర్, రాజమండ్రి

...కానీ చివర ముగింపులో సంఘం ప్రతిబింబించడం ఎందుకని తేల్చారు...

మీరు రచయితలు రాసిన లైన్లే కాకుండా వాటి వెనక కూడా చదవడం అలవాటు చేసుకోవాలి. నేను సంఘం ప్రతిబింబించ వద్దని కాదు అన్నది. ఏ సంఘాన్ని అన్న ప్రశ్న లేవనెత్తాను. వాస్తవికత అంటారే— ఈ రోజుల్లో అదేదో పెద్ద గొడవ తెచ్చి పెడుతోంది. అటు ఊహాగానం రాస్తే ప్రయోజనం శూన్యం అంటారు. ఇటు మనం ఉండాలన్నది ఊహించుకొని రాస్తే ఉటోపియా అంటారు. ఇంక ఎలా? వాస్తవికతకి చేరువా ఆచరణకి అనుగుణ్యమూ ఆశాజనకమూ అయిన ఒక మోస్తరు ఉటోపియా సృష్టిస్తే నాకేం తప్పు అనిపించడం లేదు— వాస్తవికత పేరిట బూతూ, జుగుప్సాకర సంఘటనలూ సృష్టించి రచయితలు ఎవర్ని ఉద్ధరిస్తున్నారు?

ఎ. ఎ. ఎల్, శ్రీకాకుళం

పిల్లలు అభివృద్ధి పొందుటకు పెంపకమా? వాతావరణమా? విధివ్రాతయా? ఏది ముఖ్యము?

విధివ్రాతే— అంటే సుఖం కదా! వాతావరణం అన్నా, పెంపకం అన్నా పెద్దల బాధ్యత పెరుగుతుంది కదా. ఎందు కొచ్చిన గొడవ?

ఎ. డి. బి, మద్రాసు

సెల్ఫ్ స్టయిల్డ్ అభ్యుదయ వాదులు ఇంతవరకు సాధించిన దేమిటి? అని అడుగుతున్నారు ... భావవిప్లవం తీసుకు వచ్చారు. ఇక సాంఘిక విప్లవం దిశగా సాగిపోతున్నా రిప్పుడు కనపడ్డం లేదా?

మరింకా ఇక్కడే ఉన్నారేం బాబుగారూ, గట్టునకూచుని యజ్ఞంలో సమిధల్లాగా అమాయకులని ఉపయోగిస్తున్నారా? మంత్రాలు వల్లె వేయడం మీ వంతూ యజ్ఞగుండంలో ఆజ్యం కావడం పిచ్చిగా మిమ్ముల్ని నమ్మినవారివంతునా?... భావ విప్లవానికేం— ప్రతి కొత్త పోకడా తెస్తూనే వుంది.

ఎస్. వి, బరంపురం

స్నేహం కలకాలం ఉండాలంటే ఏమి చెయ్యాలి?

వారే వీరూ, వీరే వారూ అయిపోకుండా ఉండాలి!

కె. వి. ఆర్, కాకినాడ

నాకు మనశ్శాంతి ఉండడం లేదు.

మీ ఊళ్లో 'ముద్దుల' స్వామిని చూడలేక పోయారా?!

సి. పి. ఆర్, రాట్లం. (ఎం పి.)

చంద్రుడు ఒక గోళమని తెలిశాక ఇప్పుడు అమ్మాయిలముఖం దేనితో పోలుస్తారు?

నేనెప్పుడూ 'బింబాననా!? చంద్రబింబా!' అంటూ అమ్మాయిలని పిల్చిన జ్ఞాపకం కూడా లేదు సార్. అయినా ఏ పేరుతో పిలిచినా రోజ్ యీజ్ ఎ రోజ్ కదా?

జె. పి, కొవ్వూరు

మీరు ఆధునిక కవిత్వం చదువుతారా?

ఆహా! అది నా హాబీ.

కె. బి. ఎస్, బందరు

కలం స్నేహంపై మీ అభిప్రాయం తెలుసుకోవాలని ఉంది.

కలం స్నేహం హుందాగా నడిచినన్నాళ్లూ బాగానే ఉంటుందనీ, అది లోపించడం ప్రారంభించాక బాధాకరంగా తయారవుతుందనీ అనుభవించిన స్నేహితురాలు చెప్పింది. ఉత్తరాలు రాసుకోవడం వేరు. కాని కలం స్నేహం కోసం 'నాకు పెసరట్టు యిష్టం. మీకో?' అంటూ ఎన్నని రాస్తారు? కొంతకాలానికి ఇబ్బందే కదా.

పి. జి. ఆర్. నెల్లూరు

అమ్మాయి లెందుకండీ అలా శత్రువులని చూసినట్టు చూస్తారు అబ్బాయిలని?

ఇష్టమైన వస్తువు విషంతో సమానంగా చూడమని పెద్దల ఆజ్ఞ.

కె. డి, పిఠాపురం

మీకూ సాహిత్య సమరాలంటే ఇష్టం అనుకుంటాను. లేకుంటే హిందూలో లేఖ వ్రాసేవారే కాదు. అవునా?

ఇష్ట మేమిటి? చెవి కోసుకుంటాను. పదిమంది గట్టిగా అరిస్తే న్యాయం అదేననుకునే యీ రోజుల్లో కూడా పీలగానైనా ఓ కంఠం అసమ్మతినీ అనుమానాన్నీ తెలియ జేయడం, నిజం తెలుసుకోవాలని కోరడం తప్పు కాదు కదా?

కె వి. ఆర్, విశాఖపట్నం

మీ రెందు కనవసరంగా కవిత్వం జోలికి వస్తారు? అది మాట్లాడే అర్హతలేమున్నాయి మీకు? కవిత్వం ఎప్పుడేనా రాశారా?

హత్య చేసినవాడికే తీర్పు చెప్పే ఛాన్సు అన్నట్టుంది మీ ధోరణి! ఇక కవిత్వం గురించి మాట్లాడే అర్హత నాకేముంది— లేదు... ఈ ప్రశ్న— నా అర్హతేమిటని ఏ—దాశరథినో, నారాయణ రెడ్డినో, బైరాగినో, ఆరుద్రనో, సోమ సుందర్‌నో, నగ్నమునినో అడిగి చూడండి— కవిత్వం ఆస్వాదించగల శక్తి ఉంటే కవి హృదయాన్ని అర్థం చేసుకోగల శక్తి ఉంటే— ఆ కవిత్వం ఎలా ఉందని తెలియదా? అది చెప్పడానికి వేరే ఇంకో అర్హతకావాలా?!

ఆర్. కె. ఆర్, నిడుబ్రోలు

అమ్మాయిలు ఎంతవరకు చదువుకుంటే బాగుంటుంది?


పెళ్లి చేసుకోవాలన్న దృష్టితో అయితే నో డిగ్రీ చాలు. ఉద్యోగం చేయాలన్న ఆశకి డబుల్ డిగ్రీ చాలు. ఇంక హాయిగా ఎవరి అండదండలూ అక్కర లేకుండా బ్రతుకుదాం అనుకొంటే ఏ టెక్నికల్ కోర్సులోనో జాంమని చేరిపోయి దాని అంతు చూడ వచ్చు... అంతేగాని పి. హెచ్. డి. చేసి 'నానా పెళ్లి' అంటే పాపం అయనెక్కడ తేకలడు. డబుల్ పిహెచ్‌డిని?!

ఎస్ ఎన్ ఆర్, విజయవాడ

మీ రీమధ్య ఎమ్మీయల్ గారిని గురించి వ్రాయలేదేం?

మా వాడీ మధ్య బొత్తిగా ఆడపిల్లలా అలిగాడు బాబూ, ఎక్కడేనా కన్పిస్తే చెప్పు.

ఎగిరిపోయిన చిలక



పి. యస్. నారాయణ

"తాతయ్యా!"

"చెప్పమ్మా!"

"మరే.... తాతయ్యా!..."

"ఏమిటమ్మా!... నీకు యిరవయ్యేళ్లు వచ్చినా చిన్నపిల్లవే. ఏం కావాలో చెప్పు!" ఆయన మురిపెంగా మనుమరాలి మొఖం లోకి చూస్తూ అన్నారు.

రాజ్యం కంట్లో నీరు సుళ్లు తిరిగింది.

బోసిగా గాలిలో గిర్రున తిరుగుతున్న పంజరం ఆమె గుండెల్ని పిండేస్తోంది.

"చిలక ఎగిరిపోయింది తాతయ్యా!"

"అరె!.. ఎందుకని?" ఆయన ఉలిక్కిపడి రాజ్యం మొఖంలోకి చూచారు.

పంజరంలో చిలక రాజ్యంకు ఆరో ప్రాణం!

రాజ్యం ఏడుపును ఆపుకోలేకపోయింది.

"ఎందుకనమ్మా!...ఎలా పోయింది?" జాలిగా రాజ్యం మొఖంలోకి చూస్తూ అన్నారు.

చిలక ఎగిరిపోవటం ఎలా వున్నా రాజ్యం బాధపడటం ఆయన సహించ లేరు!

మంచం పక్కగా, నేల మీద పడవేసి వున్న చేతికర్రను అందుకున్నారు వంగి.

రాజ్యం గొణుగుతున్నట్లుగా అన్నది: "పూర్ణచంద్రరావుగారు...కొడుకే వదిలేసి వస్తున్నాడు!"

తను సీత ధ్యాసలోపడి చదవటం లేదని ఎప్పుడూ అరుస్తుంటాడు.

అందుకే అయి వుంటుంది!

"ఛ! మీ నాన్న!...ఏదీ...వాడిని పిలు నేనడుగుతాను!"

"ఇంకెక్కడున్నాడు ఆయన!" కోపంగా బుంగమూతి పెట్టింది!

ఆయన నీరసించినట్లుగా వెనక్కు వాలారు.

గొంతు తగ్గించి అనునయిస్తున్నట్లుగా, "పోనీలే అమ్మా! మరో దాన్ని తెప్పిస్తాను. ఏడ్వబోకు!" అన్నారు. అవి, "ఏమిటో దీనికి ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు.. అలనాడు రామదాసు అంతటి వాడు చిలకను పెంచే జయిల్లో కూర్చున్నాడు.. వద్దమ్మా.. మనకు పనికిరాదమ్మా అంటే వినదు! అనుకున్నారు—అయినా పైకి అనలేదు.

ఆయన తత్వమే కాదు, అది!

రాజ్యం పెద్దగానే ఏడ్వసాగింది: "ఊహూ.. నాకు నా సీతే కావాలి.. నాకు మరోటి అక్కర్లేదు.. అది నాకు దొరక్క పోయిందంటే నేను అన్నం తిననే తినను!" చేతు లూపుకుంటూ ఏడ్వసాగింది.

ఆయనకి కోపమొచ్చింది కొడుకు పేష్కి: "వాడిని రానీయ్.. దాన్ని తెప్పించిం దాకా ఇంట్లో కాలు పెట్టనీయను!"

—సరిగ్గా ఆ సమయంలోనే...

* * *

"నాకు భయంగా వున్నది చలపతీ!" అన్నాడు రామ్మూర్తి వాకిట్లో తలుపు పక్కగా నిల్చొని.

"నాకూ భయంగానే వున్నది రామ్మూర్తీ! కానీ ఏంచేద్దాం?" అన్నాడు చలపతి.

"చూస్తూ చూస్తూ ఈ వయస్సులో వున్న ఆయనకు ఆ విషయం చెప్పాలంటే నాకు నోరు రావటంలేదు!" అడుగు ముందుకూ వెనక్కూ పడుతున్నది.

"ఒక్కగా నొక్క కొడుకు.. రాగూడని కష్టమే ఆయనకు వచ్చింది.. ఈ విషాన్ని భరించటం దుర్భరమే!" చలపతికి నోరు పెగలటంలేదు.

"తలుపు తెరిచి చూడు.. వరండాలోనే పడుకున్నట్లున్నాడు ఆయన!"

తలుపు కిర్రుమన్నది.

"చంద్రమూ ఎంత పని చేశావయ్యా!" రామ్మూర్తి గొణుక్కున్నాడు.

సన్నగా విచ్చుకున్న తలుపు సందు లోంచి లోపలికి తొంగిచూశాడు చలపతి.

రాజ్యం ఏడుస్తూ కనబడింది.

ముసలాయన చేతిలో కర్రతో మంచి కాళ్ల మీద మంచం మీద దిగులుగా కూర్చొని వున్నాడు.

"చంద్రానికి యాక్సిడెంట్ అయిన సంగతి గాని తెలియలేదు గదా వాళ్లకు!" ఆశ్చర్యపోయాడు చలపతి.

"రాజ్యం ఎందుకో ఏడుస్తున్నది రామ్మూర్తీ!"

"చంద్రం సంగతి తెలిసిందేమో!" రామ్మూర్తి ఉలిక్కిపడ్డాడు. "ఆ ముసలాయనకు ఎలా చెబుతుందో.. అసలే పొళ్ళు సేవెంటు!"


తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

అనుకోకుండా ఆ సమయంలో వచ్చిన వాళ్లిద్దరి వంకా ఆ ముసలాయన వింతగా చూశాడు.

పలకరిస్తున్నట్లుగా పెదాలు సన్నగా కదిలాయి.

ఇబ్బందిగా ఆయన మొఖంలోకి చూడబోయారు ఇద్దరూ!

వాళ్లేగాదు ఎవరికైనా అలాగే వుంటుంది. అలాంటి క్షణాలలో—ఒక్కగా నొక్క కొడుకు— గంపెడు సంసారాన్ని ఒక్క చేతి మీదుగా నడుపుకు వస్తున్న ఒక్క కొడుకూ — ఓ యాక్సిడెంట్‌లో ఘోరంగా చిక్కుకుని కొద్ది గంటలే



అతడికి చివరి గంటల్లా చేసుకోగా—ఆయన తండ్రికి, అందునా హార్టు పేషెంటుకు ఆ విషయం తెలియజేయటం కష్టమే!

వాళ్ళిద్దరికీ ఏలా తెలియజేయాలో అర్థం కావటం లేదు!

నిజంగా, వాళ్ళకు పరీక్షా సమయం అది. కత్తి మీద నడుస్తున్నారు వాళ్ళు.

వాళ్ళ మాటల మీద— చంద్రం ప్రాణమెలా వున్నా— ఆ ముసలాయన ప్రాణం ఆధారపడి వున్నది!

ఎగిరిపోయిన చిలక

హార్టు పేషెంటుకు ఆ వార్త విషం కాదనే నమ్మకమేమిటి?

"ఏమిటిలా వచ్చారు? చంద్రం బయటకు వెళ్లాడు!" అన్నారు ఆయన నవ్వి.

"లేదు.." నసిగాడు రామ్మూర్తి.

"యింట్లో లేడయ్యా బాబూ!.. నేను చెప్పింది అబద్ధమంటారా?" ఆయన కాస్త ముందుకు వంగారు నవ్వుతూనే..

"—అది గాదండీ!"

"ఏదిగాదు?" ఆయన నుదురు ముడి పడింది. ఎక్కడా ఆకు అల్లల్లాడటం లేదు. గుండెల్లోంచి చెమట బయటకు తన్నుకొస్తోంది!

గాలిబుడగ ఫట్‌మనేలా వున్నది.

"చూచారూ..!" చలపతి అందుకున్నాడు. "కష్టాలనేవి మానవు లందరికీ..."

—సరిగా ఆ సమయంలోనే...

* * *

ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి.

ఎయిర్ కండిషన్డ్ హాల్లోకి వెలుగూ వెచ్చటి గాలి పోటీ బడుతూ చొచ్చుకొచ్చినయి.

డాక్టర్లు మాస్క్స్ విప్పేస్తున్నారు.

నర్స్ నాప్‌కిన్‌కు పెట్టుకున్న పిన్నును సరిచేసుకొని, ఇన్‌స్ట్రుమెంట్స్ ట్రాలీని పక్కకు తోసుకెళుతోంది.

మెడికల్ స్టూడెంట్స్ కిలకిలా—నవ్వుకుంటూ, ఏదో చెప్పుకుంటూ—బయటకు వెళ్లారు.

హౌస్ సర్జన్ తెల్లకోటులో బయటకొచ్చాడు.

ప్రమాద పరిస్థితులలో వున్న రోగుల వివరాలు తెలియబరిచే బోర్డు దగ్గర నుండి డస్టర్‌తో— పూర్ణచంద్రరావు— అను పేరును చెరిపివేశాడు!

అది చూస్తున్న చంద్రం ముగ్గురి మిత్రుల గుండెలూ ఒక్కసారిగా విలవిలా కొట్టుకున్నయి.

"అంటే—?" ఒకతను ముందుకు వచ్చి హౌస్ సర్జన్ మొఖంలోకి జాలిగా చూచాడు.

"అంటే—" నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనబడింది హౌస్‌సర్జన్ మొఖంలో.

"అదే.. పేరు చెరిపేశారు?" నోట మాట నీళ్ళు కార్చాడు అడిగినాయన.

"ఇంకా వుంచాలా మీ ఉద్దేశ్యం?"


"క్షమించాలి!"

"పేషెంట్ అవుటాఫ్ డేంజర్!"

మిత్రులు ముగ్గురూ తేలిగ్గా నిట్టూర్పులు విడిచారు.

'అమ్మయ్య'

"పేషెంటుకు చావులేదు!" హౌస్‌సర్జన్ థియేటర్ లోపలికి వెళ్లిపోయాడు.



—లోపల పూర్ణచంద్రరావు చచ్చినట్లు పడి వున్నాడు!

ముగ్గురిలో సుబ్రహ్మణ్యం, "అయితే వెంటనే వాళ్లింటికి వెళ్లి ఆ విషయం చెప్పాలి—అసలే వాళ్ల నాన్న హార్టు పేషెంటు రామమూర్తి, చలపతి ఎలా చెప్పి ఏడ్చాడో!" అన్నాడు.

మిగతా ఇద్దరూ, "అవు నవును!" అన్నారు.

సుబ్రహ్మణ్యం బయటకు పరుగెత్తాడు.

—సరిగ్గా ఆ సమయంలోనే...

* *

గది లోపల సర్వం మరచి కూర్చున్న రాజ్యంకు బయట తాతయ్య— చలపతీ రామమూర్తీ—మాట్లాడుకుంటున్న మాటలే వినబడటం లేదు.

ఆమె కనసుంతా పంజరం చుట్టూ తిరుగుతోంది. పంజరంలో వుండే సీత చుట్టూ తిరుగుతోంది. సీతను వదిలేసి తనకు గాకుండా చేసిన తండ్రి చుట్టూ తిరుగుతోంది.

ఎందుకలా చేశాడాయన?

తనకు సీతంటే యిష్టమని తెలుసు. ఇష్టమని తెలిసీ అలా చేశాడంటే—

—ఊహూ....

అర్థం కావటం లేదు. రాగానే అడిగేయాలి.

ఎదురుగా వున్న ఖాళీ పంజరాన్ని చూస్తూంటే కడుపులో తెమలుతున్నట్లనిపించింది.

సీతలేని పంజరం తనకెందుకు?

దానిని వదిలిన తన తండ్రే గాదు మరెవ్వరూ గూడా తిరిగి తీసుకువచ్చి తనకు ఇవ్వలేదు!

సీతలేని పంజరాన్ని తను చూడలేదు.

వద్దు.... లది ఇంకా తన కళ్ల ఎదుట వద్దు. గతాన్ని గుర్తుకు తెస్తూ తన గుండెల్ని ప్రతిక్షణం నలిపివేసే ఆ నిర్జీవమైన పంజరం తనకు వద్దు.

వ్రేలాడుతున్న దాన్ని చేతిలోకి తీసుకుంది. కంట్లో నుండి నీరు చెంపల మీదుగా జారుతున్నది. హృదయం వేదనతోనూ, బాధతోనూ కుమిలిపోతున్నది.

తనకు సీత లేదు.

సీతలేని పంజరం తనకు వద్దు.

గట్టిగా—రెండు చేతుల వడువూ పెట్టుకొని నొక్కివేసింది. బలమంతా వుప యోగించి నొక్కివేసింది. అందమైన పంజరం వికృతంగా మారేలా నొక్కివేసింది.

టేబుల్ కాలికి వేసి గట్టిగా బాదింది.

—వంకరలు తిరిగి, విరిగిపోయిన పంజరాన్ని కాలి క్రిందవేసి కసిగా తొక్కివేసింది

దిండులో తలదూర్చి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"ఇక నాకు సీత లేదు!"

—సరిగా ఆ సమయంలోనే...

* * *

"చంద్రానికి ఏక్సిడెంట్ అయింది!" రామమూర్తి గుండె బిగపట్టుకొని చెప్పాడు.

'ఎవరికీ—మా చంద్రానికా?'

"మీరు గాభరా పడవద్దు." చలపతి హడావుడిగా ముందుకు వచ్చాడు.

— ఆయన గుండెలమీద చేతులు వేసి రాయమాలేవో?

—ఏమిటీ, 'మా చంద్రానికే?' ఆయన రెట్టించారు.

'అవును!' అన్నాడు తప్పు చేసిన వాడిలా తలవంచుకొని రామమూర్తి. మన చంద్రానికే .... మే మంతా వున్నాం... ...బజార్లో తలవంచుకు నడుస్తున్నాడు... ఎదురుగా లారీ వచ్చింది... చూడలేదు.... హడావుడిగా పక్కకు తప్పుకుంటే...... మోటర్‌సైకిల్!

'ఇప్పు డెక్కడున్నాడు?'' ఆయన పల్లటి పెదాలు అల్లల్లాడినయ్. ఆయన ముఖం నల్లబడింది. ఆయన మొఖం మీద పడ్డ ముడతలు నల్లటి తాళ్లతో ఆయన ముఖాన్ని ఇనుప పంజరంలో పెట్టి బిగించి వేయసాగినయి.

ఆయన వణికిపోతున్నారు.

చేతికర్ర సాయంతోలేచి నిలబడ్డారు. గుండె దడదడ లాడుతున్నది బలహీనంగా. చలపతి, రామమూర్తి చెరోవేపు నిల్చు

"ఎక్కడున్నాడు వాడు?" కేకేశారు.

"హాస్పిటల్ లో!"

"బ్రతుకుతాడా?"

ఇద్దరూ మాట్లాడలేక పోయారు. నోళ్ళు పిడచకట్టుకు పోయినయి.

ఏం సమాధానం చెప్పాలి?

ఎలా సమాధానం చెప్పాలి?

పాలిపోయిన ముఖాలతో కన్నార్పకుండా ఆయన మొఖంలోకి చూడసాగారు.

అంతే— వాళ్ళనుకున్నంతా అయింది! జరుగుతుందనుకున్నఘోరం ఆపలేకపోయారా అనిపించింది.

— ముసలాయన తను అప్పటిదాకా కూర్చున్న మంచం మీదకు కుప్పలా కూలబడి పోయారు.

గుండెల మీద చేతులు వేసుకొని బాదుకోసాగారు.

"చంద్రా!"

దుఃఖం ఉండలు చుట్టుకు బయటకు తన్నుకొస్తోంది.

"చంద్రా!"

రామమూర్తికీ, చలపతికీ గూడా దుఃఖం ఆగలేదు.

"అనుకున్నంతా చేశావ్ భగవంతుడా! నే ననుకున్నంతా చేశావ్.... ఎదురుచూస్తున్న భయంకర క్షణం రానే వచ్చింది...... వాడికి ముప్పయి తొమ్మిదో ఏట గండం

ఎగిరిపోయిన చిలక

వుందని నాకు తెలుసు.... కాని అది ఇంత ఘోరంగా నిజమవుతున్నదని నమ్మలేక పోయాను. ... ఈ గండం తప్పించమని నిన్ను ఎంతాగానో ప్రార్థించాను... నా మీద దయ చూపించలేక పోయావా?... ఈ గండం తప్పిందో వాడికి డెబ్బయి ఏళ్ళదాకా ఏ భయమూ వుండేది గాదు ... కానీ, నా మీద కనికరం లేకపోయింది. ... ఈ వయస్సులో నా చంద్రం లేకుండా నే నెలా జీవించేంది... భగవంతుడా...."

ఆయన కంఠం రుద్ధమయింది.

"భగవంతుడా! నేనీ బాధ భరించలేను... నన్నూ వాడి దగ్గరకే తీసుకువెళ్ళు!"

పెద్దగా ఏడ్వసాగారు.

లోపల నుండి పూర్ణచంద్రరావు భార్య బయటకొచ్చింది.

రాజ్యం బయట కొచ్చింది.

పిల్లలంతా బయట కొచ్చారు.


ఏడుస్తున్న ముసలాయన్ను అంతా చుట్టు ముట్టారు.

"ఏమైంది? ఏమైంది?"

ముసలాయనకు వాళ్ళందరినీ చూస్తుంటే దుఃఖం మరింత అధికమయింది.

ఇక వీళ్ళందరికీ దిక్కు ఎవరు?

"— ఇంతమందినీ వదిలి వెళ్ళిపోతున్నావా, చంద్రా?"



ఏడో భయంకరమైన అరుపుతో పిడుగు పడ్డట్టనిపించగా పూర్ణచంద్రరావు భార్య కుప్పలా కూలిపోయింది.

"ఆయన కేమైంది?... ఆయన కేమైంది, చెప్పరేం?"

"నాన్నా?" రాజ్యంకూ అర్థం కాలేదు. కాని తెలియని భూతమేదో తమ కుటుంబాన్ని చుట్టుకు పోతున్నట్టుగా అనిపించగా భయంతో బిగుసుకు పోతుంది.

"నాన్న కేమైంది?"

తిరిగి రామమూర్తి నోరు తెరిచాడు.

"చంద్రానికి ఏక్సిడెంటయింది ... హాస్పిటల్ లో వున్నాడు... మనమంతా వెళ్దాం పదండి!"

— సరిగ్గా ఆ సమయంలోనే....

* * *

సైకిల్ దిగిన సుబ్రహ్మణ్యం లోపలి ఏడుపులు వింటూనే హడావుడిగా—సైకిల్ కు స్టాండు గూడా వేయకుండా — అక్కడే వదిలేసి లోపల కాలు పెట్టాడు.

మధ్యలో కుప్పగా కూలిపోయివున్న ముసలాయన, అటుపక్క ఏడుస్తూ నెత్తి కొట్టుకుంటున్న పూర్ణచంద్రరావు భార్య... ఏడుస్తున్న రాజ్యమూ... పిల్లలూ— శిలల్లా నిలబడిపున్న రామమూర్తి, చలపతి.

చూచాయగా అర్థమయింది సుబ్రహ్మణ్యానికి!

అర్థమయిన సుబ్రహ్మణ్యానికే చమటలు పట్టింది.

జాలివేసింది.

—ముసలాయన వాళ్ళు తెచ్చిన ఖబురు భరించలేక.....

ఆగలేక పోయాడు.

పరుగెడుతున్నట్టుగా వచ్చినాళ్ళ నడుమ వచ్చాడు.

"ఎవ్వరూ భయపడవద్దు... చంద్రానికి ఏ ప్రమాదమూ లేదు!.. కులాసాగా వున్నాడు!" వాళ్ళకు ఇంకా ధైర్యం చెప్పాలనే ఉద్దేశ్యంతో, హుషారుగా, "ఇంకా చెప్పాలంటే చంద్రం కొద్ది గంటల్లో ఇంటికొస్తున్నాడు!" అన్నాడు.

అందరూ ఒక్కసారి నోళ్ళు తెరుచుకొని సుబ్రహ్మణ్యం మొఖంలోకి చూశారు

"నిజం! నేను చెబుతున్నది నిజం!" అన్నట్టుగా వున్నయి అతడి చూపులు.

రామమూర్తి, చలపతి ముందుకు వంగి

సంతోషంగా ఏదో అనబోయారు.

ముసలాయన ఒక్క ఉదుటున లేచి నిలబడ్డారు. ఆయన శరీరం సంతోషంతో తేలిపోతుంది. "అమ్మయ్య! ఇక డెబ్బయి ఏళ్ళవరకు వాడికే ఢోకా లేదు .... వాడి కింకేం భయంలేదు ..... భగవంతుడా! మమ్మల్ని కనికరించావయ్యా!... నమస్కారమయ్యా నాయినా!.... మా కోటి నమస్కారాలు అందుకో ..... కొన్ని నిముషాలు మమ్మల్ని, మా మనసుల్ని నలిపేస్తే నలిపేశావ్‌గాని.... మేం అంతా నీకు కృతజ్ఞులం.... హమ్మయ్య!" అన్నారు పెద్దగా నిట్టూర్పు విడుస్తూ.

ఆయన ఎంతగానో తేలికబడ్డారు.

గాలిలో తేలిపోతున్నంతగా తేలికబడ్డారు.

సంతోషమంటే అలా వుంటుందని ఆయనకు మొట్టమొదటి సారిగా తెలిసి నట్లనిపించింది.

"దేవుడా! నీకు జన్మ జన్మాలకు ఋణ పడి వుంటాం!"

— ఎంత హాయిగా వున్నది!

గుండెల్లో నరాలు ఫట్ మన్నట్లనిపించింది.

మరుక్షణంలోనే—

"అబ్బా" అంటూ గుండెను పట్టుకొని తను ఎప్పుడూ కూర్చుండే నులకమంచం మీదకు కూలబడిపోయారు.

రామ్మూర్తికీ, చలపతికీ, సుబ్రమణ్యానికీ అర్థం కాలేదు. ఆయన ఎందుకలా పడిపోయారు ...

"అబ్బా", అన్నారు మరోసారి మెలికలు తిరిగి పోసాగారు. మొఖం నల్లబడిపోయింది. నరాలు బిగుసుకు పోగా, ఆయన విరుచుకుంటుంటే "ఫట్, ఫట్" మనే శబ్దమవుతున్నాయి మొఖం పీక్కుపోతుంది కళ్ళు ఉబ్బుకొస్తున్నాయి. కనుగుడ్లచుట్టు ఎర్రటి చారలు వల పన్నుతున్నాయి. పళ్ళు కరకరలాడుతున్నాయి విలపిస్తున్నట్లుగా... చమటలు కక్కుతున్నవి శరీరం, తల!

"అబ్బా!" అన్నారు మరోసారి బిగుసుకు పోయి... ఉన్నట్లుండి గిలగిలా కొట్టుకోసాగారు...

వాళ్లకు ఆయన పరిస్థితి అర్థమయ్యేటప్పటికే— అంతా అయిపోయింది!

ఆయనలోని చిలక ఎగిరిపోయింది!

— సరిగా ఆ సమయంలోనే ....

* * *

దీనంగా, జాలిగా, భయంగా దిగులుగా— సంతోషంగా— ఎప్పుడూ పంజరం వ్రేలాడుతూ, వూగుతూ, గిరగిరా తిరుగుతూ వుండే స్థలాన్ని— రాజ్యం కన్నార్పకుండా చూసింది.

తిరుమాకన్న అమెనారు అలాగే వుండిపోయింది.


— తాతయ్య పోయాడనే సంగతే ఆమెకు తెలియదు!

— తండ్రి ఆసుపత్రిలో గాయాలతో వున్నాడనే సంగతే మర్చిపోయింది.

— తన చుట్టూ దుఃఖం సముద్రంలో మునిగివున్న వ్యక్తుల సంగతే గుర్తు లేదు.

ఆమె సర్వం మరిచిపోయింది!

— ఆమె ఇంకా అలాగే, కన్నార్పకుండా పంజరం వుండవలసిన స్థలంలో 'చిక్‌చిక్' మంటూ తిరుగుతున్న తన సీతపంకే చూస్తోంది! ●



గొలుసు నవల

అపరాజిత



పదిగురు రచయిత్రుల సంయుక్త రచన

8వ భాగం

తురగా జానకీరాణి

జరిగిన కథ

రాధాకృష్ణ పోయేసరికి పార్వతి గర్భవతి. ఆమె తప్పనిసరిగా రుక్మిణిని ఆశ్రయించవలసి వస్తుంది. బిడ్డని కని పార్వతి కూడా కన్ను మూసింది. మాధవిని తనతో తీసుకు వెళ్ళి శ్యామల రాధలతోపాటు మాధవినికూడా కన్నకూతురి లాగే పెంచింది. పరమేశ్వరి మాధవి ఉద్యోగం చేస్తూ వచ్చిన జీతాన్ని శివశాస్త్రికి ఇవ్వడం ద్వారా అతని అభిమానానికి కొంత పాత్రురాలు కాగల్గింది. మధు ఆ యింట్లో కొత్తగా అద్దెకు వచ్చాడు. రాధ అతనితో పరిచయం పెంచుకుంది. మాధవి అతనికి బాగా సన్నిహితురాలైంది. రాజారావుకి శ్యామలకి పెళ్ళయింది. శకుంతల బాధత మాధవిపై పెట్టి కన్ను మూస్తుంది శ్యామల. మాధవిని రాజారావు చేసుకోవాలనుకుంటు న్నాడని తెలిసిన మధు కుంగిపోయాడు. మధు అప్పు తీర్చడంద్వారా మాధవిని తనదాన్ని చేసుకోవా లనుకుంటాడు రాజారావు.

8

ఇంట్లోకి వెడదామని వెనక్కి తిరిగే టప్పటికి గుమ్మంలో రాజారావు నిల బడి వున్నాడు. ఏమిటలా తరుముకు వస్తున్నాడితనని భయం వేసింది. అతను పాఠ్యాలో వున్నప్పుడు శకుంతల భారం ఒకటే తెలిసింది. ఇప్పుడు యితని రాక మరీ క్రుంగదీస్తోంది.

'ఇంకా రాలేదా అతను? వచ్చాక చెబుదువుగానిలే సంజాయిషీ. మరి బయ టికి వెడదాం వస్తావా' అన్నాడు తను. చాలా మృదువుగా, తన మనస్సుకి ఎలా గైనా నచ్చచెప్పి, వప్పించాలన్నట్టు మాట్లాడుతున్నాడు. 'వాన పడుతోంది' అన్నదామె.

'ఫరవాలేదు సన్న చినుకులేగా? మళ్ళీ నేను రేపు వెళ్ళిపోవాలి. ఒక్కసారి నాతో రమ్మని అడిగేపాటి చనువు ఉండకూడదా నాకు' అన్నాడు. మాధవి ఏమీ అనలేదు.

మనస్సు అనేది వుంటుందన్న సంగతే గ్రహించనివాడు పెద్దనాన్న మనస్సువున్నా అది బలంగా పలకనిస్థితి పెద్దమ్మది. భూమికి ఆరంగుళాల ఎత్తున అడుగులు వేస్తూ, ఏ లోకాల సుగానలనో ఆఘ్రా ణిస్తూ, దృశ్యాలు చూస్తూ జీవనపథంలో నడిచిపోగలదు రాధ. ఇంతమందిలో తనని నీతో మాట్లాడాలని వుంది, రావూ, అని లాలనగా అడిగే రాజారావుని విదిలించడం ఎలా?

'ఒక్కసారి అలా కొంచెం దూరం వెళ్ళొద్దాం. ఏం? చెప్పులు వేసుకు రా.' అన్నాడతను మళ్ళీ. మాధవి లోపలికి వెళ్ళి చెప్పులువేసుకుని ఎవరితోటీ చెప్ప కుండా వచ్చింది.

కొంతదూరం నడిచి, వీధి మలుపు తిరి గారు. వెనుకనుంచి వచ్చిన బస్సు రయి మని దూసుకు వెడుతోంటే 'పడిపోతావు' అని చేయిపట్టుకుని లాగాడు రాజారావు ఆమెని.

దీనితో మాధవి బిగుసుకు పోయింది. 'నేనింటికిపోతాను. రాను' అన్నది. అన్నదే కానీ, అతను 'వద్దు. ఒక్కసారి నా మాట విను' అని అతను వద్దుస్తుంటే తమా నడిచింది.

'నీ సమస్యలు చెప్పుకోవడానికి నీకు ఎవరూ లేరని బాధపడుతున్నావు 'దూ మవ్వ? నాస్థితీ అల్లాగే వుంది మాధవి! చదువుకుని, వివేకంగల మనిషిగా నీతో అన్నీ మాట్లాడాలని వచ్చాను నేను. ఎంత కాదనుకున్నా, మనిద్దరి సంసారాలకీ ఒక సంబంధం ఏర్పడింది. ముందు మనం ఏంచేయాలో ఆలోచించుకోవద్దూ?' అని ఆగాడతను.

కొంచెం ఆగి, 'ఇదంతా శుష్క ప్రసంగం అనుకుంటున్నారా?' అన్నాడు.

'లేదు. చెప్పండి' అన్నది.

'నేను అడిగాను సాయంత్రం నిన్ను— మధు అప్పు తీర్చేద్దామా అని. ఆ డబ్బు యిచ్చేసి అతనితో తెగ్రెంపులు చేసుకోమని అంటున్నా ననుకోకు. నీ సమస్య తీర్చడానికి సాయపడదామని అన్నాను. ఏమంటావు?' అన్నా డతను.

మెల్లిగా నేల చూస్తూ అడుగులు వేస్తోం దామె. వీధిదీపం వెలుగులో ఫుట్‌పాత్ మీద నీడలు పడుతున్నాయి. అప్పుడప్పుడొక కారు, సైకిలు పోయిన అలికిడి మినహా అంతా నిశ్శబ్దంగా వుంది.

'ఇంత డబ్బు ఎక్కడిది?' అన్నదామె.

'నా దగ్గరుంది. ఇస్తాను. ఇవ్వాలని నాకుంది.'—

'పెద్దనాన్నతో ఏదో వ్యాపారం పెట్టిస్తా నన్నారుట?'

'అవ్వాను కొద్దిపాటి చాలు. ఆయనకి

[illegible] అందరికీ యిబ్బందే. పైగా మధు వెళ్ళిపోతే రూము అద్దె కూడా ...'

చటుక్కున ఆగింది మాధవి. అతని వంక చూసింది. మధు వెళ్ళిపోతానంటున్నాడా, ఎవరితో అన్నాడు, ఎప్పుడు అన్నాడు, ఎక్కడికి వెడతాడు అన్న ప్రశ్నలన్నీ కళ్ళల్లోంచి బాధాకిరణాల్లా వెలువడుతున్నట్లు చూసింది రాజారావు వంక.

'మీ పెద్దనాన్న అన్నారు మరి. ఎంతవరకు నిజమో. నీకు తెలియకుండా వుంటుందా అని అన్నాను. అక్కడ తెలుసుకుందువుగాని — మాధవీ, ప్లీజ్, పద, అల్లా చూస్తూ నిలబడకు' అన్నాడతను.

ఇవేమీ వినట్లు ఆమె, 'ఎందుకు వెళ్ళిపోతాడు ?' అన్నది.

'నాకు తెలియదు. నిజంగా తెలియక అన్నానీమాట. అడిగి తెలుసుకుందువు గాని.' మాధవిముఖం పాలిపోయి, కళ్ళల్లో నీళ్ళు పైకి చిమ్ముకవచ్చి కళ్ళు మసకలైనాయి. అతనికి చీకట్లో కనబడదు కదా అని అనుకోవడానికి ప్రయత్నించక, అల్లాగే నిలబడింది.

'ఎంత బాధ పడుతున్నావు మాధవీ, పద, వెడదాం,' అన్నాడతను. మళ్ళీ ఎంతో దూరం నడిచారిద్దరూ. పార్కు గేటు దగ్గర అతను ఆగి, 'పూర్తిగా వాన పోయింది కదా లోపలికి వెడదామా?' అన్నాడు. ఆమెకి ఎక్కడో ఒకచోట కూర్చోవాలని వుంది. అతని వెంట నడిచి వెళ్ళి బెంచీ మీద కూర్చుంది.


అతనికి అంత దగ్గరగా కూర్చున్నానన్న ధ్యాస అయినా లేకుండా ఆమె మళ్ళీ అదే ప్రశ్న అడిగింది, 'ఎందుకు వెళ్ళిపోతాడు అతను?' అని.

'వెళ్ళడేమో ఒకవేళ. అయినా నీతో చెప్పకుండా ఎక్కడికి వెడతాడు?' అన్నాడతను. రాజారావు పేరు ఎత్తితే కస్సుమని ఏదో అయిపోతాడు మధు. ఇతను శాంతంగా, మనస్సు తెలిసిన వెప్పేలిలా మాట్లాడుతున్నాడన్న సంగతి ఆమెకు తెలిసింది అంత కలవరంలోనూ.

'పోనీ అప్పు తీర్చేద్దాం, మీరిస్తారా డబ్బు?' అన్నది.

'ఇస్తాననేగా చెప్పింది? మీ పెద్దనాన్న ఏం చెప్పారు నీతో?' అన్నాడతను.

'ఏంకేం చెప్పాడు, మీ పెళ్ళిమాట చెప్తాడు' అన్నది [illegible]



అపరాజిత

[illegible] మాట్లాడకపోయి పరికి — 'మాధవీ! ఇంట్లో డబ్బుకి చాలా యిబ్బందిగా వుంటోందేమో కదూ?' అన్నాడు.

నెయ్యిలేకుండా తనూ, పెద్దమ్మా ఎన్ని రోజులనుంచో తింటున్నారు. చీరెలు చాలక యిబ్బంది పడుతోంది తను. రాధ ఫీజు కట్టాలంటే అప్పు చేసింది. ఇబ్బందే మరి.

కానీ ఆమె 'అంత యిబ్బంది లేదులెండి' అన్నది. నెలనెలా వందరూపాయలు పట్టు కెళ్ళి మధుకి యివ్వాలంటే చాలా కష్టంగా అనిపించేది. 'ఇంకో ఎనిమిదినెలలు, ఏడు నెలలు కట్టాలి' అంటూ డబ్బు తీసుకుని మధు నిట్టూర్చేవాడు. తనకి యెంత యిబ్బందిగా వుందో చెప్పేవాడు రెండేసి వందలు కట్టాలంటే. కానీ భరించారు.

అందంతా గడిచిపోయింది. గడిచి గట్టెక్కిన సుఖం కనబడటం లేదు. శకుంతల సంగతి ఏమిటి? భగవంతుడు నెత్తిన చుట్టి పడేసిన ఈ క్రొత్త సమస్య సంగతి ఏమిటి? మధు అల్లా అనుకోడు— నీ నెత్తిన ఎందుకు పడేశాడు ఆ సమస్య— నువ్వేకొని తెచ్చుకుంటున్నావు' అంటాడు.

'శకుంతలని మీరు తీసుకెడతారా?' అన్నదామె. అతను మాట్లాడలేదు. ఊపిరి బరువుగా వదలడం వినిపించింది. ఇంత దగ్గరగా వున్నానేమిటి అని అవతలికి జరిగిందామె. కొంచెం ఆగి 'తీసుకెళ్ళమంటావా?' అన్నాడు రాజారావు.

'నేనేం చెబుతాను?' అన్నదామె.

'తీసుకెడితే ఎవరూ లేరు మాధవీ దాన్ని చూడ్డానికి. నే నొక్కడినే ఏం చేయను; మోడైపోయాను...' అని అతను ఆగిపోయాడు. ఆమెకు దగ్గరగా జరిగి చేయి పట్టుకున్నాడు. 'విదిలించకు మాధవీ! నీకు—తెలియదూ—నేను పెళ్ళి చూపులకి వచ్చినప్పుడే నా మనస్సుకి ఏమి జరిగిందో! విడదీయలేని చిక్కుల్లోకి వెళ్ళిపోయావు నువ్వు. నేనేమీ చేయలేను నిన్ను రక్షించడానికి' అన్నాడు. ఆవేశంగా విదిలించవద్దని అతను నిస్సహాయంగా అన్న ఆ మాటతో ఆమె అల్లాగే వుంచింది ఆ చేయి. వెచ్చని అతని వ్రేళ్ళు గట్టిగా చుట్టివేస్తున్నాయి ఆమె చేతిని.

'ఆ అప్పుతీర్చేసి, నన్ను పెళ్ళిచేసుకో మని అడగాలన్న దురాశ వేడిగా మంటలా లేస్తోంది. అతి సున్నితమైన నీకు ఎన్నో తగిలాయి గాయాలు, అన్నివేపులనుంచి వత్తిడి వస్తే తట్టుకోలేక నలిగిపోతున్నావు. స్వార్థంతో నేనూ నిన్ను ఎల్లా బాధపెట్టనని నాకోరిక గొంతు నులిమేస్తున్నాను.

శ్యామల చెప్పింది మాధవి చూస్తోంది పాపని, యిచ్చేయండి అని. సరేనన్నాను మాటయిచ్చాను. కానీ ఎల్లా చూస్తావు నువ్వు? నీకు ఏమిటి బంధనం?' దిగ్గ తగా ఆవేశంగా అతను అంటూ, యింకో ఆమె అరచేతిని నొక్కి పడుతున్నాడు. చటుక్కున ఆ చేయి తీసుకుని పెదవులకి అద్దుకొన్నాడు, వదిలేశాడు. లేచి నిలబడ్డాడు, 'వెడదాం పదం' అన్నాడు. ప్రేమతో, ఆవేశంతో ఉక్కిరి బిక్కిరి ఔతున్న ఆ క్షణంలోకూడా అతనిని వివేకం వెన్నుచరచి లేపినట్లయింది. చటుక్కున మాటల్లోంచి అతను లేవ గానే గాలిలో వదిలినట్లయింది మాధవికి.

'మీరు శకుంతలని తీసుకు వెళ్ళక పోతే—నేను మధుతో మాట్లాడాను—' అన్నదామె. తను ఏం మాట్లాడింది? అతను ఏమన్నాడు? ఆ నిజాలన్నీ ఇతనితో చెప్పడానికి సిగ్గువేస్తోంది.

'నువ్వు దానిని పెంచుకోవడానికి వప్పుకొన్నాడా మధు? వద్దు మాధవీ! నేను కన్నబిడ్డకి మరొకడూ తండ్రిగా చలామణీ కావడమేమిటి?' అన్నాడతను.

'వెడదాం రా మాధవీ! ఇక్కడుంటే లాభంలేదు. అంటూ వంగి ఆమె చేయి పట్టుకుని లేవనెత్తాడు. వేడిగా, అతి వేడిగా వున్నాయి అతని వ్రేళ్ళు ఆమె లేచింది. లేస్తే ఎలాగు? ఏమి తీరినట్లు సమస్య?


'ఐతే తీసుకెడతారా శకుంతలని?' అన్నది.

'అబ్బా! విడిచిపెట్టవు ఆ ప్రశ్న! నువ్వు మధుని పెళ్ళిచేసుకున్న మర్నాడు నేను పాపాయిని తీసుకెడతా అంతవరకూ నువ్వేచూడు.' అన్నాడతను. దూరంగా జరిగి నడవసాగాడు.

తొమ్మిదిన్నరకి యింటికి చేరారు. మధుగది యింకా మూసేవుంది. సావిట్లో కూర్చున్న రాధ యిద్దరివంకా వింతగా చూసింది. శివశాస్త్రి కునికిపాట్లు పడుతున్న వాడల్లా కళ్ళు విప్పి, 'ఎక్కడికి వెళ్ళావోయ్?' అని మాధవి వంక చూసి, మరోమాట అడుగకుండా లేచి 'వచ్చేస్తున్నావా, అతనొచ్చాడు' అంటూ లోపలికి వెళ్ళాడు.

* *

మర్నాడు ప్రొద్దున్నే రాజారావు ప్రయాణమై వెళ్ళిపోయాడు. అతను రిక్షా మాట్లాడి తెచ్చుకొని సామాను అందులో పెట్టుకొంటోంటే, అందరూ




సౌందర్యము మరియు తాజాదనపు భావన...సింథాల్ సబ్బుతో
MEDIUM
Godrej
CINTHOL
DEODORANT AND COMPLEXION SOAP
మీ కోసము...అపూర్వమైన సౌందర్యము, రోజంతా
తాజాదనము... రెండు విధములుగా పనిచేసే సింథాల్ సబ్బుతో.
సింథాల్‌లో ప్రపంచములో కెల్ల ఎంతో బాగుగా పనిచేసే
క్రిమినాశిని జి-11 (హెక్సాక్లోరోఫీన్) ఉంది.
జి-11 గల సింథాల్ మాత్రమే మిమ్మల్ని అందముగా
తాజాగా ఉంచగలదు.
సింథాల్ నిజంగా దుర్గంధ నివారిణి సబ్బు

అడుగుమీదకి వచ్చి నిలబడ్డారు. అందరితోనూ చెప్పి, మాధవి వేపు తిరిగి, చిన్న నవ్వుతో 'వస్తానేం?' అన్నాడు. ఆమె తలవంచుకుంది. పెద్దమ్మ, పెదనాన్న రిక్షా కదలగానే లోపలికి వెళ్ళారు. పరధ్యానంగా తలుపు అవతల నిలబడిన మాధవి అల్లాగే వుండిపోయింది అడుగు అవతలికి వేయకుండా.

బయట అరుగుమీదనుంచి లోపలికి వస్తున్న రాధ ఆగి, 'బావ వెళ్ళాడని అంత ఫీలై పోతున్నావేం?' అన్నది. మాధవి ఉలిక్కిపడి ఏమిటి యింతమాట అన్నదని గ్రహించుకునేలోపే తమాషాగా నవ్వి లోపలికి వెళ్ళింది రాధ. 'ఏం మాటలివి రాధా?' అన్నది. అల్లాగే నిలబడిపోయింది. పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా ఏమిటి అంతమాట అన్నది. ఉద్దేశ్యమేమిటి అన్న ప్రశ్న లోపల ఉడికింది. పట్టుకొని అడగాలని, కానీ అడగలేదు. నిట్టూర్చి కొంతసేపటికి లోపలికి వెళ్ళింది.

మధు కనబడలేదు. గదిలోపల గడియ వేసివుంది ప్రొద్దున్న. కాలేజీకి వెళ్ళే లోపు అతన్ని కలుసుకోవాలి. పార్కుకి ఎందుకురాలేదు. వచ్చి వెళ్ళిపోయారా, రాత్రికూడా యింటికి రాలేదేం అని అడగాలి. మన సమస్యలన్నీ తీరుతాయి. బావ పిల్లని తీసుకెళ్ళిపోతున్నాడు, మీ అప్పు తీరుస్తానన్నాడు అని చెప్పాలి. ఇవన్నీ ఆలోచించుకుని గబగబ స్నానంచేసి భోజనం చేసేసింది. గదిలోకివెళ్ళి జడ వేసుకుని, బొట్టుపెట్టుకుని, చీరతీసుకుందామని పెట్టెదగ్గర కూర్చుంది.

'మా అందరికంటె నీకు బావ దగ్గరివాడై పోయాడా మాధవీ?' — వెనుకనుంచి అనుకోకుండా వచ్చిన ఈ ప్రశ్నకి మాధవి నిశ్చేష్టురాలైంది. చీరె తీసుకోవటం మానేసి, చేతులు అల్లాగేవుంచి కూర్చుంది. ఉన్నట్లుండి ఒక్కసారి దీనికి ఏమివచ్చింది. యింతింత మాట అంటోంది? కారణం లేకుండా ఎందుకిల్లా అభాండాలతో ప్రారంభమైంది ఈరోజు. మెల్లిగా పెట్టెమూసి, వెనక్కి తిరిగింది మాధవి.

'ఏమిటి అన్నావు?' అన్నది. రాధ జడ పాయలు మళ్ళీ అల్లుకుంటూ ఒక

కాలుచాచి నిలబడివుంది. ఆ నిలబడ్డంతో నిర్లక్ష్యం, వాల్చివున్న ఆ కళ్ళల్లో తొంగి చూడబోతున్న ఎగతాళి — ఒక్క క్షణంలో స్ఫురించాయి మాధవికి.

'ఏమీలేదు. మన యింట్లో ఏవో చిక్కులువుంటేఅని మనంమనం చూసుకో వాలిగానీ-తను ఏంచూస్తాడని నీ ఉద్దేశ్యం?'

ఈ సంభాషణ ఏమిటో వరితోచకుండా వుంది మాధవికి. దీని వెనుకవున్న ఉద్దేశ్యం ఏమిటో, చర్చకి అవకాశం ఏమిటో తెలియడం లేదు.

'చిక్కులున్నాయని నేను తనతో చెప్పానని ఎవరన్నారు?' అన్నది మాధవి.

'అనాలా ఏమిటి? నువ్వు బాధపడడం, తను ఓదార్చడం, వానలో షికార్లు వెళ్ళడం అన్నీ యింట్లో అందరికీ తెలుసు — ఇంతకీ ఏమన్నాడు? ఆయన అప్పు ఈయన తీరుస్తానన్నాడా?' పచార్లు అన్నది చేస్తూ అన్నది రాధ ఈ వాక్యాలు.

మాధవి ముఖం ఎర్రబడింది. అవమానంతో మనస్సు భగ్గుమంది. నోరు మూయి అని అరిచి, లేచి ఒక్కదెబ్బ వేద్దామనుకుంది. కానీ — ఆమె మాధవి కనుక ఏమీచేయక అల్లాకూర్చుండిపోయింది.

'అతనిచ్చే డబ్బు నువ్వేమీ తీసుకోనక్కర్లేదు. అప్పు తీర్చడానికి నేను ఏదో ఒక ఏర్పాటు చేస్తాను.' అని అవతలికి వెళ్ళింది రాధ.

మాధవి ఎంతో సేపు అల్లానే కూర్చుంది. మధుని కలుసుకోవాలని, కాలేజీకి వెళ్ళాలని అన్నీ మర్చిపోయి కూర్చుంది. ఇప్పుడు కళ్ళు తెరిచినట్లున్న రాధలో యింతపొగరు దాగివుందని అనుకోలేదు. హఠాత్తుగా మండడం ప్రారంభించిన భాస్వంలా వుంది ఆమె ధోరణి.

ఎంతసేపని ఆలోచిస్తుంది? పెళ్ళై మూసి, లేచింది. పెద్ద నిట్టూర్పుతో నాలుగడుగులు వేశాక గుర్తుకు వచ్చింది తాను చీర మార్చుకుందామని వచ్చానని. మళ్ళీ వెనక్కివెళ్ళి, పైనున్న చీరతీసుకుంది.

కాలేజి చేరేటప్పటికి పదకొండున్నరయింది. ఆ పూటకి సెలవుచీటీ వ్రాసి యిచ్చి లేబరేటరీలోకి వెళ్ళి కూర్చుంది

(ఇంకా ఉంది)

వారఫలం

24-4-1970 శుక్రవారం మొదలు 30-4-1970 గురువారం వరకు

మేషం : వారం ప్రారంభంలోనే వృత్తివ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. ప్రయాణాల్లో శ్రమకలుగుతుంది. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృషభం : వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది. వారంమధ్యలో సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను తిరిగి అనుకూలత లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగాఉండదు. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిథునం : వ్యాపారంలో పోటీవారితో పోటీ పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాలలో చికాకులు యేర్పడతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

కర్కాటకం : మీకు మున్ముందు లాభించగల వ్యవహారాల్లో అనుకూలతను సాధించగలరు. వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. పోటీవారితో మాట పట్టింపులు తగవు. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. ప్రయోజనం గల పరిచయాలేర్పడతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

సింహం : సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషి చేయవలసివస్తుంది. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది. సాహసముతోకూడిన వ్యవహారాలు లాభిస్తాయి. నూతన విషయాలను తెలుసుకొంటారు. వ్యాపారంలో శ్రమవిూద అనుకూలత లభిస్తుంది.

స్త్రీలకు— దైవకార్యాలు నెరవేరతాయి. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

కన్య : వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. మిత్రులకు సహాయం చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

తుల : అన్ని వ్యవహారాల్లోను మీ శ్రమకుతగిన ఫలితం లభిస్తుంది. సాహిత్యకళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వ్యాపారనిస్తుణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఇతరుల నిమిత్తం శ్రమకు గురికాగలరు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృశ్చికం : వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యవహారాలు లాభించగలవు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. నూతన విషయాలను తెలుసుకొంటారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలతను సాధించగలరు.

ధనుస్సు : అధిక వ్యయం జరగడంవలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారంమధ్యలో అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. దైవకార్యాలు నెరవేరుతాయి.

మకరం : వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారంమధ్యలో సాహసముతోకూడిన వ్యవహారాల్లో నష్టంవస్తుంది. వృత్తిలో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో వృత్తివ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.


కుంభం : అన్ని వ్యవహారాల్లోను గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. నూతన వ్యవహారాలు లాభించగలవు. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లో నే నష్టం రాగలదు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. బంధువులకు సహాయం చేస్తారు.

మీనం : వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. సాహసముతోకూడిన వ్యవహారాలు లాభించగలవు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

—మహేష్





'మా కోరిక అపమంజసమంటావా బాబూ! లోకంలో లేని కోరికను కోరడం లేదే మేము. ప్రపంచంలో ఎంతమంది మనవల్ని దగ్గరుంచుకోవడం లేదు?

తన్నైనా చిన్నపిల్లు. ముగ్గురుపిల్లలతో లేనుకోన్మాలేదు. అందరం ఏకంగా అక్కడే ఉండామన్నా, పట్నంలో విన్నవందరు తెచ్చుకుంటేమాత్రం ఏవరి వంపాదన వాళ్ళకే చాలదు.

నువ్వు పెట్టేమాత్రం తిండి మేము పెట్టలేమా? బాబంటే మాకు ప్రేమ లేదా? మీరు వదలాలేగాని ఎంత అత్యారుబతంగా చూసుకుంటాం.

ఒక్కగా నొక్క కొడుకువి. నువ్వు పైచదువుల కెళ్ళిపోయినప్పట్నుంచి, ఒక్కదాన్ని బిక్కుబిక్కుమంటూ ఉండే దాన్ని ... నీకు పెళ్ళిచేస్తే, నీ కడుపున నాలుగు కాయలు కాస్తే, పిల్లల్ని నాదగ్గర పెట్టుకుమండొచ్చని కలలు కన్నాను.

పోనీ, మేమే వచ్చి మీతో ఉందామనుకున్నా? అన్నీ వదులుకుని నాన్నగారు రాలేరు. ఈ వయస్సులో ఆయన్ని ఒంటరిగా వదిలి నేను మాత్రం ఎలా రాను?

'చిన్నపిల్లలతో, కోడలవస్తు పడుతూంటే, చూస్తూ ఎలా ఊరుకుంటున్నావు పార్వతమ్మా! ఇద్దర్ని నీదగ్గర ఉంచుకోకూడదూ' అంటున్నారంతా. నిజమే. సిగ్గువేస్తోంది కూడ.

బాబు ఆయనదగ్గర బాగా చేరికయిపోయాడు. పిల్లలింట్లో తిరుగుతూంటే యిల్లు కళకళలాడుతోంది. మీరంతా వెళ్ళిపోతే యింత యింట్లో ఒంటిపిల్లి రాకాసుల్లా మేమిద్దరం ఉండాలి.

కొడుకు సంతానం మీద ఆమాత్రం హక్కు నాకు లేదా? నేను నీతల్లిని, నువ్వు నాకొడుకువి. నీ పిల్లల్ని కావాలని అడగటానికి నేను తగనా?

మీ నాన్నగారూ ఎంతో మక్కువ పడుతున్నారు. మా ముచ్చట కాదనకు. ఆలోచించు. పిల్లాడికి ఏలోటూ రానివ్వం. కంటికి రెప్పలా చూసుకుంటాం. నాచేతిలో పెరిగి పెద్దయావు. నేనెలా చూసుకుంటానో నీకుమాత్రం తెలిదా—'

తల్లి మాటలు మననం చేసుకుంటూ, మెట్లెక్కి పైకి వచ్చాడు — వేణుగోపాలరావ్.

'గదిలో లైటు లేదు. శకుంతల పడుకున్నట్టుందే' అనుకుంటూ నిశ్శబ్దంగా తలుపు నెట్టాడు.

నిండు వెన్నెల కిటికీలోంచి మంచం మీదకు పడుతోంది — పిండారబోసినట్టుగా. పిల్లాడిని ప్రక్కలో వేసుకుని కబుర్లు చెప్తోంది శకుంతల.

'బాబూ! నువ్విక్కడే, తాతగారి దగ్గర ఉండిపోతావురా. నేను, నాన్నగారు, అక్క, బుల్లితమ్ముడు రైలెక్కి అ... వెళ్ళిపోతాం. నువ్వూ వస్తానని పేచీలు పెడతావా?' కొడుకు కళ్ళలోకి చూస్తూ అడుగుతోంది శకుంతల.

[illegible] ఆ మాటలకర్థం ఏం తెలుసు. 'ఊఁ ఊఁ' అంటూ నవ్వాడు చందమామను చూపించి.

'వెర్రి వాన్నా!' అంటూ దగ్గరకు తీసుకుని, గుండ్రటి ఆ రెండు లేత బుగ్గలూ గట్టిగా ముద్దుపెట్టుకుని, 'నేను వెళ్ళిపోయాక అమ్మ కావాలని ఏడుస్తావా?' అంటూ కళ్ళల్లో నీళ్ళు నింపుకుంది.

వాళ్ళు చూస్తే ఎంతో పట్టుగా ఉన్నారు. భర్త తటస్థంగా ఉండిపోయాడు. అత్తగారన్నట్టు నాలుగు రోజులు ఏడ్చి వాడే మర్చిపోవచ్చు. ఏ పిల్లాడికో ఒకటి రెండుసార్లు తను కనిపించినా అమ్మ అనే విషయం జ్ఞాపకం రాదు. పూర్తిగా తనని మర్చిపోతాడు. అలాగే కొన్నాళ్ళకి తనూ మర్చిపోగలుగుతుందా?

నవమాసాలూ మోసి, కని, పెంచి, పిల్లాడిని చేతులారా వదులుకోవడమేనా? అసంభవం, బాబుని వదులుకోలేదు తను. ఎంత గొడవైనా జరగనీ. తను మాత్రం చచ్చినా యివ్వదు.

అవిరళధారగా చెంపలమీదినుంచి జారిపోతోన్న కన్నీటిని చూసి, బాబు లేచి కూర్చుని 'అమ్మా! అమ్మా!' అంటూ కుదిపాడు.

'నిన్ను ఎవరికీ యివ్వను. నా కంఠంలో ప్రాణముండగా నా బాబును వదలను' అంటూ గుండెల కత్తుకుంది.

తను ఒక్కక్షణం కనిపించకపోతే, 'అమ్మా! అమ్మా!' అంటూ వెతుక్కుంటూ తిరిగే బాబు, స్నానానికెళ్ళినా, ఆ చుట్టుప్రక్కలే తచ్చాడే బాబు, అంత సులువుగా తనను మర్చిపోగలడా? తల్లీ బిడ్డల అనుబంధాన్ని దూరం చేసుకోవడం అంత తేలికా? కాదు. ముమ్మాటికీ కాదు. బాబు ఎప్పటికీ తనను మర్చిపోలేడు.

తను కనిపించకపోయేసరికి, 'అమ్మా!' అంటూ తనకోసం ఇల్లంతా వెతుక్కుంటాడు. తనున్న ఈ గదిలోకి పదేపదే వస్తూ, ఏదో పోగొట్టుకున్నవాడిలా చూస్తాడు దిగులుగా, రాత్రయేసరికి పడుకోడానికి ఈ మంచం దగ్గరకొచ్చి, ప్రక్కలో తను లేకపోయేసరికి 'అమ్మ' అంటూ ఏడుస్తాడు: పాలు కలిపి యిచ్చినా 'అమ్మా' అంటూ ఏడుస్తూ తను జ్ఞాపకం వచ్చి త్రాగడేమో?

మాటలైనా రాని పసివాడు. తన దుఃఖాన్ని అంతకంటె ఎక్కువగా విడమర్చి చెప్పలేడు గదా.

ఏడ్చేడ్చి నిద్రపోయినా, మధ్యలో ఉలిక్కిపడి లేచి పేచీలు పెడతాడేమో?

కొంపదీసి, బెంగతో జ్వరం వస్తే? బెంగజ్వరం, అదే తగ్గుతుంది లెమ్మని అశ్రద్ధ చేసి, వాళ్ళు తెలియపర్చక పోతే???—

బాబు ఏమైనా అయిపోతే???—

అమ్మో! ఇంకేమైనా ఉందా? నేను చచ్చాక నా పిల్లలు పరాయిపంచల పాలవొచ్చు. బ్రతికుండగా నేనా దృశ్యాన్ని ఊహించలేను. అనుకుంటూ బాబును గట్టిగా దగ్గరకు తీసుకుని పడుకుంది.

కలవారిన హృదయంతో వేణు నిశ్శబ్దంగా యివతలి కొచ్చేశాడు. ఇటు భార్య, అటు తల్లి. ఇద్దరి వాదనా సమంజసంగానే కనిపిస్తోంది. ఒకరిని సమర్థిస్తే యింకొకరికి కోపం. ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుంది?

అన్నం వడ్డించేనని చెప్పడానికి వచ్చిన భార్యతో, 'వాడిని ఎక్కడా ఎత్తుకు దింపడం లేదే. ఈ రెండురోజులూ దగ్గరకు చేరనివ్వకు. దూరంగా ఉంచితే అంత బెంగపెట్టుకోడు' అన్నాడు వేణు.

'ఎవరిగురించి మీరు మాట్లాడేది?' అంది శకుంతల.

'ఇదే వీడిగురించే. ఇక్కడ వదిలిపెట్టి వెళ్దామనుకుంటున్నాం గదూ?'

'ఎవరనుకుంటున్నారు?'

'ఎరగనట్టు మాట్లాడకు. ఈ విషయంలో అమ్మా నాన్నా చాలా పట్టుగా ఉన్నారు.'

'నేనూ అంతకంటే పట్టుదలగానే ఉన్నాను.'

'ఏమిటి కొత్తగా మాట్లాడుతున్నావు. నిన్న అంగీకరించావుగదా.'

'ఎవరంగీకరించారు? నా నోటితో ఒక్కసారి నేను ఊఁ అనలేదే.'

'అడ్డంగా వాదించకుగాని, అది తప్పదు.'

'అసంభవం. నేను వాడిని వదిలి ఉండలేను.'

'అయ్యో! పాపం! అలాగా! దగ్గరున్నంతసేపూ, 'వెధవ చాకిరీ, చేసుకోలేక చస్తున్నాను' అంటూ పదిసార్లు విసుక్కుని వాడిని గుంజి పడేస్తావుగాని.'

'చేసుకోలేక విసుక్కుంటున్నానని పిల్లల్ని అవతల పడేసుకోమంటారా?'

'అవతల ఏం పడేయడం లేదే. [illegible] నన్ను కనిపెంచి పెద్దజేసిన నా తల్లి కిమ్మంటున్నానంతే. అయినా నీ మీద ప్రేమగానే చూసుకుంటుంది లేమా అమ్మ.'

'కాదని నేనడం లేదుగా. వదిలి ఉండలేకగాని నా బాధ.'

'నీకు యింకెవరూ లేకపోతే బాధపడినా కొంత అర్థముంది. ఇంకా యిద్దరున్నారు నీకు కాలక్షేపానికి చాలదు, అంతగా కావాల్సి ఉంటే—పోనీ నెక్స్ట్ ఇయర్ కి ఎలాగా పాటికి మరోడిని శాంక్షన్ చేస్తాను.'

'ఉద్ధరిస్తారు' రెండు కళ్ళున్నాయి గదా అని, ఒక కన్ను ఎవరూ పొడుచుకోరు.' అంటూ విసురుగా వెళ్ళిపోయింది శకుంతల.

ఆ రాత్రి, పడుకోబోయేముందు, పాలు తీసుకొచ్చిన శకుంతలతో 'పడుకుంటున్నావా? నిద్రొస్తోందేమిటి?' అనడిగాడు వేణు.

భర్త అడుగబోయేది చూచాయగానే గ్రహించిన శకుంతల విసుగ్గా మొహం చిట్లించింది. 'ఎందుకూ?' అంది చిరాగ్గా.

'నువ్విలా అంత విసురుగా మాట్లాడితే యింక నేనేం చెప్పేది? అలా కూర్చో. నీతో కొంచెం మాట్లాడాలి' అన్నాడు.

విసురుగా కుర్చీ లాక్కుని కూర్చుని, 'ఊఁ చెప్పండి' అంది.

'చెప్పడానికేముంది? బాబుని వదిలిపెట్టే విషయం గురించి ఆలోచించావా?'

'ఆలోచించడానికేముంది? దానికి సమాధానం మీకు అప్పుడే చెప్పానుగా.'

'అదే నీ నిశ్చయమా?'

'ఎన్నిసార్లు చెప్పమంటారు?'

'అమ్మా, నాన్నా ఎంత బాధపడ్తారో ఆలోచించావా?'

'ఆలోచించా. నేను పడేబాధ, మిగిలా

వాళ్ళ అర్థం చేసుకుంటే నేమొస్త్యా లేదుగా.'

'ఇంత మొండిగా తయారయావేమిటి?'

'పరిస్థితులు నన్నలా చేస్తున్నాయి. అందుకు బాధ్యురాల్ని నేను కానుగా.'

'ఎంత తీవ్రంగా మాట్లాడుతున్నావ్. నీకు పట్టనట్టుగా ప్రవర్తిస్తున్నావ్. ఎప్పుడైనా యిలా ఉన్నావా?'

'ఏం చేసేది ? ఉచ్చము, నీచము అవకుండా ఏడాదిపైగా పెంచుకుంటున్న బిడ్డ, చెయ్యి జారిపోతూంటే నిశ్చింతగా ఎలా ఉండగలను?'

'అర్థం పర్థం లేకుండా మాట్లాడకు. వాడు నీ ఒక్కదానికే కొడుకు కాదు. ఇద్దరికీ కొడుకే. నీకెంత హక్కుందో నాకూ అంతే హక్కుంది వాడిమీద. ఖచ్చితంగా నేనివ్వదల్చుకున్నాను. మవ్వెలా అడ్డుపెడ్తావో చూస్తాను.'

శకుంతలకు ఉడుకుమోత్తనంతో కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి. 'నన్ను చంపి, ఆతర్వాత మీయిష్టమొచ్చినట్టు చేసుకోండి' అంది దుఃఖాన్ని బిగబెడుతూ.

'మొత్తానికి ఆడబుద్ధి పోనిచ్చుకున్నావుగాదు' అన్నాడు. వేణు అసహ్యంగా చూస్తూ... 'ఎందుకూ. చదివావు. పరిస్థితుల కనుగుణంగా నడుచుకోవడం తెలీని అసమర్థురాలివి. ఇంక ప్రపంచంలో ఎవరికీ లేనట్టు, గొప్ప కొడుకుని కన్నదానిని బయల్దేరావు.

తల్లి - కొడుకు

రష్యాలో స్త్రీలని చూడు. పిల్లలు పుట్టిన తర్వాత కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుని, తర్వాత వాళ్ళని నర్సరీ హోమ్‌కి అప్పగించేసి తల్లి పనిలోకి వెళ్ళిపోతుంది. అంతేగాని నేను తల్లిని. వాడు నా కడుపులోంచి వచ్చాడు, వదలను అంటూ కూర్చోదు.'

కోపంతో శకుంతల ముక్కుపుటాలదిరాయి. పౌరుషంగా అంది. 'విదేశ సంస్కృతి మీరేం చెప్పక్కర్లేదు. వాళ్ళ దేశ, కాల పరిస్థితుల కనుగుణంగా వాళ్ళు నడుచుకుంటారు. విదేశాల్లో రెండురోజులకోసారి భార్యాభర్తలు విడాకులిచ్చుకుంటున్నారని మనమూ అలాగే చేస్తున్నామా ? మన సంప్రదాయం మనది.'

'పోనీ మనదేశంలో మటుకు ఎంతమంది పిల్లల్ని వదిలి ఉండడం లేదు. మా ఆఫీసులో రాయ్‌భార్య చూడు. సినిమాలకు షికార్లకు వీలపదనిచెప్పి పుట్టిన నెలలోపలే పసిగుడ్డుని తల్లిదగ్గర వదిలేసి, హాయిగా ఒక్కర్తే వచ్చేయలేదూ?'

'ఒకరితో సాపత్యం నా కనవసరం. ఒక్కొక్కరి హృదయం కర్కశంగా ఉంటుంది. ఒక్కొక్కరిది అతి సున్నితంగా ఉండి, ప్రతిదానికీ స్పందిస్తుంది. ఎవరిమనస్తత్వం వాళ్ళది.'

రాయ్ పెళ్ళాందాకా పోనక్కర్లేదు. మనయింటి ప్రక్కావిడను చూడ్డం లేదూ ? [illegible] పిల్లలను యింటిగలావిడ దగ్గర వదిలేసి, సాయంత్రందాకా పెత్తనాలకు పోయి వస్తుంది. అంతదాకా ఎందుకు? స్వయానా ఒక తల్లి కడుపునే పుట్టాం. మా అక్కను చూడండి. పిల్లల్ని ఎవరు చూస్తారా ? ఎవరిదగ్గర వదులుదామా అని చూస్తూంటుంది. చెప్పుడూ. ఎవరైనా అలాంటివాళ్ళు కనబడాలేగాని, నిశ్చింతగా రోజులతరబడి వదిలేసి మరీ తిరిగొస్తుంది హాయిగా. ఎవరితీరు వాళ్ళది. నాకది సరిపడదు. పిల్లలను వదిలి సినిమా కెళ్ళాలన్నా ఏదోలా ఉంటుంది నాకు.'

'నీ మొండితనం నీది. మంచి మాటలతో ఎంత చెప్పినా నీ మూర్ఖత్వం వదలడం లేదు. నేనేం చెయ్యను. నా నిర్ణయానికి మాత్రం తిరుగు లేదు. తర్వాత నీ యిష్టం.'

భర్త కఠినత్వానికి శకుంతల హృదయం బరువెక్కింది. చాలాసేపు దాకా ఏడుస్తూండిపోయింది. వేణు అటు తిరిగి, నిశ్చింతగా పడుకుని నిద్రపోయాడు.

* * *

మర్నాడు ప్రొద్దుట, శకుంతల కాఫీ తీసుకుని వచ్చింది. పేపరు చూస్తూ, గమనించనట్టే కూర్చున్నాడు వేణు.

'కాఫీ తీసుకోండి' అంది.

'అక్కడ పెట్టివెళ్ళు.'

'చల్లారిపోతుంది.'


'అబ్బబ్బ. అక్కడ పెట్టి వెళ్ళమని చెప్పాగా. ఎంతసేపూ నీ ధోరణి నీదేగాని మాట వినిపించుకోవు. అలా పడేసి వెళ్ళు.'

శకుంతల కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

'ఇక్కడ చూస్తే మీకు కోపం. అక్కడకు వెళ్తే మీ అమ్మగారి ధుమధుమలు. ఇప్పుడు నేమన్నానని అంత విసురు?' అంది కళ్ళొత్తుకుంటూ.

'ఇవ్వేళటికి నన్ను విసిగించకు. నా తల బద్దలయిపోతోంది— ఇటు నీకూ చెప్పలేక, అటు మా వాళ్ళకూ చెప్పలేక. నన్ను కొంచెం సేపు ప్రశాంతంగా ఉండనీ.'

'ఎంత నిరసనగా మాట్లాడుతున్నారు! వాడు నాకేగాని మీకు కొడుకు కాదన్న మాట.'/



మీ ట్రాన్సిస్టర్లకై నమ్మదగినది ఎవరెడి నం. 1050

ట్రాన్సిస్టర్లకై ప్రత్యేకంగా
చేయబడిన
రౌండ్ బ్యాటరీ—
వాటిని
సంరక్షిస్తుంది.

* హెచ్చు కాలం ఒకే విధమైన శక్తి నిస్తుంది.
* హెచ్చు లీక్ నిరోధక శక్తిగలది——
  మీ ఖరీదైన ట్రాన్సిస్టర్ భాగాలను పాడుచెయ్యదు.
* స్పష్టమైన, ధ్వని వికలతలేని
  శబ్దగ్రహణ కలుగ జేస్తుంది.

ఎవరెడీ నం. 1050 బ్యాటరీతో
మీ రేడియోనుండి ఎక్కువ ఆనందం
పొందండి.





రూ. 1 10
పన్నులు అదనం.

ప్రతి రకపు ట్రాన్సిస్టర్ రేడియోకు తగిన
'ఎవరెడి' బ్యాటరీ ఉంది.

VL. 5772A

తల్లి - కొడుకు

'అవును. నాకూ కొడుకే. అందుకే వాడి విషయంలో అంత స్వతంత్రం ఏడ్చింది! నాకు. ముచ్చటపడి, వాళ్ళు అడిగినందుకైనా, వాళ్ళకోరిక తీర్చలేక పోతున్నాను. అసమర్థుడిని.'

'మీరంత కర్కశంగా మాట్లాడకండి. బాబుని వదిలి ఉండలేకగాని, పరాయి వాళ్ళ దగ్గరుంచుతున్నాననికాదు...నిజానికి మీరుమాత్రం. వాడు లేనిదే ఉండగలరా ?'

'వదిలి ఉండలేము. ఇంతోటి కొడుకూ మనకొక్కళ్ళకే ఉన్నాడు. మాటలా ? ముక్కూముఖం ఎరగని వాళ్ళ కిచ్చేస్తున్నాం. ఎలా ?

'అమ్మా, నాన్నా కావాలనాలే గాని, కోటిమందిస్తారు తమ పిల్లలని పెంచుకోడానికి. ఆస్తిలో సగం పరాయివాళ్ళకివ్వడ మెందుకని, పాపం వాళ్ళాలోచిస్తున్నారు. కని పెంచినందుకు వాళ్ళ ఋణం యిలా తీర్చుకుంటున్నాను. నోరు తెరచి ఏనాడూ ఎవర్నీ ఏమీ అడగని వాళ్ళు అడిగినందుకైనా వాళ్ళమాట ధిక్కరించలేక పోయాను. 'మీరు పరాయి వాళ్ళు, నా కొడుకుని నేనివ్వలేను' అని నిష్కర్షగా చెప్పాల్సి వస్తోంది.'

'ఆస్తిపాస్తులకోసం కనిపెంచిన ప్రేమ వదులుకో గలమా?'

'వదిలి ఉండలేకకాదు...పంతం!! అత్త మామల మాటే ఎందుకు చెల్లాలి. నా మాటా చెల్లాలనే పట్టుదల. అదే అసలు సంగతి.'

'అంత పెద్ద మాట లనకండి. పుట్టినప్పట్నుంచీ క్షణం వదలకుండా పెంచుకున్నాను. మగవాళ్ళు మీకేం తెలుస్తుంది కన్నకడుపు తీపి ? ప్రొద్దుట ఆఫీసు కెళ్తారు; సాయంత్రం వస్తారు. పిల్లలు ముద్దొచ్చినప్పుడు కొంచెం సేపు ఆడిస్తారు. తల్లి బిడ్డల సంబంధం ఆ కొంచెం కాదు. రాత్రనక పగలనక కళ్ళలో వత్తులేసుకు పెంచుకుంటుంది తల్లి. ఒక్కసారిగా వదిలి ఉండమని ఒత్తిడిచేస్తే ఎలా ఉండగలను?

'ఎంతసేపూ అటు ప్రక్కనుంచే ఆలోచిస్తున్నారు గాని, నా వైపునుంచి—ఆలోచించడంలేదు మీరు.

'అవును లెండి పరాయి యింటినుంచి వచ్చినదాన్ని, మధ్యలో వచ్చిన దాన్ని. నామీదెందుకుంటుంది మీకు ప్రేమ? తెలివి తక్కువదాన్ని గనుక, సమస్తం మీకు అర్పించుకుని సర్వస్వం మీకే అనుకుంటున్నానుగాని మీకెందుకుంటుంది నామీద. అది మానసిక ప్రేమ. ఇది శరీరక ప్రేమాను.

'—అంత మింగేసేలా చూడకండి. నేను కానిమాటేం అనడంలేదు. అలాంటివారు, ఎంతసేపూ నన్నే పిల్లాడిని యిచ్చేయమని అడుగుతున్నారుగాని, వాళ్ళనే వచ్చి మనతో పాటు ఉండమనకూడదూ ? వాళ్ళకూ వెనక యింకెవరూ లేరుగా.'

'ఇంక చాల్లెద్దూ. పనికిమాలిన కబుర్లు చెప్పక దయచెయ్. గొప్పవిషయం. నువ్వేనాడు బయల్దేరావని, అన్నీ వదులుకుని వాళ్ళు నా యింటికి వచ్చేస్తారు.'

శకుంతల ఏడుస్తూ అంది. 'సరే. మీ యిష్టమొచ్చినట్టు కానివ్వండి. వాడిని వదిలి ఉండాల్సి వచ్చే బాధకంటే, మీ విసుర్లు, మీ వాళ్ళ నిష్ఠూరాలు నేను భరించలేను –' అంటూ గిరుక్కున వెను దిరిగింది.

ఏడుస్తూ నువ్విచ్చినా ఒకటే, ఇవ్వ పోయినా ఒకటే. ముచ్చటపడి వాళ్ళడిగారుగాని, నిన్ను ఏడుస్తూ యిమ్మనిగాదు...దానికేం? మీ దగ్గరుంటే ఒకటీ, నా దగ్గరుంటే ఒకటీ నా అంటూ సంతోషంగా యివ్వడం పోయి, పెద్దరాద్ధాంతం చేస్తున్నావు.'

వెళ్ళిపోతున్నదల్లా, భర్తమాటలకు విసురుగా వెనక్కు తిరిగింది శకుంతల. 'అవును. ఏడుస్తూనే యిస్తాను నేను. సంతోషంగా యివ్వడానికి నాదేమీ రాతి గుండెకాదు. మీలాంటి మగవాళ్ళకు ఆ బాధేం తెలుస్తుంది? ఈ పెళ్ళాం చస్తే, రేపు మరో పెళ్ళాం, యీ కొడుకు కాకపోతే ఇంకోకొడుకు.

'నేను ఆడదాన్ని, యంత్రాన్ని. నాకు స్వతంత్రం లేదు కోరికలు లేవు. ప్రేమ లేదు, కష్టాల్లేవు.

'మీరు కొడుకు, వాళ్ళు తల్లిదండ్రులు. కొడుకు బిడ్డను ఉంచుకునే హక్కు, అధికారం వాళ్ళకుంది గనుక, మీ తల్లి దండ్రులు కోరుతున్నారు. పెళ్ళానికి

చెప్పుకోలేని అసమర్థుడనుకుంటారని మీరు మీ కొడుకు నివ్వడానికి సిద్ధపడుతున్నారు. ఎవరి హక్కులు వాళ్లకున్నాయి. మధ్య ఏ హక్కూ లేని దానిని నేనే.

ఎటొచ్చీ మధ్య పరాయిదాన్ని, ఆడదాన్నను. కనడం వరకే నా వంతు. తర్వాత వాళ్లమీద నాకే అధికారం ఉండకూడదు' అనేసి చరచరా అక్కణ్ణుంచి వెళ్లిపోయింది శకుంతల.

వాళ్లతో దెబ్బలాడటానికి నాకింక ఓపిక లేదు. శక్తి నశించి పోయింది. ఓపికున్నంత కాలం పోరాను. ఓడిపోయాను. తన్ను చూస్తే చాలు చిర్రుబుర్రులాడి పోతున్నాడు భర్త. ప్రేమగా పలకరించి ఆప్యాయంగా ఒక్కమాట కూడా మాట్లాడడం లేదు.

'నోరు తెరచి అడిగి లేదనిపించుకున్నాం. అత్తమామల మాటయందు ఆ మాత్రం గౌరవమైనా ఉంచలేకపోయింది' అంటూ నిష్ఠూరాలు వేస్తోంది అత్తగారు.

ఈ సాధింపులు పడలేదు తను. 'వాళ్ల మాటే వెల్లనీ' అనుకుని కళ్లు తుడుచుకుంది శకుంతల.

పిల్లాడిని అత్తారింట్లో వదిలిపెట్టి, ఆ మధ్యాహ్నం, ఏడుస్తూనే బండెక్కింది శకుంతల. బాబు చేతులుచాచి, అమ్మ! అమ్మంటూ ఏడుస్తూంటే భర్తమీద ఎన్నడులేని ఏవగింపూ కలిగింది శకుంతలకు. 'ఇష్టంలేకపోతే కనడం మానేయాలి గాని, ఎక్కువయ్యారని పంచిపెట్టుకోడానికి యివేమైనా ప్రాణంలేని వస్తువులా? నిండు హృదయాలను రెంటిని రంపపుకోతకు గురిచేసి ఏం బావుకుంటారో ఈ మనుష్యులు. ఎందుకొచ్చిన బాధ ఇది' అనుకుంది.

పిల్లాడు పేచీ పెట్టేస్తూంటే, 'కొంచెంసేపు అలా తిప్పితీసుకొస్తాలే' అంటూ అవతలికి తీసుకెళ్లిపోయారు మామగారు.

'మరేం ఫరవాలేదు. బెంగపెట్టుకోకులే. ఏడ్చినా, మీ మామగారు బజార్లో తిప్పితే అదే మర్చిపోతాడు ... డబ్బుకి యిబ్బందిపడక అవసరమైతే వ్రాయండి. పి ఆరోగ్యం జాగ్రత్త. చంటాడిని శ్రద్ధగా చూసుకో. ఈ వందరూపాయలూ దేనికైనా ఖర్చులకుంటాయి ఉంచుకో' అంటూ అత్తగారు ఆప్యాయంగా కోడల్ని రైలెక్కించింది.

రైల్లో, దారిపొడుగునా శకుంతల కళ్లు తుడుచుకుంటూనే ఉంది. వేణు మాత్రం తృప్తిగా ఉన్నాడు — దిగులును మరిపించడానికి చిలిపి కబుర్లు చెప్తూ, ఏడుస్తోన్నందుకు వేళాకోళాలు పట్టిస్తూను.

ఇంటికి చేరిందన్నమాటేగాని, పిల్లాడి జ్ఞాపకాలు మనస్సును కలచివేస్తూంటే, ఏ పనిచేయ బుద్ధయేది కాదు శకుంతలకు. ప్రతిక్షణం బాబు లేనిలోటు కొట్టొచ్చినట్లుగా కనిపించసాగింది. ఏపని చేస్తున్నా కాళ్లకు చేతులకు అడ్డుతగులుతూ, తనని విసిగిస్తూ, రెండుదెబ్బలుతినినా, ఒలకబోసి పని ఎత్తుకుంటున్న శ్రమలోనే అదో ఆనందం తల్లికి.


అన్నందగ్గర కూర్చునేసరికి శకుంతలకి నోటికి సహించేది కాదు. అక్కడ పిల్లాడు పాలు త్రాగుతున్నాడో లేదో? తన కోసం ఏం యేడుస్తున్నాడో? మాటలైనా తిన్నగారావు. అమ్మ! అమ్మ అనే అనగలడు గాని తన మనస్సులోని బాధ ఏమని చెప్పగలడు? ఇలా లేనిపోని ఆలోచనలతో కుమిలిపోయేది శకుంతల.


సంసారమంటే వైముఖ్యం, భర్తంటే విసుగుదల, పిల్లలేంచేసినా అర్థంలేని కోపం, మనస్సుకు తగిలిన గాయాన్ని మాన్పుకోలేక, అందరిమీదా చిరుబురులాడి పోతూండేది అస్తమానూ. కన్ను మూసినా తెరిచినా, బాబు దగ్గరలేని లోటు కొట్టొచ్చేలా కనిపిస్తూంటే, రోజురోజుకూ చిక్కిపో సాగింది శకుంతల.

అప్పుడప్పుడు అర్ధరాత్రివేళ నిద్రలో వెక్కివెక్కి ఏడవడం అదీ చూసి, వేణుకు కొంచెం భయం కల్గినా, నాల్గురోజుల్లో అదే పోతుంది లెమ్మనుకున్నాడు.

'ఛీ. ఆడజన్మ మహాపాపం. స్త్రీ పురుషుడికి బానిస. కేవలం అతని కోరికలు తీర్చడానికోసమే. ఆమెకు మనస్సుండదు. కోరికలుండవు. ఏమీ ఉండవు. అతని చేతిలో కీలుబొమ్మ మాత్రమే.' శకుంతలను కదిపినా, మాట్లాడించినా, ఆమె నోటినుంచి యివే వినిపించేవి వేణుకి.

'ఎవరి కర్మ నెవరు తప్పించగలరు? తల్లిదండ్రి ఉన్నారు. ప్రేమగా చూసుకునే భర్త, కావల్సినంత సంపాదన ఉంది. అయినా తన కన్నకొడుకుని దగ్గర అట్టే పెట్టుకునే స్వతంత్రం లేకపోయింది.







తల్లి - కొడుకు

బాబు తనిద్దరికీ పుట్టాడు. వాడిని వదిలి ఉండలేక చిత్రవధ అనుభవిస్తోంది తను. భర్త నిశ్చింతగా ఉన్నాడు. ఏమిటీ భేదం స్త్రీ పురుషుల మధ్య, ఎంత నేపూ ఆమె ఆలోచనలు ఇలా తిరుగనే నడిచేవి.

ఆమె వైఖరి వేణుకి కొంచెం ఆందోళనే కల్గించింది. కన్న తల్లి గొబట్టి వదిలి ఉండలేక, అట్లా చేస్తోందేగాని, ఇంటికొచ్చాక సంసారం గొడవలో అన్నీ మర్చిపోతుందనుకున్నాడు. కాని శకుంతల అందుకు భిన్నంగా తయారయింది. రాను రాను ఆమె ధోరణి ఎక్కువవ సాగిందేగాని తగ్గుముఖం పట్టలేదు. బాబెం చేస్తున్నాడో నా కోసం బెంగపెట్టుకున్నాడో ఏమో అంటూ, తింటూ తింటున్న అన్నం వదిలేసి కళ్ళనీరు కారుస్తూ ఉండిపోయేది. ఇరవైనాలుగ్గంటలూ పిల్లాడి ధ్యాసే.

రాత్రిళ్ళు నిద్దట్లో బాబూ అంటూ కలవరించడం, అర్ధరాత్రి లేచి కూర్చుని నిద్రపోకుండా శూన్యంలోకి చూస్తుండ మొదలెట్టేసరికి, వేణుకి నిజంగానే భయం కల్గింది.

'ఏమండీ! బాబు నొక్కసారి చూపించరా? పదేపదే వాడు కళ్ళముందు మెదులుతున్నాడు. ఒక్కసారి చూసొస్తానండీ' అంటూ శకుంతల కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ, ప్రాధేయపూర్వకంగా అడుగుతూంటే వేణు అడ్డు చెప్పలేకపోయాడు. ఆ మర్నాడే ఆమెను తీసుకుని బయలుదేరాడు, ఇంటికి.

ఏదో జంక్షన్‌లో రైలాగితే, కాఫీ త్రాగొద్దామని క్రిందకు దిగాడు వేణు. అవతలగా నిలబడి కాఫీ త్రాగుతోన్న ముసలాయన్ని చూసి, నాన్నగారిలా ఉన్నారే అనుకుంటూ దగ్గర కెళ్ళాడు. సందేహం లేదు, ఆయనే!!!

'మీరలా ఎక్కడకు బయదేరారు? బాబు, వాళ్ళమ్మ కోసం బెంగ లేకుండా బాగా ఉన్నాడా?' అంటూ ప్రశ్నించాడు వెంటనే.

'మేము నీ దగ్గరకే బయలుదేరాం. మీరు వెళ్ళినప్పట్నుంచీ పిల్లాడు బెంగగానే ఉంటున్నాడు. పాలూ త్రాగటం మానేశాడు, బాగా అకలేసినప్పుడు ఏ

కొంచెమో త్రాగినా — అమ్మంటూ ఏడ్చి మానేస్తున్నాడు. మీరు వెళ్ళాక అమ్మ అమ్మంటూ యిల్లంతా వెతుక్కున్నాడు. వాళ్ళమ్మ పడుకునే గదిలోకి అస్తమానూ వెళ్ళి చూసుకుంటూ ఉంటాడు. ముందు జ్వరం వచ్చినా, బెంగజ్వరం నాలుగు రోజుల్లో అదే తగ్గిపోతుంది లెమ్మను కున్నాంగాని — పిల్లాడు చూస్తే చిక్కి పోతున్నాడు. దీనికి సాయంరెండు రోజుల్నించి విరేచనాలు పట్టుకుని ఎన్ని మందులేసినా తగ్గడం లేదు. ఇదంతా బెంగవల్లే. తల్లిని చూపిస్తే తగ్గుతుంది అన్నాడు డాక్టరు. అందరూ అదే మాట అనడంతో మీకు టెలిగ్రాం యిద్దామను కున్నాంగాని, అది అంది మీరొచ్చేసరికి, పిల్లాడెలా ఉంటాడో అని భయం వేసి, అలాగే బయలుదేరి పోయాం.

రైలెక్కాక, అమ్మ దగ్గర కెళ్ళాం అని చెప్పాక, అన్ని మందులకి తగ్గని విరేచనాలు తగ్గుముఖం పట్టాయి. ఎలాగా తల్లీ బిడ్డా పేగు బంధం పేగు బంధమే. ఎంత రక్తసంబంధమైతే మాత్రం మనందరం తల్లి తర్వాతే. ఎంత ప్రేమగా చూస్తే మాత్రం తల్లికి సాటి వస్తామా? ఈ పది రోజుల్నించీ పిల్లాడు పడ్డ బాధ చూస్తుంటే, తల్లి బిడ్డలను విడదియ్యడం ఎంత పాపమో తెలిసింది...ఇలా నువ్వెక్కడ కెళ్తున్నావు? ఏదైనా కేంపా?'

'అబ్బే. నేనూ మనింటికే. పిల్లాడి కోసం శకుంతలకూడ బెంగ పెట్టుకుంటే చూపించి తీసుకెళ్దామని బయలు దేరాను.'

'అలాగా. అమ్మాయిగారూ ఈ వాళ్ళూ రైల్లోనే ఉన్నారన్నమాట. అయితే యింకెందుకు, నడు. ముందు నువ్వెళ్ళి టిక్కెట్లు తీసుకురా. ఇంతలో సామానంతా ఈ బండిలోకి మార్పించేస్తాను నేను' అంటూ అవతలికి నడిచారాయన.

అంత దూరాన కొడుకుని చూడగానే, అత్తగారి చేతుల్లోంచి చటుక్కున అందు కుని ఏడ్చేసింది శకుంతల. 'నిన్నొదిలి పెట్టి యింకెక్కడకూ వెళ్ళను బాబూ!' అంటూ ఆప్యాయంగా ఒళ్ళంతా నిమురుతూ హృదయానికత్తుకుంది, పదేపదే.

ఆ తల్లి బిడ్డలను చూస్తూ కళ్ళొత్తుకుంది పార్వతమ్మగారు.

'నీ బిడ్డను మళ్ళీ నీకు పదిలంగా అప్పగించగలనో లేదోనని కుమిలిపోయా నమ్మా. ఎందుకొచ్చింది, ఏదో భ్రాంతి పడ్డాంగాని, ఎంత యిదిగా చూస్తేమాత్రం తల్లితర్వాతే మేమంతా' అందావిడ. ●



రాత్రి పదిగంటలవేళ వర్షం జోరుగా కురుస్తోంది. గాలి జోరు ఎక్కువగా వుంది. మధ్య మధ్య మెరుపులు కత్తుల్లా మెరుస్తున్నాయి. చీకటి భయంలా దట్టంగా వుంది.

రంగనాయకులు వర్షంలో తడుస్తూ ఒంటరిగా నడుస్తున్నాడు. కుండలతో పట్టి పోస్తున్నట్టుగా వుంది వర్షం. రంగనాయకులు తీవ్రమైన ఆలోచనల్లో ఆశ్రయాన్ని కోల్పోయిన పక్షిలా తల్లడిల్ల పోతున్నాడు.

అతని మనసులో వున్నది పద్మ. పద్మ గురించే ఆలోచనలు...

అతను ఆరోజే హైదరాబాదు నుండి బందరొచ్చేడు. ఊళ్లో అడుగు పెడుతుండగానే అతను విన్న మొదటి విషయం పద్మ పెళ్ళినిగురించి. ఆ మాటలు విన్నక్షణంలో అతనిగుండె ఆగిపోయిన మాట నిజం.

పద్మ అతని స్నేహితుడు జగన్నాధం చెల్లెలు. బి. ఏ. పాసయింది. పద్మపైన అతనికి బోలెడభిమానం. అంతకంటే అతనిగుండెలో ఆమెపైన వెచ్చని ప్రేమ వున్నది.

పద్మపైన ఆకాశమంత ఆశని పెట్టుకొన్నాడు. ఆ ఆశతోనే కలలు కంటూ కలల్లో మేడలు కట్టాడు. ఆ మేడలు చిన్నగాలి మాత్రానికి కూలి పోతాయని అతననుకోలేదు.

ఉరుము భయంకరంగా వురిమింది. రంగనాయకులు వులిక్కిపడ్డాడు. చెట్లు గాలిధాటికి తట్టుకోలేక అటూ ఇటూ వూగిపోతున్నాయి. అతను నడుస్తూనే వున్నాడు. ఆకాశంలోంచి నీళ్లధారలు... అతనివంటికి బట్టలు అతుక్కుపోయాయి. తలనుంచి నీరు జారుతున్నది.

మెరుపు కత్తిలా మెరిసింది. కళ్ళు జిగేళ్ళుమన్నాయి. ఆ వెలుగులో అతని కళ్ళముందు ఓ దేవత కదిలాడింది. ఆ దేవత పద్మ. ఆరోడ్డుమీద భయం చీకటితో కలసి కుంభవృష్టిలో విలయతాండవం చేస్తోంది. అతని గుండెల్లో దిగులు రాజ్యంచేస్తోంది.

అప్పుడు రాత్రి పదకొండు కాలేదు. విశ్వనాథం ఇంటిని సమీపించేడు. విశ్వనాథం రంగనాయకులికి మంచి స్నేహితుడు. అదీకాక విశ్వనాథానికి పద్మ బాబాయి కూతురవుతుంది.

తలుపు తట్టాడు. కొన్ని చిల్లర నిమిషాలతర్వాత విశ్వనాథం తలుపు తెరచి రంగనాయకుల్ని చూసి అమితంగా ఆశ్చర్యపోయాడు.

'ముందు లోపలికి రా. బట్టలు మార్చుకొందూగాని,' అన్నాడు.

రంగనాయకులు మాట్లాడకుండా లోపలికివెళ్ళాడు. తువాలుతో తల తుడుచుకొని విశ్వనాథం ఇచ్చిన లుంగీపంచెని కట్టుకున్నాడు.

'ఇప్పుడు చెప్పు ఇంత రాత్రివేళ వర్షంలో......!'

'ముందో సిగరెట్ ఇలా పడేయి' విశ్వం మాటల్ని మధ్యలోనే తుంచి అడిగాడు.

సిగరెట్టు వెలిగించిన రంగనాయకులు మెల్లగా అన్నాడు.

'నీకు శ్రమ ఇచ్చాననుకొంటాను.'

'నాలిక తెగ్గోస్తాను. ఏమిటా వాగుడు.'

పేలవంగా నవ్వేడు రంగనాయకులు.

విశ్వనాథం అన్నాడప్పుడు.

'రే రంగా! నీకో నేను గనక సరిపోయిందిగానీ అదే మరొకడైతే ఎప్పుడో పిచ్చపట్టి పారిపోయివుండును......'

రంగనాయకులు మరో సిగరెట్టు వెలిగించి అన్నాడు.

'నేనీరాత్రికి ఇక్కడే వుండిపోతాను.'

'ఓరి ఫూల్! లేకపోతే ఈ వర్షంలో మళ్ళీ వెళ్తాననా!'

విశ్వం ఆ గదిలో అతనికోసం మడత మంచం, పరుపూ వేశాడు. రంగనాయకులికి ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు.

'పద్మ పెళ్ళిటకదూ?' అడిగాడు.

"అవున్రా! ఈ నెలాఖరులో" అన్నాడు విశ్వం పక్క సర్దుతూ.

(రేయ్ విశ్వం! పద్మ పెళ్ళయిపోతే పోతే నేనేమయిపోవాలను కొంటున్నావ్? వద్దురా బాబూ వద్దు మీచెల్లికి పెళ్ళి చేయకండి. పద్మని నేను ప్రేమించాను. వూళ్ళోలేనంతమాత్రాన నాకు తెలీకుండా పెళ్ళిచేసేయాలనుకొన్నారా? నయం! ఈ పెళ్ళే గనక జరిగివుంటే ఈ రంగనాయకులు గుండె ఆగి చచ్చేవాడు. విశ్వం! నా ప్రాణాలు నీ చేతుల్లో వున్నాయి. నన్ను రక్షించరా బడవా! నా ప్రేమని బ్రతికించు. పద్మ లేకపోతే నేను బ్రతకలేను. ఐ లవ్ హర్ డియర్లీ. నువ్వే నన్నో వడ్డుకి చేర్చాలి!)

'థాంక్స్! ఆ సిగరెట్టుపెట్టె నాకిచ్చి నువ్వెళ్ళిపో' అన్నాడు మనసులో అనుకున్నది చెప్పలేక.

'సరే నీ యిష్టం. ఉదయం కాఫీ తాగేక మాట్లాడుకుందాం!' అంటూ విశ్వం వెళ్ళిపోయాడు.

తలుపు గడియపెట్టాడు రంగనాయకులు. అతను కాలుస్తోన్న సిగరెట్టు పొగ చెదిరిపోతోంది,

పద్మ ఎదురుగా నించున్నట్టుగా అనుపించిందతనికి. అతని కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. తనొక సామాన్యమైన మనిషి. వెనక లక్షలు లేవు. మేడలు లేవు. కారులూ లేవు. కానీ వీటన్నిటినీ మించి అతనికి అందమైన హృదయం వుంది.

పద్మని ఎవరో బిగ్‌షాట్ కిస్తున్నారు. అతనితో పోల్చుకుంటే తను ఆఫ్ట్రాల్ బిచ్చగాడే అవుతాడు. తను లా చదువుతున్నాడు. బోర్డు కట్టేక కనీసం రెండేళ్ళన్నా చేతులు నలుపుకుంటూ కోర్టులో ఏదో చెట్టుకింద కాపురం చేయాల! అయినా ఈ రోజుల్లో ప్లీడర్లకీ, ఇంజనీర్లకీ పిల్లల్నిచ్చే దెవరు?!

చాలాకాలంగా తను జగన్నాథం ఇంటికి వెళుతున్నాడు. పద్మ తనతో మాట్లాడేది. చాలా విషయాలు మాట్లాడేది. పద్మ సాక్షాత్తు ఓ దేవతలా వుంటుంది.

పద్మంటే తనకి బోలెడు ఇష్టం. కాదు ప్రేమ. కిటికీ దగ్గరగా వెళ్ళి నించున్నాడు రంగనాయకులు.

చీకటి చిక్కగా వుంది. వర్షం...విపరీతంగా కురుస్తోంది. వర్షం చూస్తుంటే భయం, చీకటిని చూస్తుంటే తన జీవితం గుర్తుకొచ్చి తల్లడిల్లిపోయేడు రంగనాయకులు. చలిగాలి రివ్వున వీస్తోంది.

గదిలో గోడవారగా ఓ సాలెపురుగు పైకి పాకాలని ప్రయత్నం చేస్తోంది. విపరీతమైన గాలివల్ల దాని ప్రయత్నం ప్రతిసారీ విఫలమౌతోంది. అంతమాత్రం చేత అది తన ప్రయత్నాన్ని మాత్రం మానుకోలేదు. పట్టుదలని వ్యక్తంచేస్తూ కర్తవ్యంపట్ల మనిషికో సందేశాన్ని ఇస్తోందది.

మెరుపు జిగేలుమని మెరిసింది.

(నువ్వూ నన్నర్థం చేసుకోలేదురా విశ్వం! నీ చెల్లెల్ని ప్రేమించానని చెబితే నన్నో వెధవగా జమకడతావన్న భయంతో ఇంతకాలమూ నీకు చెప్పలేదు. నేను నీ ప్రాణంలాటి వాడినని బోలెడుసార్లు నువ్వన్నావు. అలాటిది నా మనసుని నువ్వు చదవలేదే అని బాధపడుతున్నాను. ఇంతకాలంగా జగన్నాథం గారింటికి వెళుతున్నాను. వాడవా నన్ను గమనించలేదు. మీరంతా వెర్రి మనుషులు. మనుషుల్ని గమనించే చూపుగానీ, చదివే తెలివి నీ మీకు లేదు. ఇప్పుడు సమయం మించిపోయింది. ఈ వెధవ మనసులో వుంది చెబితే అభాసు కావల్సిందే కానీ బొత్తిగా ప్రయోజనం లేదని నాకు తెలుసు. జరిగిపోయే పద్మ పెళ్ళి గుర్తుకొస్తే గుండె పగిలిపోతోంది నాకు.

వో మైడియర్ పద్మా! స్వీట్‌గర్ల్! మే ది హెవెన్ షవర్ ఇట్స్ చాయిసెస్ట్ బ్లెస్సింగ్స్ ఆన్‌యూ.

రంగనాయకులికి బోరుమని ఏడవాలనిపించింది. కిటికీ దగ్గరే నించుని సిగరట్టు వెలిగించేడు రంగనాయకులు.

* * *

కిటికీలోనుండి జల్లు పడుతున్నా అక్కడే నించుని బయటకు చూస్తున్నాడు లాయర్ రంగనాయకులు. అయిదేళ్ళ క్రితం సరిగా ఇలాటి వర్షం రాత్రి పద్మ గురించి ఆలోచిస్తూ విశ్వనాథం ఇంటిలో గడిపినవిషయం గుర్తుకొచ్చింది.

వల్లాటి ఆకారాలతో చెట్లు భయాన్ని

కలిగిస్తున్నాయి. మెరుపులు కత్తుల్లా తళ తళ మని మెరుస్తున్నాయి. గాలికి గదిలో కేలండర్లు ఎగిరి పడుతున్నాయి టేబిల్ పైన వున్న పుస్తకం పేజీలు రెప రెప లాడేయి. వో ఫోటో ఎగిరి క్రింద పడింది.

రంగనాయకులు ప్రేమగా ఆ ఫోటోని చేతుల్లోకి తీసుకున్నాడు.

'పద్మ!' అతని కళ్లనుండి నీరు జారుతోంది. మెల్లగా గోడవారగా వున్న బీరువా తెరిచి అందులోంచి అందంగా వున్న పచ్చరంగు సీసాని తీశాడు. దాని మీద వాట్ 69 అని రాసి వున్నది. ఆ అక్షరాలు ఇంగ్లీషులో చాలా ముచ్చటగా వున్నాయి.

సీసా మూతతీసి అందులో వున్న ఔషధాన్ని గ్లాసులోకి వంపుకొని రెండు సార్లుగా గొంతులో పోశాడు. చేత్తో కంఠాన్ని సవరించుకొన్నాడు. సగం సీసా ఖాళీఅయింది. అప్పుడతని దృష్టి గోడకి వేలాడుతోన్న వో ఫోటో పైన పడింది. అది రంగనాయకులు తన పెళ్లికి తీయించుకున్నది. ఆ ఫోటోలో తనప్రక్క రాధ వున్నది.

'రాధ!' అస్పష్టంగా అనుకొన్నాడు.

చలిగాలి రివ్వున వీస్తోంది. అతను బరువుగా కళ్ళు మూసుకున్నాడు.

'అయాం సారీ రాధా! ఆ రోజు పద్మముందు కావాలనిమాత్రం నేను కొట్టలేదు. నీ మనసుని చంపుకొని

ఇది విషాదం

తిరిగి నాదగ్గరకి రావని మాత్రం తెలుసు.'

రంగనాయకులు దిగులుగా చూశాడు ఫోటోవంక.

* * *

—జగన్నాధం వుత్తరం రాసేడు రంగనాయకులికి. వాళ్ల బావగారు పనిమీద కలకత్తా వెళ్లేరనీ పద్మని అంచేత వంటరిగా హైదరాబాదు పంపుతున్నట్లూ పద్మ ఎగ్జిబిషన్ చూడాలని ముచ్చట పడుతున్నట్లూను.

పద్మ వస్తుందంటే రంగనాయకులు చాలా ఆనందపడ్డాడు. మరంతలోనే చాలా బాధపడ్డాడు రంగనాయకులు. దేవుడు తన జాతకాన్నలా రాసేడుగానీ లేకపోతే పద్మని తను దక్కించుకునేవాడు. అప్పుడా జీవితం మరోలా వుండేది. ఇలా వుండేది కాదు.

రాధకి చెప్పేడు పద్మగురించి. రాధ విన్నది. సిగరెట్టు వెలిగించి శూన్యంలోకి చూస్తూ,

'పద్మ చాలా అందంగా వుంటుంది' చెప్పేడు.

రాధ మాట్లాడలేదు. మాట్లాడదనీ తెలుసు.

రంగనాయకులికి పద్మ అందం గురించి రాధకి చెప్పాలని పించింది.

—స్టేషనుకెళ్లి పద్మని కారెక్కించుకొని వచ్చాడు. పద్మని రాధకి పరిచయం చేశాడు.

అతనూ, పద్మా మాట్లాడుతుంటే రాధ కాఫీ తీసుకొచ్చింది.

పద్మ స్నానంచేసి బట్టలు మార్చుకొని ఓ బొమ్మలా తయారైంది. అతనామెని చూసి కలవరపడ్డాడు.

(నీవంక చూడ్డానికి నాకు భయం వేస్తోంది. ఆలోచనల్లో వేధనపడి పోతున్నాను. నిన్ను దక్కించుకోలేని నా పిరికితనానికి ప్రతిక్షణం ఏడుస్తున్నాను. దేవుడా! నన్ను రక్షించు. పద్మముందు నన్నీ స్థితినుండి మాత్రం దిగజారకుండా కాపాడు. నన్నుగురించిగానీ, నా బాధగురించిగానీ ఆలోచించేవారు. జాలి పడేవారు కూడా లేరు. కనక నామీద నేనే జాలి పడుతున్నాను. ఐ పిటీ మై సెల్ఫ్)

'తప్పు! అలా చూడకూడదు' అన్నట్టుగా ఆమె మెళ్లో సూత్రాలు తళుక్కున మెరిసినాయి.

'ఏమిటలా చూస్తున్నారు?' మెత్తగా నవ్వుతో వచ్చి కూర్చుంది పద్మ.

'అఁ అబ్బే ఏం లేదు'

'మీరు బొత్తిగా మారలేదు' అంటూ అనవసరంగా నవ్వింది పద్మ!

(నేను మారని మాట నిజమే! మారను కూడా. నీకు తెలీదు కానీ పద్మా నిన్నమితంగా ప్రేమించిన రాస్కెల్ని. నువ్వంత ఫ్రీగా, అమాయకంగా మాటాడుతుంటే నేను గిల్టీ ఫీలవుతున్నా)

అతను లేచి నుంచుని బయటకు నడిచాడు.


పద్మ కార్లో అతని పక్కనే కూర్చుంది. అతనేమీ మాట్లాడకుండా డ్రైవ్ చేస్తున్నాడు. పద్మ వాళ్ల ఆయన గురించి వనపోసినట్లుగా మాట్లాడేస్తోంది. కారు ఎగ్జిబిషను గ్రౌండుదగ్గర ఆగింది.

పద్మ కారు దిగుతూ అన్నది.

'రాధగార్నికూడా తీసుకొస్తే బావుండేది!'

అతను నవ్వి వూరుకొన్నాడు.

ఎగ్జిబిషన్లో షాల్, గాజులు, చీరలు, పూసలదండలు ఏవేవో కొన్నది. అన్నిం



రామయ్య తెలివైనవాడు : ధాన్యము సిమెంటు కొట్టులో మాత్రమే భద్రంగా ఉంటుందని అతనికి తెలుసును !



సిమెంటు కొట్లు మాత్రమే మీరు చమటోడ్చి పండించిన ధాన్యమును నిప్పు, నీళ్లు, ఎలుకలు, పురుగులు మొదలగు వాని బారినుండి సురక్షితంగా ఉంచుతాయి.

పెద్ద లేక చిన్న కొట్లు, నేలమీద లేక నేల క్రింద — ఎక్కడైనా సరే సిమెంటు కొట్లు దృఢంగా ఉండి, చాలా కాలము నిలిచి ఉంటాయి. ఈ కొట్లను సులభంగా, చవుకగా ఏసిసి సిమెంటుతో కట్టవచ్చును.

నష్టములను అరికట్టి, పెద్ద పెద్ద లాభాలను సంపాదించుటకు మీ డబ్బును వివేకంగా ఖర్చు చేసి ఏసిసి సిమెంటుతో కొట్లు కట్టండి. 50 ఏళ్ళకు పైగా ఇది మొదటి రకము సిమెంటు అని పేరుగాంచినది

మీ సిమెంటు అవసరములకు సమీపంలో నున్న ఏసిసి స్టాకిస్టును గాని లేక, ది సిమెంట్ మార్కెటింగ్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ధన్ బిల్డింగ్, 175/1, మౌంట్ రోడ్, మద్రాసును గాని సంప్రదించండి.

ది కాంక్రీట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, రహమత్ బిల్డింగ్, 66 సి, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్, యొద్ద మీకు సాంకేతిక సహాయము ఉచితంగా లభిస్తుంది.

ACC

రైతుల మిత్రము

(ది అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీస్ లిమిటెడ్
ది సిమెంట్ మార్కెటింగ్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) CMI 9287

టికి రంగనాయకులే పే'చేశాడు.

'ఇలా అవుతే ఇక్కడ వస్తువులన్నీ కొనేయాలను' నవ్వుతూ అన్నది. అతనూ నవ్వేడు.

స్టాల్‌దగ్గర టీ తాగి రెండు రోడ్లు తిరిగారు. ఆ సమయంలో అతని మనసు మనసులో లేదు.

పదిన్నరగంటలవేళ ఇంటికి చేరారు. భోజనాలతర్వాతకూడా పద్మ ఏవో చెబుతూనే వుంది. సిగరెట్టు వెలిగించి ఆమె కెదురుగా ఈజీచైర్లో కూర్చొన్నాడు. రాధ తన గదిలోకి వెళ్ళిపోయింది.

'నాకూ నిద్ర వస్తోంది. గుడ్‌నైట్!' అన్నది.

* * *

రంగనాయకులికి నిద్ర పట్టలేదు. సిగరెట్లు కలుస్తూ గదిలో పచార్లు చేస్తున్నాడు.

బయట వెన్నెల అందంగా పరుచుకుని వున్నది. చలిగాలి వేస్తోంది. పద్మ పడుకొన్న గదిలోకి తొంగి చూశాడు రంగనాయకులు. బెడ్‌లైట్ వెలుగులో పద్మ కనబడింది. గదిలో మూలగావున్న స్ప్రింగ్ కాట్‌మీద పద్మ వెల్లకితలా పడుకొని వుంది. పవిట పక్కకు జారిపోయి ఎత్తైన పద్మ గుండెలు అతన్ని పిచ్చివాడిని చేశాయి. చీర మోకాళ్ళ పైకి

ఇది విషాదం

చెదిరి వుంది.

దగ్గరకు వెళ్ళి పద్మను చూడాలని పించింది.

అతని మనసు పిచ్చి ఆలోచనలతో కొట్టుకొంటూ వుంది. మెల్లగా ఆమె పడుకొన్నగదిలోకి వెళ్ళాడు.

అమాయకంగా నిద్ర పోతోన్న పద్మని ఆ సమయంలో చూస్తుంటే ఏడుపొచ్చిందతనికి.

(మనుష్యుల్ని తినే అందం నీది. నన్నిలా కూడా బ్రతకనిచ్చేట్టు లేవు. లాభం లేదు నాలో ఏదో దెయ్యం ప్రవేశించింది. పద్మా నువ్వు నాక్కావాలి)

మెల్లగా ఆమె మొహం పైకి వంగేడు. పద్మ నిద్రలో మగతగా కదిలింది. రంగనాయకులు వులిక్కిపడ్డాడు.

(దేవుడా నన్ను రక్షించేవు. అయినా నీకు నేనేం అపకారం చేశానని నన్నిలా పశువుని చేయాలనుకొన్నావు నయం! ఈ దేత నా రాక్షసత్వానికి బలైపోయింది కాదు. ఈ దౌర్భాగ్యుడ్ని క్షమించు.)

అతను గదిలోకి వెళ్ళిపోయాడు. అతనికళ్ళ నీళ్ళ నిండుకొన్నాయి.

* * *

—'ఏయ్ ఏమిటా మొద్దునిద్ర లే!' అంటూ రాధని తట్టి లేపాడు రంగనాయకులు. రాధ బద్ధకంగా కదిలింది.

'మీరుకూడా రావల్సింది, సౌండ్ ఆఫ్ మ్యూజిక్ చాలా బాగుంది' అన్నది పద్మ.

'మాకు సినిమాలకి కలసి వెళ్ళే అలవాటు లేదు' అన్నది రాధ. పద్మకి ఆమాటలు అసందర్భంగా అనిపించేయి.

ఆరాత్రి—

—రాధ తెగించి రంగనాయకులితో అన్నది.

'ఎంత స్నేహితుడు చెల్లెలని నన్ను మభ్యపెట్టినా మీ ప్రవర్తన నాకేం నచ్చలేదు. ఇంట్లో పెళ్ళాం అనే దయ్యం ఒకటి చచ్చిందన్న విషయం మీకు గుర్తుందా! ఎందుకీ దాగుడుమూతలు? నిజాన్ని తెలుసుకోలేనంత ఇడియట్‌ని కాదు నేను ఆడండి. మీ ఆట ఇంకెంతకాలం సాగుతుందో— అయినా పెళ్ళయిన ఆడదానికి ఆమెకి వుండాలి సిగ్గు. మీరింతటి ఘనులన్న సంగతి నే నిప్పుడే తెలుసుకొన్నాను.'

'రాధా! ఏమిటి నువ్వు మాట్లాడేది. పద్మ వింటే ఏమనుకొంటుంది!' రాధని వారించబోయాడు రంగనాయకులు.

'వింటే తనతప్పు తెలుసుకుంటుంది.'

'రాధా! నీ తెలివితక్కువ తనానికి సిగ్గుపడుతున్నాను.'

'హా! సిగ్గు మాట కేమొచ్చెగాని భయపడ్డం నేర్చుకోండి. అయినా నన్ను చంపి పారేస్తే మీకు అడ్డే వుండదుగా?'

'రాధా!' అరిచాడు.

'ఎందుకలా అరుస్తారు. నేను మాట్లాడిందాంట్లో తప్పేమన్నా వుంటే అనండి. ఆమెగారి ఫోటోని తమరు డైరీలో పెట్టి పూజిస్తున్న విషయంకూడా నాకూ తెలీకపోలేదు.'


రాధ చెంప ఛెళ్ళుమన్నది.

'ఆపండి!!!'

రాధ వులిక్కిపడి గుమ్మంవేపు చూసింది. గుమ్మంలో పద్మ నించొని వుంది.

రంగనాయకులు విసురుగా అక్కడ్నుంచి మేడపైకి వెళ్ళిపోయాడు.

షెల్ఫ్‌లోంచి రెడ్‌నైట్ విస్కీ సీసాని బయటకుతీసి మూతతీసి సీసానే నోట్లో



పెట్టుకుని గడగడ తాగేశాడు. సరిగ్గా అదే సమయంలో పద్మ అక్కడకొచ్చి అతని చేతిలోని సీసాని లాక్కుని కిటికీ లోంచి బయటకు విసిరేసింది.

'రంగనాయకులు గారూ! ఇంతకాలం మీరు సాత్వికు లనుకొన్నాను. అనుకొన్నానే గానీ ఇప్పుడు చూసింతర్వాత మీ రెంతగా ఎదిగిపోయారో తెల్సుకొన్నాను. మీరేవన్నా అనుకోండి. నాకు త్రాగుబోతులంటే అసహ్యం. నాకీ విషయం ముందే తెలిస్తే ఈ గడప తొక్కేదాన్నే కాదు' పద్మ గొంతు బొంగురు పోయింది.

(పద్మా నవ్వులినే మనుష్యుల్ని నేను సహించను. నేను కలల్లో బతికిన మనిషిని. ఎన్నో రంగుల్ని చూశాను. ఆశ పడ్డాను. అందులో ఏ రంగుని నా జీవితానికి పూసుకోవాలనుకొన్నాను. నీకు తెలీదు పద్మా నే సన్యాయం అయిపోయాను. నీకు తాగుబోతులంటే అసహ్యం కావచ్చును, కాని పద్మా! నే నెందుకు తాగుతున్నానో తెలుసా? ఐ పిటీయూ! నీకు తెలీదు. నేను క్యాన్సర్ రోగిని. రాస్కెల్ని వచ్చింకేం అడక్కు. అడిగితే నిన్నిన్ను ప్రేమించి వెధవనై పోయానని చెప్పాల్సి వస్తుంది. అది నీకు చెప్పేసే ధైర్యంగల హార్టు నాలో లేదు. నే నంత గొప్పవాణ్ని కాదు, నా లేసు. అది రూలు.

ప్లీజ్ నువ్వు నా ముందునుండి వెళ్ళిపో. తాగినప్పుడు మనిషి లోనవున్న అంతరంగిక విషయాలని బయట పెడతారంటారు. అందుకు భయమేస్తోంది.

నీకు తెలీదు. ప్రేమ తాలూకు గాయం కలుక్కుమన్నప్పుడే నేనిమందు వాడుతున్నాను. ఇది ఏ డాక్టరూ నాకు చెప్పలేదు. నేను లాయర్ని. మంచీ చెడూ నాకు తెలుసు.)

రంగనాయకులు పేలవంగా నవ్వి అన్నాడు.

'ప్లీజ్. నన్నేం డిస్టర్బ్ చేయకు. గో ఫ్రం హియర్. నేను మాట్లాడే స్థితిలో లేనిప్పుడు!' సోఫాలో కూలబడిపోతూ అన్నాడు.

పద్మ చరచర అక్కణ్నుంచి వెళ్ళిపోయింది. వెళ్ళిపోగానే ఆడదానిలా మంచంపైన పడి ఏడ్చేశాడు రంగనాయకులు.

—మర్నాడు పద్మని [illegible] ఇంటికొచ్చేసరికి రాధ సూట్‌కేస్‌తో ఎదురొచ్చింది.

'మీరు పెద్దలాయరే కావచ్చు. కానీ నాకూ చెప్పుకోదగ్గ వ్యక్తిత్వం వుంది. మా నాన్నగారూ లాయరే! మనిషి విలువ తెలీని వాళ్ళదగ్గర వుండడం నాకు చేతకాదు. శలవ్!' రంగనాయకులు ఆమె వెళ్ళినవేపు చూస్తూ వుండిపోయాడు.

* * *

—వర్షం జోరుగా కురుస్తోంది. ఉరుము భయంకరంగా వురిమింది.

పిడుగుపాటుకు అతని గుండె అవిసిపోయింది. గుండెని పట్టి ఎవరో పిండుతున్నట్టుగా అనిపించింది. మంచంపైనుండి లేవడానికి ప్రయత్నం చేశాడు.

'అమ్మా!' గుండెని చేత్తో పట్టుకొని లేచి నిలబడ్డాడు. ఎక్కువసేపు నించోలేక అలాగే నేలమీద కుప్పలా కూలిపోయేడు రంగనాయకులు.

* * *

'ఇది కల కాదు కదా!' అనుకొన్నాడతను.

రాధ కన్నీళ్ళతో తన మొహంలో మొహం పెట్టి ప్రేమగా చూస్తోంది.

ఇది విషాదం

'రాధా!' అని పిలిచేడు.

'ఏమండీ! నన్నన్యాయం చేసేద్దామనుకొన్నారా?' రాధ గొంతు జీరబోయింది.

'నిన్ను చూడగలనని కల్లోకూడా అనుకోలేదు. చివరి గడియల్లో అయినా చూడగలిగేను. అదృష్టవంతుణ్ణి.'

రాధ తనచేత్తో అతని నోటిని మూసింది.

కళ్ళొత్తుకున్నది రాధ.

'నువ్వెంతో మంచిదానివి నీ మనసు నాకు తెలుసు రాధ!'

'......', అతనివంక చూస్తూ వుండిపోయింది.

'రాధా! నీకీ సంగతి తెలుసా?',

'ఏమిటి?'

'పద్మ చచ్చిపోయింది రాధా! ధనుర్వాతం పద్మని పొట్టన పెట్టుకొంది రాధా! పద్మ లేదు రాధా! పద్మ లేదు. నా అనురాగవల్లరి పద్మలేదు. నేను ప్రేమించిన దేవత అవతారం చాలించింది' ఏడుస్తున్నాడు రంగనాయకులు.

రాధ కళ్ళుకూడా నీళ్ళు నిండుకున్నాయి.

'రాధా! పద్మని క్షమించమని అడుగు. పద్మ ఆత్మ శాంతిస్తుంది. నిన్ను తప్పకుండా క్షమిస్తుంది.'

రంగనాయకుని కళ్ళనుండి జారుతోన్న కన్నీటిని పైట చెంగుతో తుడిచింది రాధ, తనూ కళ్ళనీరు నిలపుకొంటూను.

'నువ్వేమనుకున్నావో రాధా! నా కివాళ చాలా సంతోషంగా వుంది. నేనాశించిన మార్పు నీలో వచ్చింది. దట్స్ వాట్ ఐ వాంటెడ్ రాధా! ఇంతకాలమూ పొగ మంచులా నీలో పేరుకుపోయిన అనుమానాన్ని కన్నీళ్ళ రూపంలో కరిగించి వేస్తున్నావు. నీ మనసు స్వచ్ఛమైన మంచులాంటిదని నాకు తెలుసు. వెల్ నేనిప్పుడేమయిపోయినా ఫర్లేదు' అన్నాడు రంగనాయకులు.

రంగనాయకులు కళ్ళు మూసుకున్నాడు బాధగా. రాధ మెల్లగా వంగి అతని నుదుట ముద్దు పెట్టుకొంది.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచేడు. రాధ చాలా భయంగా కనబడింది. ఆందోళనగా తనవంక చూస్తోంది. డాక్టరు ఇంజక్షన్ ఇస్తున్నాడు.


'ఏమండీ!' అన్నది కంగారుగా రాధ.

(రాధా నాకు భయంగా వుంది. నేను చచ్చిపోతున్నాను. నిన్నొదిలి వెళ్ళిపోతున్నాను రాధా! అదుగో పద్మ కనిపిస్తోంది రాధా! పద్మన్నా కనిపిస్తోంది రాధా! నన్ను రమ్మంటుంది రాధా రానన్నా రమ్మంటోంది రాధా! నా రాధ ఏడుస్తోంది. ప్లీజ్. రాలేను పద్మా రాలేను. నువ్వెళ్ళిపో! రాధా యముడొస్తున్నాడు. అయిపోయింది రాధా! నేను వెళ్ళిపోతున్నాను. నిన్నన్యాయంచేసి వెళ్ళిపోతున్నాను. నా పద్మ దగ్గరకి వెళ్ళిపోతున్నాను.)

'రాధా!' అనాలని ప్రయత్నం చేశాడు రంగనాయకులు. రాధ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు ప్రేమగా.

అతని కళ్ళకి ఏడుస్తోన్న రాధ, డాక్టరూ, నర్సూ మసక మసగ్గా కనుపించసాగేరు. ●





కష్టాలు ఎందుకు కలుగుతాయి?

సృష్టిలోని ప్రతి ప్రాణికీ కష్టాలూ, సుఖాలూ కూడా కలగడం సహజం, ఇతర ప్రాణులు వాటిని అనుభవిస్తాయి గాని బయటికి చెప్పుకోలేవు. మానవులు బయటికి చెప్పుకుంటారు. కష్టసుఖాలు సమానమైన పాళ్లలో వుండవు, సుఖం పాలు ఎక్కువగా ఉన్నప్పుడు కష్టం కొద్దిగా కలిగినా దాన్ని లెక్కచెయ్యక పోవడమూ, కష్టాలు ఎక్కువగా కలిగాయని తోచినపుడు సుఖం కొద్దిగా కలిగినా అది లేనట్లే భావించడమూ కూడా సర్వసాధారణమైన సంగతే!

మానవుడు ఉత్తమ స్వభావం కలిగి సర్వదా పరోపకార పరాయణుడై స్వార్థచింతన లేక— భగవద్భక్తుడై పెద్దలను గౌరవిస్తూ, తరణోపాయానికి గురువులను సేవిస్తూ ఉండవచ్చు. అయినా తగిలిన వేలికే తగిలే పద్ధతిలో అతనికి కష్టాల మీద కష్టాలు భరింపరానివి కలుగుతూ ఉండవచ్చును. అప్పుడాతడు తాను నమ్మిన గురువును శరణుచొచ్చి మొర పెట్టుకోవచ్చు. ఇలా చెయ్యడం సహజమే!

అతని మనశ్శాంతికి ప్రయత్నించడం తప్ప గురువు మాత్రం ఏం చెయ్యగలడు? కష్టాలను తీర్చడం, రాబోయే వాటిని ఆపివెయ్యడం — ఆ గురువుకే కాదుగదా భగవంతుడికి కూడా సాధ్యంకాదు.

కష్టాలతో సతమతమవుతూ మొర పెట్టుకున్న శిష్యుడికి గురువు చెప్పేది యేమిటంటే—

"నాయనా! నువ్వు ఎన్నో కష్టాలలో చిక్కుకుని ఒడ్డు చేరుకోలేకుండా ఉన్నావు నువ్వు ఉత్తమ స్వభావం కలవాడివి. స్వార్థమనేది లేక ఇతరులకు ఉపకారం చెయ్యడానికే పాటు పడతావు. నవనీతం వంటి మనస్సు కలవాడవు. నీలాంటి వాడికి యిలాటి కష్టాలు కలగకూడదు అయితే నేం? కలిగాయి. వాటిని గురించి నాతో మొర పెట్టుకున్నావు. వాటిని తీర్చడం మానవమాత్రుడికే కాదు, దేవతలకు కూడా సాధ్యంకాదు.

అవి ఎందుకు కలిగాయంటావా?


ప్రతీదానికీ కారణం వుంటుంది. కారణం లేనిదే కార్యం వుండదు. లౌకికాలైన కార్యాలకు కారణాలు మనకు గోచరమవుతాయి. మనం పడే కష్టాలకు కారణాలు చర్మచక్షువులకు గోచరం కావు. ఒక అద్దాన్ని తీసుకో! దానిలో ఒక పక్కనే వస్తువు ప్రతిబింబిస్తుంది. వెనక ప్రక్క ఏదీ ప్రతిఫలించదు. ప్రతిఫలింపజేసే శక్తి ముకురం పృష్ఠభాగానికి లేకపోవడమే దీనికి కారణం.

ఆ విధంగానే మనం యీ జన్మలోని మన ప్రవృత్తులను బట్టి మాత్రమే ఆలోచిస్తున్నాం. మన ఆలోచన అద్దం పుంభాగం వంటిది. వెనకభాగంలో ఏమున్నదో మనకు తెలియదు. మన వెనకటి జన్మలన్నీ అద్దం వెనుకభాగం వంటివి. వాటిలో ఏమి జరిగినదీ మనం గ్రహించి వుంటే మన కష్టాలను గురించి విచారించం. ఆయా జన్మలలో మనం ఎటువంటి పాపాలను చేసివున్నామో, వాటికి తగిన ప్రతిఫలాలను తరువాతి జన్మలో అనుభవించక తప్పదు. ఎట్టి మహామహునికిన్నీ మరణం తప్పనట్లు పూర్వజన్మలలోని సుకృత దుష్కృతాల ఫలాలను అనుభవించక తప్పదు.

సుకృతఫలాన్ని అనుభవించేటప్పుడు 'క్రిందటి జన్మలో పెట్టి పుట్టాం' ఇప్పుడు అనుభవిస్తున్నాం' అని తేలికగా అనుకుంటామే గాని కష్టాలు వచ్చినప్పుడు విచారించి లాభమేమి? వెనుకటి జన్మలో ఎలాంటి దుష్కృత్యాలు చేశామో, వాటి ఫలితం అనుభవించక తీరుతుందా?' అని అనుకొని మనశ్శాంతికి యత్నించడం సాధారణంగా జరగదు. అలా అనుకుని మనశ్శాంతికి ప్రయత్నించినప్పుడు— మానవుడు పడుతున్న కష్టాల వలన బాధ కొంత ఉపశమిస్తుంది. అందుకోసమే సర్వవిధాలా యత్నించాలి" అని.

ఈ ఉపదేశం ఎంతో విలువైనది.





జరిగిన కథ

స్వామికి స్కూల్లో టీచరు ఉద్యోగంతోపాటు రఘుపతిగారింట్లో ఆశ్రయంకూడా దొరకటంతో అదృష్టవంతుడిని అనుకున్నాడు. అయితే రఘుపతి గారమ్మాయికి ప్రైవేటు చెప్పాల్సి వచ్చేటప్పటికి అతడికి పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్లయింది. దానికితోడు పరాంకుశం మాటీ పోటీ మాటలు, హెడ్‌మాస్టర్ హితబోధ స్వామిని కలవరపెట్టాయి. ఊరికి రాజకీయాల్లో రఘుపతిగారికి ప్రత్యర్థిగా తయారవుతాడు కోనేటిరావు.

3

సరిగ్గా నాలుగురోజులక్రితం 'మంచి రోజు లొచ్చాయి' అనుకుంటూ రఘుపతిగారింట్లో అడుగు పెట్టాడు.

'ఏం చెడ్డరోజు లొచ్చాయి!' అనుకుంటూ నీరసంగా స్కూలునుంచి యింటికి నడిచివచ్చి మంచంమీద కూలబడ్డాడు స్వామి. రెండు పూటలలోనే రఘుపతిగారింట్లో తిండితినడం మానివేయడం మంచిదే అనిపించింది.

మళ్ళీ గడియారం గుర్తుకువచ్చింది. తలుచుకున్న కొద్దీ మనస్సున కావికలై పోతున్నది. 'ఏమిటయ్యా అలావున్నావు?' అని అడిగింది శారదమ్మగారు. తల నొప్పిగా వుందని సమాధానం చెప్పాడు. శొంఠి గంధం అరగదీసి ఉగ్గుగిన్నెలో పంపింది శారదమ్మగారు పావనితో ఎంత వద్దని చెప్పినా పావని వినిపించుకోలేదు. 'మగ మహారాజులు! మరీ అంత మొహమాటమైతే యెలా బ్రతుకుతా రండీ? కావలసింది జబర్దస్తీ గాతన్ని తాక్కోవా లంటారు మగడన్నాక. రాసుకోండి.' అంటూ బలవంతపెట్టింది పావని. చేయగలిగిందిలేక కణతలనిండా పట్టించాడు ఘాటైన శొంఠి గంధం దిట్టంగా. మంట ప్రారంభమైంది. మనిషి జీవితంలో సగంబాధలు స్వయంగా కొని తెచ్చుకునేవి. తనబాధ ఒకరితో చెప్పుకునే అవకాశంగూడా కనిపించలేదు. ఆయిన ఆత్మీయులతో చెప్పుకుంటే, మనస్సుకు అంతో ఇంతో విముక్తి లభించవచ్చు. కాని ఎవరితో చెప్పుకోవాలి? అసలు తనకు గడియారంఉన్న సంగతే నమ్మని వాళ్ళుండవచ్చు. 'ఆదరించి యింట్లో పెట్టుకుని, కన్నబిడ్డలా చూసుకుంటున్న కుటుంబాన్ని అల్లరి పెడుతున్నాడు'—అంటూ పెద్దలందరూ కలిసీ తనను చివాట్లు పెట్టవచ్చు.

మరొకసారి కాలుకాలిన పిల్లిలా యింట్లోనూ బయటా తిరిగిచూశాడు. సీతమ్మవారికోసం అన్వేషిస్తున్న ఆంజనేయుడు ఆకులుగూడా చీల్చి చూశాట్ట అంతపిచ్చిగ వెతికాడు స్వామిగూడా ఉలిక్కి పడినట్లు మంచంమీంచి లేచి దొడ్లో బావిలోకి కూడా తొంగిచూశాడు. గదిలో బల్లమీదనే పెట్టినట్లు తనకు బాగా గుర్తు. ఏ పరిస్థితులలోనూ అదిరెక్కలు కట్టుకొని ఎగిరి బావిలోపడే అవకాశం లేదని తనకు తెలుసు. మనస్సు అలా పరిగెత్తించింది.

ఆ క్రితం రాత్రి భోజనమయ్యాక ఓ గంటసేపు విక్రమోర్వశీయం చదువుకుని ఆవులిస్తూ చివరిసారి టైం చూసుకున్నాడు. తనకు బాగాగుర్తు. ఎవరిపని యిది? ఆలోచించిన కొద్దీ బుర్ర వేడెక్కి పోతున్నదేగాని, సమాధానం మాత్రం దొరకడంలేదు.

సగం సగం నిద్రతో తెల్లవారింది.

'చూశావుటయ్యా! పవడినీ నమ్మలేకుండా వున్నాం ఈ రోజుల్లో దొంగ వెధవలూ దొంగ బుద్ధులున్నూ' అంటూ వచ్చి తనగదిలో మంచంమీద కూర్చున్నారు రఘుపతిగారు.

'ఏమయింది రఘుపతిగారూ!' అన్నాడు గడియారం తీసిన దొంగను ఆయన పట్టుకున్నారనే ఆశతో.

మనిషిని మనిషి నమ్మేరోజు లంటావా యివి?'

'కా—దం—డీ'

'మంచిది బాబూ! ఆ రహస్యం పెందరాళే గ్రహించావు. నిన్న పనిగట్టుకుని—అడ్డమైన గడపలూ తొక్కి—వసుదేవుడు గాడిద కాళ్ళట్టుకున్నట్టు—ఈ అడ్డగాడిద లందరినీ కాళ్ళుపట్టుకు


A.K. Murty

బతిమిలాడి మరీ ఆహ్వానించానా? మీటింగుకు వస్తానని ప్రతికుంకా వాగ్దానం చేశాడు గదా? ఏడు దాటి గంటయింది తుపాకీ గుండువేస్తే ఒక్కడు కనిపిస్తున్నాడేమో చూడు నాకు తెలియ కడుగుతా ఇదంతా నా యింట్లో పెళ్లి టయ్యా? కాటికి కాళ్లు చాచిన వాణ్ణి నాకేం గావాలి చెప్పు, గ్రామక్షేమంగాక? వింటున్నావా?'

రఘుపతిగారి ముఖంలోకి దీనంగా చూశాడు స్వామి. కాటికి కాళ్లు చాచిన మనిషిలా కనిపించలేదాయన.

'ఇంతకూ ఈ దొంగతనం సంగతి నీకు తెలుసునటయ్యా' సూటిగా కళ్లలోకి చూస్తూ ప్రశ్నించారు రఘుపతి గారు.

గడియారం మాదిరి కొట్టుకుంది స్వామి గుండె.

'ఏ దొంగ తనమండీ?' ఆశగా అడిగాడు.

'ఊరి సొమ్మయ్యా. ఊరికోసం లక్షలు తగలేసినవాణ్ణి చేతులు ముడుచు కిలా కూర్చున్నానా. నిన్నగాక మొన్న తలెత్తిన వీర్భాసుగాడు — ఆ కోనేటిరావు — లంచాలు పెట్టి పదిమందినీ కట్టుకుని — బాంకు ప్రసిడెంటై — అలా వేలకువేలు అత్తగారి సొమ్ములా ఫలహారం చేస్తేట్టయ్యా? — దిక్కుమాలిన వెధవలు...'

'ఎవర్నండోయ్ తిడుతున్నారు నన్ను కాదుగదా?' అంటూ చుట్ట కాల్చుకుంటూ మత్తుగా మందంగా నడుస్తూ రంగంమీదకు ప్రవేశించాడు మున్సబు.

మాపాత

వస్తూనే ఏదో ప్రాణి ఓండ్ర పెట్టినంత సుకుమారంగా ఆవులిస్తూ మంచం మీద కూలబడ్డాడు. ఆ భారీశరీరం బరువుకు ప్రాణంలేని మంచంకూడా పిటపిట మంటూ గజ గజ లాడింది.

'మున్సబూ నీకు తెలుసుగదా?'

'తెలుసండీ' — మత్తుగానే అన్నాడు మరోసారి ఆవలించిన మున్సబు.

'ఈ ఊరికోసం నేను ఎంత తగలబెట్టానంటావ్?'

సమాధానంగా నవ్వులాంటి శబ్దం వచ్చింది మున్సబు గొంతులోంచి. స్వామి లేవబోయాడు స్నానానికి. 'కూర్చో బాబూ! ఈ దారుణం నువ్వు కూడా వినాలి' అన్నారు రఘుపతిగారు.

కిక్కురమనలేక కూర్చున్నాడు స్వామి.

'నిజం చెప్పు మన్సబూ?' — తీవ్రంగా విగ్రదీశాడు రఘుపతిగారు.

'నిజం చచ్చిపోయింది రఘుపతి గరూ' అంటూ ఆరిపోయినచుట్ట అరడజను అగ్గిపుల్లల సహాయంతో అంటించాడు.

'మనం గాజులు తొడిగించుకున్నట్లేనా అంట?'

'యింకా అనుమాన మెందుకండీ? మీటింగన్నారు?'

'బోడి వెధవలు అందరూ మోసం చేశారు. ఒకడి లెక్క ఏమిటి? మన ముగ్గురితోనే జరిపిస్తా మీటింగు. తలుచుకున్నాక ఆగుతుందా ఏమిటి? మున్సబూ! ఆ కోనేటిరావు కోపరేటివ్ బాంకు ప్రసిడెంటయింది సర్కారు సొమ్ముతో తన పార్టీగాడిదల్ని మేపటానికా అంట? రేపు మనిద్దరం హైదరాబాదా వెళ్లి ఆ రిజిష్టారుని పట్టుకొని, అతగాడి ప్రసిడెంటుగిరి ఊడగొట్టే మార్గం ఆలోచించాలి. ఏమంటావ్?'

'మంచిదే నండీ' — రవ్వంత గురక పెడుతూనే అన్నాడు మున్సబు.

'మన బంధువుల్లో రిజిష్టారుకు కావలసిన వాళ్లెవరైనా ఉన్నారా మున్సబూ?'


మున్సబు గురక ఎక్కువయింది.

రఘుపతిగారికి కోపంతో వళ్లు మండిపోయింది. స్వామికేసి తిరిగి 'చూడవయ్యా! ఊరికి తలకాయలాంటి వాడు ఈ మున్సబు వరసచూస్తే యిలా వుంది. తెల్లవార్లూ అడ్డమైన సన్నాసుల్నీ చేర్చి — పేకాడటం — పగలల్లా యిలా కునికిపాట్లు పడుతూ సగం చచ్చిన మనిషిలా ఆపసోపాలు పడటం — నేను ఒక్కణ్ణీ ఎంత తలబ్రద్దలు కొట్టుకు చస్తే మాత్రం ఏం జరుగుతుంది?' అన్నాడు దిగులుగా.

'జోకరుముక్క —' అంటూ గావు కేకపెట్టి త్రుళ్లిపడి లేచాడు మున్సబు ఆ యోగసమాధినుంచి. నిజానికి అక్కడ జోకరుముక్కనే పదార్థమే లేదు. కాలుస్తున్న చుట్ట క్రమంగా వెనక్కుతగ్గి మీసాల్ని ముద్దెట్టుకుంటూ వో చిన్న చురకంటించింది.

చుట్టపీకను 'ఛీ' అంటూ నేలకేసి కొట్టి 'రఘుపతిగారూ' తమరు నశ్యానికి తెప్పించిన లంకాకుంటే నాలుగుకాడలిలా పారేద్దురూ. శాయిగాడు — నాకంటె నిద్రమొహం — తెమ్మని పంపిస్తే యింతవరకూ అయిపూ అంతూ లేదు. యింటికొచ్చి వుండాలి యీపాటికి' అంటూ నిలబడి చెప్పులు తొడుక్కుంటున్నాడు మున్సబు.

'అసలు నే చెప్పేది నీ తలకెక్కిందా మున్సబూ?'



రెచ్చిన కోపాన్ని బలవంతాన దిక్కున పోయాడు రఘుపతిగారు. ఆ తుప్పు పెట్టుకుంటూ అన్నారు రఘుపతిగారు. వాసన చుట్ట త్రాగేసరికి, తలతిరిగి.

'మూడొందలు పోయిందండీ రాత్రి పొరపాటున జోకరు గిరాటు పెట్టా పేట్లాటలో. చెయ్యి మరీ నాసిగా ఆ దెబ్బతో మనచెయ్యి చచ్చింది. ఆ వచ్చింది. ఉచ్చిలుగాడు మహా రెచ్చి పోరంబోకగాడి చెయ్యి హెచ్చింది.'

'హై దరాబాదు వాతా [illegible] న్నట్లేనాంట?'

'అలాగే కానీండి. నాలుగు [illegible] కాడలుంటే యిలా గిరవాపెట్టండి. ఇవాళ మళ్ళీ తెల్లవార్లూ ఆడ్తైనా

సమేత

ఆ ఉద్భిలుగాడి గూబలు మెలిపెట్టాలి.'

'రేపు ఉదయం బయలుదేరాల మనం'.

వెళ్ళిపోయాడు మున్సబు 'అలాగే' అంటూ.

'ఇవాళకూడా బడికి లేటుగా మల్సు' అనుకుంటూ లేవబోతున్న స్వామిని వెనక్కుపిలిచి' రేపటికో పందుంటే సర్దవోయ్. హైదరాబాదునుంచి రాగానే సర్దేస్తా.' అనేసి లోపలికి వెళ్ళిపోయారు రఘుపతిగారు.

కీలేని గడియారంలా గుండె ఆగిపోతున్నట్లనిపించింది. స్నానం చేయకుండా పరిగెత్తాడు బడికి. పిల్లలకు ఏం పాఠాలు చెప్పాడో తనకే తెలియదు. సాయంత్రం యింట్లో రఘుపతిగారి జాడ కనిపించలేదు ఊరిని బాగుచేయాలనే మహా యజ్ఞం తలపెట్టిన రఘుపతిగారికి క్షణం తీరిక దొరకడం లేదు.

పర్సుతీసి మిగిలిన ఇరవై ఏడు రూపాయలూ లెక్కపెట్టుకుని మళ్ళీ లోపల పెట్టుకుంటూ ఉసూరుమన్నాడు.

'ఏమిటి మేష్టారూ దాహా పోయిన కోర్సు పక్షిలా నిట్టూర్పులు మేస్తున్నారు?' అంటూ గదిలోకి వచ్చింది పావని.

'వంట్లో బాగుండలేదండీ!'

'యింకా పోలా తలనొప్పి. మరి కాస్త శొంఠిగంధం?'

'వద్దండీ. తలనొప్పి తగ్గింది.'

'మరి'

'మనస్సు—'

'అదా? నే వదలగొట్టనా? నీరు కారిపోతున్నట్లూ ప్రపంచం బరువంతా మోస్తున్నట్లూ కనిపించే ట్రాజెడీహీరో లంటే మహచెడ్డ విసుగండీ నాకు. మాష్టారూ ఒక చిన్న కోరిక.'

'?'

'చెప్పనా?'

'చెప్పండి'

'తీరుస్తానని మాటిస్తే—.'

'తెలియకుండా ఎలాగండి?'

'కాదండి మాష్టారూ! ఈ రోజుల్లో ఎవరు పెట్టుకుంటున్నారండీ మరీ చాదస్తంగా ఈ పిలకలు? దానికితోడు చెవులకు ధగధగ మెరుస్తూ ఆ దుద్దులు. ముక్కు మొహం తేనేది తీరుగా వుండే బట్టి భరించగలుగుతున్నాం ఈ వేషం. ఇలా పిలకలు పెట్టించి చూడండి ఒక్కొక్కళ్ళకు. హడలి ఛస్తాం. అలా వుంటే ఆ అవతారాలస్వరూపం ఊహకు కూడా అందదు.'

'మీకేం అపకారం చేసిందండీ ఈ పిలక.'

దెబ్బతిన్న అభిమానంతో తీవ్రంగానే అడిగాడు స్వామి.

'కోపమొచ్చిందా మాష్టారూ! భారతి అంది లెండి— అదేం అవతారమే బాబూ— చందాలు పోగుచేయించన్నా ఆ మనిషిని మరమ్మతు చేయవే— అంటూ. అనేశా ఉన్న మాట. పొరపాటయితే క్షమించండి స్వామీ.'

ఘొల్లుమంటూ చెంపలు వేసుకు వెళ్ళిపోయింది పావని.

తన అందచందాల గురించి అంతకుముందెన్నడూ ఆలోచించలేదు స్వామి. 'అందాలూ అలంకారాలూ ఆడవానికిగాని మగ మహారాజు కెందుకయ్యా?' అనేది రంగజమ్మ తండ్రిలో. తన తండ్రి పిలక తీయించడం గురించి అగ్రహారంలో పెద్దలంతా వింతగా చెప్పుకున్నారట. అమ్మకు మాత్రం సంప్రదాయాలమీద గౌరవం. 'ముమ్మూర్తులా మీ తాతగారి పోలికరా తండ్రీ' అంటూ దగ్గరుండి దుద్దులు కుట్టించిన బామ్మ మురిసి పోయిందట. బళ్ళోనూ ట్రయినింగు స్కూల్లోనూ ఎంతమంది గేలి చేసినా ఆ సంప్రదాయాన్ని విసర్జించలేదు స్వామి.

కాని—

పావని వెళ్ళిన తర్వాత అద్దంలో పరకాయించి పదిక్షణాలు తన ముఖం చూసుకోకుండా వుండలేక పోయాడు. తనకు తనముఖం అలాగే అలవాటై పోయింది. 'చందాలు ప్రోగుచేసి సమర్పించుకుంటాం. దయుంచి పిలక తీయించండి స్వామీ' అంటూ పావని నాటకఫక్కీలో ప్రాధేయపడుతున్న భంగిమ గుర్తుకు వచ్చి, అటువంటి పరిస్థితుల్లో కూడా నవ్వుకోకుండా ఉండలేకపోయాడు స్వామి.

* * *

మర్నాడు నిజంగానే హైదరాబాదు ప్రయాణం కట్టారు రఘుపతిగారు. ఆ ఉదయం యింట్లో భార్యా భర్తల మధ్య పెద్దయుద్ధం జరిగింది. బిగ్గరగా కేకలు పెడుతూ వస్తున్న రఘుపతి గారి ముఖంచూస్తే భయంకరంగా కనిపించింది. కోపంతో రెచ్చిపోయిన మనిషిలో రాక్షసుడి పోలికలుంటాయి గాబోలు. 'తెచ్చావుటోయ్' అన్నారు రఘుపతిగారు అంటే తనదగ్గర డబ్బు లేదని ఆయనకు తెలుసన్నమాట. లేకపోయినా ఎక్కడైనా సరే తెచ్చి యివ్వవలసిన విద్యుక్త ధర్మం తన కున్నదన్నమాట.

'గంటలో యిస్తానండి' అంటూ చకచక అడుగులు వేసుకుంటూ బయటకు నడిచాడు స్వామి.

ఇరకాటంలో పడ్డాడు. 'పాపం పసివాడు—' అంటూ గోలగా గేలి చేస్తున్నట్లు మొద్దుబారిన గ్రాంఫోను పిన్ను అనవాలో రణగొణ ధ్వనిచేస్తూ ఒంటెద్దు బండిని మోసుకుంటూ టూరింగుసినిమా ఎడ్వర్టయిజ్‌మెంటు నడుస్తోంది.

అప్పు చేయవలసి వచ్చింది మొదటి జీతంకూడా అందుకోకముందే. ఈ మహా విషయంలో తనకంత అనుభవం లేదు. దీన్ని ఒక మహాకళగా సాధనచేసి మహోజ్జ్వల చరిత్రలను సృష్టించి, దగాపడిన తమ్ముళ్ళందరికీ చిరస్మరణీయులైన మహానుభావు లెవరూ స్వామికి అంతకు ముందు పరిచయం కాలేదు.

ఎవరిని అడగాలి అప్పు?—అని ఆలోచించినప్పుడు — రక రకాల మూర్తులు కార్టూను సినిమాలో బొమ్మలమాదిరి కళ్ళముందు కదిలాయి. హెడ్‌మాష్టరు వెంకటరత్నంగారు గుర్తొచ్చి— ఆయన యింటికి వెళ్ళాడు. ఒక్కగా నొక్క కొడుక్కి అటెక్కి విరోచనాలు కావడంతో ఆయుర్వేదాచార్లుగారితో సంప్రదిస్తున్న మాస్టార్ని చూశాక 'అప్పు' అడిగే ధైర్యం లేకపోయింది స్వామికి.

హెడ్‌మాస్టారు తన రాకను అపార్థం చేసుకున్నారు. 'బిడ్డకింత జబ్బు చేసినా — ఇందరు టీచర్లున్నారు. ఒక్కరూ చూడటానికి రాలేదయ్యా. నువ్వొచ్చావంటే నాలాగా నువ్వూ అమాయకుడివి గనుక. ఊళ్ళో కలరా వుందే అనుకో. కేకవేస్తే పలికే అంతదూరంలో వున్నాడే పరాంకుశం? ఈ ఛాయలకు రాలేదనుకో. అంతే! కష్టకాలంలోగాని తెలియదు తన వాళ్ళెవరో.'

స్వామి వచ్చినందుకు మాష్టారు సంబరపడి పోయారు. నమ్మిన బంటుగా భావించి 'ఎంతబాధ పడుతున్నాడో కడుపు నొప్పితో బిడ్డ చూడు' అంటూ మంచం మీద కూర్చోబెట్టుకున్నారు తననికూడా. మాస్టారి దగ్గరనుంచి బయటపడే సరికి తల ప్రాణం తోకకు వచ్చింది.

'పాతికేళ్ళ సర్వీసులో బడికి లేటుగా వెళ్ళటం అలవాటు లేదు. కాస్త ఆలస్యంగా వస్తానని చెప్పు ఆ పరాంకుశానికి. బంట్రోతుకుకూడా కలరాట' అంటూ వీధి సగందాకా వచ్చి సాగనంపి పోయారు మాష్టారు.

స్కూలులో అడుగు పెడుతూనే పరాంకుశంగారి దగ్గరకువెళ్ళి హెడ్‌మాస్టారు లేటుగా వస్తారన్న సంగతి చెప్పాడు.

'పాపం! లేక లేక పుట్టిన ఒక్కగా నొక్క కొడుకు విన్నావంటయ్యా! మన స్కూలు బంట్రోతు కూడా కలరాతోనే పోయాట్ట.'

'ఎప్పుడండీ.'

'ఉదయంట.'

'మీదగ్గర ఓ యాభైరూపాయలుంటే బదులిస్తారా?' ఎవరిని అడగకూడ దను కున్నాడో ఆ పరాంకుశంనే చివరకు నోరు తెరిచి అడిగాడు.

'అంత అవసరమేమొచ్చిందయ్యా?' అన్నాడు పరాంకుశం.

'యింటికి పంపించాలండి. అర్జంటుగా'.

'ఏం? మీ అమ్మగారికేమన్నా—కొంపతీసి—దేశమంతా కలరాతగిలి పోతున్నారు పక్షుల్లా'.

తలవంచుకున్నాడు స్వామి,

'ఒంటిగంటకిస్తా. మూణ్ణెల్ల క్రితం యిలాగే తీసుకెళ్ళాడు కొత్త గుమాస్తా వెంకటేశం, పెళ్ళాం ప్రసవించడానికి హాస్పిటల్లో చేరిందంటూ. అసలీ భడ్వా జమానానికి పెళ్ళే కాలేదని తర్వాత తెలిసింది. నిలదీసి అడిగా నిన్న. ఇవాళ ఒంటిగంటకు యిస్తానన్నాడు.'


పన్నెండు గంటలకు బడికి వచ్చిన హెడ్ మాస్టరు రాగానే స్వామిని పిలిపించి 'నిజమేనా బాబూ పరాంకుశం చెప్పాడు. మీ అమ్మగారికి కూడా ప్రాణం మీద కొచ్చిందట?'

స్వామికి ఊపిరాడలేదు.

'ఏమిటి నుస్తీ? గుండెజబ్బా?'

తలూపాడు అస్పష్టంగా స్వామి.

నిట్టూర్చాడు మాష్టారు. ఆలోచనల్లో మునిగి, తేలి, కళ్ళజోడు తీసి టేబిలుమీద గిరవాటేస్తే 'నా అమ్మకూడా గుండె జబ్బుతోనే చచ్చిపోయింది' అంటూ కళ్ళు తుడుచుకుంటున్నారు.



"బాధపడకండి మాష్టారూ—"
ఇంకేమనాలో తెలియలేదు.

'కాదబ్బాయ్! అందరం పోయేవాళ్ళమే అనుకో. నేను హెడ్ అయ్యేదాకా నన్నా బ్రతికుంటే నాకింత బాధ వుండేది కాదు— నువ్వు హెడ్‌మాష్టరివైతే చూడాలని వుందిరా అబ్బీ — అంటూండేది. అమ్మ పోయిన మాసికంనాటికిగానీ ఆర్డరు రాలేదు. అందుకే ఇంత పదవి వచ్చిందన్న మాటే గానీ, సంతోషం లేకుండా పోయింది. ఏం చేసుకోను చెప్పు?'

మాష్టారి ఛెంపలమీదనుంచి ధారాపాతంగా కారుతున్నాయి కన్నీళ్ళు. మన కుర్రాళ్ళని ఎత్తుకోగల వయస్సున్న పెద్ద

మమత

మనిషి— ముగ్గుబుట్టలా నెరిసినగడ్డాన్ని తడుముకుంటూ అలా వెక్కివెక్కి ఏడుస్తున్నప్పుడు స్వామికళ్ళుగూడా చెమ్మగిల్లాయి. అంత సున్నితమైన మనస్సు మాష్టారిది. ఆయనను ఓదార్చగల వయస్సు కాదు తనది.


చివరకు హెడ్‌మాష్టారు చీదుకుని, పంచెకొంగుతో కళ్ళు తుడుచుకొని, కుట్టుబనీనుతో జేబులో పంచెకట్టు మాటున దాగిన పర్సుతీసి మూడుమడతలు విప్పి— చివరిమడతలో దాక్కున్న రెండు పదిరూపాయల నోట్లు బైటకు తీసి స్వామి చేతిలో పెట్టి 'ఎందుకన్నా మంచిది. ఈ మొత్తంకూడా నీ దగ్గరుంచుకో బాబూ. ఇంగ్లీషు డాక్టర్ని పిలిపించి గట్టి వైద్యం చేయించు చేతిలో డబ్బు లేదని నాటువైద్యం చేయించి, విషంలాంటి కషాయాలు గొంతులోపోసి హింసించి అమ్మను చంపుకున్న దౌర్భాగ్యుణ్ణి. నువ్వు హెడ్‌మాష్టరు అయేదాకా నన్నా మీ అమ్మను బ్రతికించుకో బాబూ. వెళ్ళు బాబూ వెళ్ళు. ఆలస్యం చేయకు. అమ్మను బ్రతికించుకో.' అంటూ రెండు చేతులతో స్వామి అరచేయిని గట్టిగా నొక్కారు.


ప్రాణంలేని ప్రతిమలా నడుస్తూ రఘుపతిగారింటికి బయలుదేరాడు స్వామి.

(ఇంకా వుంది)

రంగుల రాట్నము

వరాహము





Jayadev

జమ్మి కోనేటిరావు

పందిని చూడని వారెవరు? పంది గురించి చెప్పడానికి విశేషాలు ఏముంటుంటాయి? అసలు పంది గురించి చెప్పడం ఏమిటి? అని పాఠకులు కోపం చేసుకోరనుకుంటూను. పందుల్లో కూడా కొన్ని జాతులున్నాయి. [సీమపందులని అనేతెల్లటి పందులగురించికాదు నేనుచెప్పేది] ఆ జాతుల్నిచూసే ఉంటే పందులమీద మనకి ఉండే అభిప్రాయం పూర్తిగా మారిపోతుంది. రోడ్లమీద విచ్చలవిడిగా తిరుగుతూ జుగుప్స కల్గించే ఆకారము, అలవాట్లుగల పంది నిజానికి ఉన్నత స్థితిలో ఉండే పందులనుంచి క్రమంగా మారి ఈ స్థితికి దిగజారిపోయిందే.

పంది—మనం నిత్యం చూసేది—మానవుడి చేతుల్లో మారిపోయిన అడవి జంతువు. చాలవరకు సాధు జంతువు అయిపోయింది. మానవునికి అది ఆహారంగా ఉపయోగపడుతోంది. కాబట్టే దాన్ని బాగా మేపి, తిననిచ్చి బలవనిస్తాడు. [పంది బలిసినట్టు అని నానుడి అయిపోయింది] కాని అసలు వన్య వరాహాన్ని చూస్తే పంది, బలిసిన జంతువు కాదని, సాధువు అసలే కాదని గ్రహిస్తాము.

పందులు అనేక జాతులు. అమెరికాలో వాటిని పెక్కారీలు అంటారు. ఆఫ్రికాలోని పందుల్ని 'వార్ట్ హాగ్' [కంతుల పంది] అంటారు. వైల్డ్‌బోర్ [అడవి పంది] అనేది యూరపు, ఆసియాల్లో ఉంటుంది. అడవి పంది వేట ఎంత ఉత్సాహకరమో, అంత ప్రమాదం కూడా. ఇండియా, యూరపులో ఇది ప్రసిద్ధి. వేటగాళ్ళు గుర్రాలమీద స్వారీ చేస్తూ, ఈటెలతో పొడిచి అడవిపందిని చంపేవారు. కాని అడవిపంది ఎదురు తిరిగితే గుర్రాన్ని చీల్చి, మనిషిమీద పడి ఘోరంగా చంపుతుంది. అంతేకాక అడవిపంది ఏమాత్రం భయం లేకుండా ఏనుగుతో పోరాడుతుంది. పులిని కూడా గజగజలాడించే ఘనత ఈ అడవిపందికే దక్కుతుంది.

ఈ అడవిపందినుంచే మన పెంపుడు పంది ఏర్పడింది అంటే వింతగానే ఉంటుంది. ఆస్ట్రేలియాలో ఈ పందులు మనిషి అదుపు తప్పించుకొనిపోయి, తిరిగి అడవులలోకి పోయి వన్యమృగాలు అయిపోయాయి. తిరిగి వన్యగా అయిపోయినా, ఆకారంలోనూ, స్వభావంలోనూ భయంకరంగా మారిపోయాయి. మానవ రక్షణ లేకపోయి, తనను తాను రక్షించుకొంటూ ఆహార సంపాదనలో శ్రమ పడితే వచ్చేమార్పులు అవి.

పెక్కారీలు చిన్నవి. గుంపులో పోతూ ఉంటాయి. 'కలసివుంటే కలదు బలం' అనేది వాటి ధ్యేయం. నోటిలోనుంచి దంతాలు బయటకువచ్చి చూడ్డానికి భయం కల్గిస్తాయి. వాటి బారపడితే మనిషికి ప్రమాదం, వేరే ఆసరా లేకపోతే గంటలతరబడి చెట్టెక్కి రక్షించుకోవలసి వస్తుంది. దీని మాంసం రుచిగానే ఉంటుంది. కాని దాని శరీరంమీద ఒక గ్రంథి ఉంది. దాని స్రావం దుర్గంధం భరింపరానిది. ప్రప్రథమంలోనేదీన్ని త్రుంచివేయాలి.

ఆఫ్రికాలోని కంతుల పంది చాలా వికారంగా ఉంటుంది. ముట్టె బల్లపరుపుగా వెడల్పుగా ఉంటుంది. ఒక జత పెద్ద దంతాలు ఉంటాయి. అయితే చూడ్డానికి భయంకరంగా ఉన్నా అంత ప్రమాదం కల్గించేది కాదని చెప్పవచ్చు. మలయా దీవుల్లో మరొక పంది ఉంది. ముచ్చటగా, లేడి పంది అని పిల్చుకొంటారు. [అంటే వారి భాషలో బాబిరూసా అంటారు] లేడిలాగా [కొంతవరకు] కొమ్ములుంటాయని దానికా ముద్దు పేరు.

అడవి పందుల పిల్లలు శరీరంమీద అడ్డచారలుంటాయి. ఇవి బహుశా వాటి పూర్వీకుల లక్షణాన్ని తెలుపుతాయి.

ఎండాకాలంలో చల్లదనంకోసం పందులు నీటిలోకిపోతాయి. ఇది హిప్పొపొటమసు [నీటి గుర్రం], గేదె [ఎనుము]లాంటి వాటిలోకూడా సహజం. మన పొంతాల్లో వాటికి మురికి నీరే శరణ్యం. [అదివాటి తప్పుకాక మన తప్పే నేమో] అంతమాత్రంచేత వాటి అసలుజాతి గాంభీర్యం, ధీరత్వం మనం మర్చిపోకూడదు.

అన్నానికి బదులు...

సాధారణంగా అన్నం తప్పించి ఇతర పదార్థాలన్నీ కొసళ్ళుగానే ఎంచడం మనకి అలవాటు. అసలు వో పట్టాన ఈ భోజనపు అలవాట్లలో మార్పు తీసుకురావడంకూడా కష్టం. కాని ప్రతిరోజూ ప్రతిపూటా అన్నంకంటె ఇతరమైన ధాన్యాలని తినడం కూడా మంచిది. పూరీలు, రొట్టెలు లాంటివి మన వాళ్ళకి నచ్చకపోడానికి సగం కారణం అవి బాగా ఉండకపోవడమే. ఉత్తరాదివాళ్ళు చేసినంత మృదువుగా రొట్టెలు మనం చేసుకోలేం. అందుకే రొట్టెలంటే దవడలకి పనిచెప్పే తోళ్ళలాగో, యింకెలాగో ఉంటూ ఉంటాయి. చపాతీ అంటూ ఓ పూరీని కొయ్యలా కాల్చేస్తూ ఉంటారు. ఈ పనిలో కష్టంకంటే నేర్పు ఎక్కువ అవసరం. చిన్నచిన్న చిట్కాలుంటాయి. అవి తెలిస్తే ఏ గృహిణికైనా యివి చెయ్యడం సులభమే. ఉదాహరణకి, రొట్టెలు గిన్నెలో మూతపెట్టేసిన దానికంటే శుభ్రమైన గుడ్డలో చుట్టి మూత పెట్టడం అన్నది చిన్న సంగతే అయినా —చాలామందికి తట్టని సంగతి. ఇలాంటి చిన్నవి గమనించి గోధుమలు వాడితే — భోజనంలో వెరైటీ తెచ్చుకోవచ్చు. అన్నంకంటె ఇలా గోధుమలు మొదలైనవి వాడితే—ఎక్కువ కూరగాయలు తినడానికి అవకాశం ఉంటుంది.

పరోటా

గోధుమపిండి రొట్టెలు వత్తడానికి వీలుగా కలుపుకోవాలి. చిన్న సైజువుండలు చేసుకుని ఒత్తుకోవాలి. రొట్టె మనం అనుకున్న సైజుకి ఒత్తగానే నెయ్యి వ్రాసి మడత పెట్టాలి. ఈ మడతపెట్టిన రొట్టెని మళ్ళీ వత్తాలి. దీనికి మళ్ళీ నెయ్యివ్రాసి మళ్ళీ మడత పెట్టాలి. ఈ విధంగా వత్తుకున్న రొట్టెని, ఎర్రగా కాలిన పెనంమీద ఇటూ అటూ తిరగవేస్తూ కాల్చాలి. కొంచెం కాలిందని తోచగానే చుట్టూ నెయివేస్తే పరోటా ఉబ్బుతుంది. ఈ రొట్టెలుకూడా వేడిమీద తినాలి. ఇవి అన్నంలో కొసరు కాదు. అన్నానికి బదులు తినాలి.

చపాతీలు

గోధుమపిండి కొంచెం వెన్నవేసి గట్టిగా ముద్ద చేసుకోవాలి. ఉప్పనీళ్ళు కొంచెం కొంచెం చల్లుతూ పిండి ముద్ద చేస్తే మరీ పల్చపడిపోకుండా కావలసిన పదునులో వస్తుంది. ఈ రొట్టెలపిండిని కొంచెం తడి పొడి బట్ట కప్పి రెండు మూడు గంటలు నాననియ్యాలి. మళ్ళీ బాగా మదాయించుకుని చిన్నసైజు నిమ్మకాయలంత ఉండలు చేసుకోవాలి. పల్చగా రొట్టెలు వత్తుకోవాలి. పెనం బాగా ఎర్రగా కాలనివ్వాలి. దీనిమీద ఒత్తిన రొట్టె వేసి కొంచెం బొబ్బలు తేలగానే తిప్పాలి. శుభ్రమైనబట్ట ఉంగచుట్టుకుని దానితో పెనంమీద చపాతీని తేలికగా చుట్టూ వత్తాలి. అప్పుడే చపాతీ బాగా పొంగుతుంది. డైట్‌గా తినేవాళ్ళయితే ఇలాగే తినేయవచ్చు. లేకుంటే రొట్టెకిటూ, అటూ వెన్నో, నెయ్యో రాసుకోవచ్చు. రొట్టెలు సాధారణంగా తినడానికి ముందే చేసుకోవడం ఉత్తమం. అలా కాకుంటే పెనంమీద కాల్చిన చపాతీలని శుభ్రమైన బట్టలో చుట్టిపెట్టాలి. అప్పుడే అవి కొయ్యల్లాగా యెండిపోవు. మెత్తగా ఉంటాయి.


కూరలన్నీ వండుకుని అన్నానికి బదులిలా పొడిరొట్టెలు తింటే ఆరోగ్యానికి మంచిది. ఒంట్లో నిరుతీసేసి సన్నపడ్డానికి దోహదం అవుతుంది.

పూరీలు

గోధుమపిండి గట్టి ముద్దగా కలుపుకోవాలి. దాన్ని బాగా మదాయించి చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ఈ ఉండలు చిన్న రొట్టెలుగా వత్తుకోవాలి. నూనెగాని డాల్డాగాని బాగా కాగిన తరువాతనే పూరీలు వేయించాలి. ఈ పూరీ బాగా పొంగాలంటే అట్లకాడతో నూనెలో మునిగివుండేలా నొక్కి పట్టుకుంటే సరి. అన్నానికి బదులు తినడానికి యీ పూరీలుకూడా బాగుంటాయి — వేడిమీద.

ఇవి మూడూ వస్తే — ఇక రొట్టెల్లో విన్నిరకాలు చేయడమైనా సులభమే.

కె. ఆర్.





'పసిడి మనసులు'లో శోభన్‌బాబు, శారద

దివి నుండి భువికి దిగిన దేవేంద్రుని సభ

దేవేంద్రసభను భువికి తరలించిన ఘనత ఆర్టు డైరెక్టరు గోఖలేకు చెందుతుంది. ప్రసాద్ స్టుడియోలోని దేవేంద్రుని సభా మండపాన్ని చూచి దిగ్భ్రమ చెందాను; సెట్టులోకి అడుగు పెట్టేసరికి నిగనిగలాడే నవయౌవ్వని; తన నృత్య కళాభినయంతో సదస్సులను మంత్ర ముగ్ధుల్ని చెయ్యడాన్ని చూచాను. ఆమె ఎవ్వరో తెలుసా? నేటి మేటి హిందీ నాయిక హేమమాలినియే ఆమె. 'శ్రీకృష్ణ విజయం' చిత్రంలో రంభగా నటిస్తూంది.

నరకాసురుడ్ని సంహరించిన సత్యా కృష్ణులకు దేవేంద్రుడు సన్మాన సభ నేర్పాటు చేసాడు. విజయసారధిని అభినందిస్తూ, రంభయొక్క నాట్య ప్రదర్శనను ఇంద్రుడు యేర్పాటు చేసాడు. రంభయొక్క అభినయ కౌశలానికి సత్యా కృష్ణులు జోహారు లర్పించారు. ఈ రసవత్తర ఘట్టాన్ని దర్శకుడు శ్రీ కామేశ్వరరావు 'శ్రీకృష్ణవిజయం' చిత్రానికిగాను ఏప్రిల్ 1, 2, 3 తేదులల్లో ప్రసాద్‌లో చిత్రీకరించారు. శ్రీకృష్ణుడిగా ఎన్. టి. రామారావు, సత్యభామగా జమున, నారదుడిగా కాంతారావు, దేవేంద్రుడిగా త్యాగరాజు నటించారు. ఈ దృశ్య సన్నివేశం ఎల్లప్పచేలర్‌లో చిత్రీకరించ బడింది.


స్వాతిశయం, ఆత్మాభిమానం సత్యభామకు తోబుట్టువులు. శృంగార కేళీ విలాసంతో శ్రీ కృష్ణుడ్ని తన వశీయుడిగా చేసుకున్న సుందరాంగి సత్రాజిత. ఈ పాత్ర నిర్వహణకి జమునే సాటి అని మనచే కీర్తింపబడే విధంగా సత్యభామ పాత్రకు ఆమె రూపకల్పన చేస్తూంది. శ్రీ ఎం. ఎస్. రెడ్డి భారీ ఎత్తున నిర్మిస్తున్న 'శ్రీకృష్ణవిజయం' తెలుగు చలన చిత్ర రంగంలో ఒక అపూర్వ దృశ్య కావ్యంగా వుండగలదని వూహిస్తున్నారు. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను ఎన్. టి. రామారావు, ఎస్వీ రంగారావు,

సినిమా

కాంతారావు, నాగభూషణం, పద్మనాభం, రామకృష్ణ, త్యాగరాజు, అల్లు రామలింగయ్య, జమున, జయలలిత, దేవిక పోషిస్తున్నారు ఈ చిత్రానికి విజయ పిక్చర్స్ పంపిణీదారులు.

స్వశక్తిపై ఆధారపడిన వాణిశ్రీ

'అర్ధరాత్రి' చిత్రనిర్మాత శ్రీ గంగాధరరావు నవశక్తి బ్యానర్‌తో నిర్మిస్తున్న సాంఘిక చిత్రం యొక్క షూటింగు ప్రసాద్ స్టుడియోలో ఏప్రిల్ 1న (అర్ధరాత్రి 12 గంటలకు) ప్రారంభమైంది. శ్రీ ఎన్. టి. రామారావు అర్ధరాత్రి మొదలు వేకువ వరకు నటించారు. ఈ చిత్రాన్ని శ్రీ సి. ఎస్. రావ్ డైరెక్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో నాయికలిద్దరున్నారు. ఒకరేమో వాణిశ్రీ.. మరొకదాని శారద



'అగ్ని పరీక్ష'లో విజయనిర్మల, పద్మనాభం

ధరిస్తున్నారు. ఈ చిత్రంలో రేలంగి ఒక వెర్రిటేకల పాత్రను పోషిస్తున్నారు. వయస్సు ముదిరినా, సెక్సుమోజు తరగని శృంగారపురుషుడిగా రేలంగి నటిస్తున్నారు. ధనవంతులను అసహ్యించుకుంటూ, స్వశక్తిమీద ఆధారపడే యువతిగా వాణిశ్రీ నటిస్తూంది. హీరోకు మేనత్త కూతురిగా శారద; వాణిశ్రీకి అన్నయ్యగా పద్మనాభం; పద్మనాభంను ప్రేమించే యువతిగా శ్యామల, వాణిశ్రీ తల్లి దండ్రులుగా శ్రీరంజని, రమణారెడ్డి,



'పగసాధిస్తా'లో జ్యోతిలక్ష్మి

శారద తల్లిగా హేమలత నటిస్తున్న ఈ సముజ్వల పౌంఫిక చిత్రంలో జగ్గయ్య ఒక ప్రముఖపాత్రను (గెస్టుగా) పోషిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 15 న జ్యోతిపిక్చర్స్ ద్వారా విడుదల కాగలదని నిర్మాత శ్రీ గంగాధరరావు వెల్లడించారు. యావద్భారత అగ్రశ్రేణి సంగీత దర్శకులయిన శంకర్, జైకిషన్లు ఒక తెలుగు చిత్రానికి సంగీతాన్ని సమకూర్చడం ముదావహం.

ఎవరీ హుషారైన పాపాయి?



వంశీకృష్ణ

ఈ పాపాయి ఎంత హుషారుగా వున్నాడో చూసారా? ఎవరనుకున్నారీ పాపాయి? ఒక ప్రముఖనటి కుమారుడు. వయస్సు 6 మాసాలు. ఆ నటి ఎవరో తెలుసా? మీ అభిమాన కథానాయిక శ్రీమతి జమున. ఈ మధ్య జమున యింటికెళ్లాను. నేను వెళ్లినప్పుడు ఆమెయింటిని అందమయిన బొమ్మలతో, కర్టన్స్‌తో అలంకరిస్తూ వుంది. నమస్కారమండీ అంటూ లోపలికెళ్లి కూర్చున్నాను. ఏమిటమ్మా, ఈ పనులు చూడ్డానికి నౌకర్లులేరా, అన్నాను. 'మన యింటి పని మనం చేసుకోవడంలో కలిగే తృప్తి, ఆనందం మరొకళ్లు చేస్తే ఎలా వస్తుందండీ.' పాపాయి నిద్ర పోతున్నాడా? అని అడిగాను. 'లేదండీ డ్రస్ చేసి తీసుకొస్తాను' అంటూ లోపలికెళ్లి అయిదు నిమిషాల్లో పాపాయిని తీసికొచ్చింది. తన వంశోద్ధారకుడ్ని హాలులో వున్న ఉయ్యాల్లాంటి కుర్చీలో కూర్చోబెట్టింది. బోసిగా నవ్వుతూ, చేతితో సెల్యూట్ పెట్టడాన్ని చూచి ఆశ్చర్యపోయాను అమ్మా, అమ్మా అంటూ జమున గారిని ముద్దుగా పిలుస్తుంటే, ఆమె అమాంతంగా రా, బాబూ అంటూ తన కుమారుడ్ని వొడిలోకి తీసుకుని ముద్దులవర్షం కురిపించింది. పాపాయిని మీరు ఎలా పిలుస్తారు అని ప్రశ్నించాను. 'నేను వంశీ అంటాను' అందామె. ఏంమాటలు వచ్చాయని అడిగాను. 'అమ్మ, అబ్బో, అత్తా అంటూ రోజుకి వెయ్యిసార్లు పిలుస్తాడు; మా వంశీకృష్ణ పుట్టిన తర్వాత మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయానికి వెళ్లలేదండీ. ఇప్పుడు కొంచెం గ్యాపు దొరికింది. అందుకే మా వారితో బళ్లారికి వెళ్లి, మంత్రాలయ స్వామిని దర్శిద్దామనుకుంటున్నా'నంది. నటి జమున కుమారుడు వంశీకృష్ణ అచ్చం వాళ్ల అమ్మలాగే వున్నాడుకదూ! ఎప్పుడూ నవ్వుతుంటాడు, ఎప్పుడూ ఆడుకుంటూ వుంటాడు. పుట్టినప్పుడు బరువు 6 పౌన్లు; ఇప్పుడు 16 పౌన్లు. పాపాయికి ఆహారం 'ఫ్యారెక్స్'.

—శ్రీనివాస్.

సి ని మా

సెంటిమెంట్ కి ప్రాధాన్యత

'సంఘం' దగ్గర్నుండి 'మూగనోము' వరకు ఎ. వి. ఎం. సంస్థ నిర్మించిన అన్ని చిత్రాలు ఆంధ్ర ప్రేక్షకుల ఆదరాభిమానాల్ని చూరగొన్నాయి. ఈ సంస్థ నిర్మించే చిత్రాల్లో 'ఫ్యామిలీ సెంటిమెంట్'కు ప్రాధాన్యత వుంటుంది. చిత్రం ఆదినుండి తుదవరకు పకడ్బందీగా వుంటుంది. డబ్బుకు వెనకాడక పాత్రకి తగ్గ పాత్రధారులను నిర్ణయించడంలో తెలుగు రంగంలోనేగాక తమిళ, హిందీ రంగాల్లో కూడా ఎ. వి. ఎం. కు ప్రత్యేక స్థానం వుంది. ప్రస్తుతం ఈ సంస్థ 'చిట్టిచెల్లెలు' చిత్ర నిర్మాణాన్ని పూర్తి చేసారు. గుహానాథన్ వ్రాసిన కథకు నరసరాజుగారు సంభాషణలను సమకూర్చారు. మలయాళ రంగపు ప్రముఖ దర్శకుడయిన శ్రీకృష్ణన్ 'చిట్టిచెల్లెలు'కు నిర్దేశకుడు. విజయపిక్చర్స్ ద్వారా విడుదలయ్యే ఈ చిత్రంలోని ప్రధానపాత్రలను ఎన్. టి. రామారావు, వాణిశ్రీ, హరనాథ్, రాజశ్రీ, గుమ్మడి, రేలంగి, పద్మనాభం, గీతాంజలిగార్లు పోషించారు. ఈ చిత్రానికి రాజేశ్వరరావు సంగీతాన్ని, తంబు ఛాయాగ్రహణాన్ని నిర్వహించారు.

నిర్మాత అయిన సహ నిర్మాత

'సుమంగళి' 'ఆత్మీయులు' చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించిన శ్రీ టి. వి. ఎస్. శాస్త్రి (ప్రతిభాశాస్త్రి) ఒక నూతన నిర్మాణసంస్థను స్థాపించారు. టి. వి. ఎస్. ప్రొడక్షన్ పేరిట నిర్మింపబడనున్న ఈ చిత్రానికి వి. రామచంద్రరావు నిర్దేశకుడు; సెప్టెంబరులో షూటింగు ప్రారంభం కానున్న ఈ చిత్రంలోని ముఖ్య భూమికలను శోభన్‌బాబు, వాణిశ్రీ, పద్మనాభం, గీతాంజలి, రాజబాబు, విజయలలిత ధరించగలరని తెలుస్తూంది శ్రీ టి. వి. ఎస్. శాస్త్రి నిర్మించే ఈ చిత్రానికి రాజేశ్వరరావు సంగీతాన్ని, వెంకటరత్నం ఛాయను నిర్వహిస్తారు.



'అగ్నిపరీక్ష'లో విజయనిర్మల, కృష్ణ

క్రయింతో పాటు సెంటిమెంట్ కల చిత్రం

ఈమధ్య రవిచిత్రవారి 'పగసాధిస్తా' రష్ చూపారు. ఈ చిత్రంలో కథా నాయకులు ముగ్గురు కనిపిస్తారు సత్యనారాయణ, కృష్ణ, కూడ వ హీరోగా లాల్ ను పేర్కొనాలి. మాస్క్‌షాట్స్, జూమ్‌షాట్స్ చిత్రీకరణలో లాల్ తన పనితనాన్ని చూపించారు లాల్. 'పగ సాధిస్తా' చిత్రాన్ని ఆద్యంతం రక్తి కట్టించడానికి దర్శకుడు శ్రీ కుటుంబరావు తీసుకున్న శ్రద్ధాసక్తులు ప్రతి షాట్‌లో కనిపిస్తాయి 'క్రయిం విత్ సెంటిమెంట్' ఈ చిత్రంలోని కథాంశం. శ్రీ అప్పలాచార్య సంభాషణలను, సత్యం సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రంలోని యితర ప్రధానపాత్రలను విజయనిర్మల, విజయలలిత, రాజబాబు, మణిమాల, ప్రభాకరరెడ్డి, అనిత, కనకదుర్గ, విజయభాను, ఛాయాదేవి, త్యాగరాజు, సంధ్యారాణి, మాస్టర్ రాము పోషించారు ఈ చిత్రం మే నెలలో పూర్ణా పిక్చర్స్‌ద్వారా విడుదలవుతుంది

* * *

సినిమా డైరీ

- చక్రవర్తి చిత్ర నిర్మించిన "మరోప్రపంచం" ఏప్రిల్ 10వ శ్రీఫిలింస్ ద్వారా విడుదలయింది. శ్రీ అక్కినేని నాయకుడు; అక్కినేని, ఆదుర్తి ఇద్దరూ కలిసి నిర్మించారు.
- "అనూరాధ" షూటింగు వాహినీ ఫస్టుఫ్లోర్‌లో ఏప్రిల్ 7 నుండి 10 వరుకు జరిగింది. శ్రీ పి. సి. రెడ్డి దర్శకత్వంలో కృష్ణ, కృష్ణంరాజు, విజయలలిత, ప్రభాకర రెడ్డి, ఆనందమోహన్లు పాల్గొన్నారు.
- హీరో కృష్ణ సమర్పిస్తున్న "అగ్ని పరీక్ష", పద్మశ్రీ పిక్చర్స్ "అల్లుడే మేనల్లుడు" షూటింగులు విజయవాడలో ఏప్రిల్ మొదటి వారంలో జరిగింది. మొదటిదానికి శ్రీ వరప్రసాదరావు, రెండవదానికి శ్రీ పి. పుల్లయ్య దర్శకులు.
- "మాయని మమత" చిత్రంలోని వాసవదత్త దృశ్యనాటిక షూటింగు శ్రీ కామేశ్వరరావు దర్శకత్వంలో ఎ. వి. ఎం. లో ఏప్రిల్ 6, 7, 8, 9, తేదుల్లో జరిగింది. శ్రీ రామారావు, సరోజాదేవి నటించారు.
- రాజేంద్ర ఆర్ట్సువారి "విజయం మనదే" వాహిని 5వ ఫ్లోర్‌లో ఏప్రిల్ 5, 6, 7, 8, 9 తేదుల్లో జరిగింది. శ్రీ విఠలాచార్య దర్శకత్వంలో ఎన్. టి. రామారావు నటించారు.
- "పెళ్ళికూతురు" ఏప్రిల్ 17న విడుదలవుతుంది. శ్రీ కృష్ణ హీరోగా నటించిన యీ చిత్రానికి శ్రీ రామచంద్రరావు దర్శకుడు.



'పచ్చని సంసారం'లో బేబిరాణి, వాణిశ్రీ, శ్రీదేవి

హీరో కృష్ణ నిర్మాతగాకూడా మీ ఆదరణకు పాత్రుడు కాగలవిధంగా 'అగ్నిపరీక్ష' చిత్రాన్ని సర్వజనాకర్షణీయంగా నిర్మించారు. ప్రొడక్షన్ వ్యవహారాలను మోహన్‌కుమార్ నిర్వహించారు. 'అగ్నిపరీక్ష'లోని ప్రధానపాత్రలను కృష్ణ, గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, రాజబాబు, ప్రభాకరరెడ్డి, చంద్రమోహన్, రావి కొండలరావు, కె.వి. చలం, అల్లు రామలింగయ్య, ముక్కామల, జగ్గారావు, సాక్షి రంగారావు, కాకరాల, చలపతిరావు, విజయనిర్మల, విజయలక్ష్మి, ఛాయాదేవి, పుష్పకుమారి, ఉదయలక్ష్మి, రాధాకుమారి, బేబీ శ్రీదేవి ధరించారు. శ్రీ ఫిలింస్ ద్వారా విడుదల కానున్న ఈ చిత్రానికి స్వామి ఛాయను, ఆదినారాయణరావు సంగీతాన్ని, హీరాలాల్ నృత్యాన్ని, తోట శిల్పాన్ని, గోపాల్ కూర్పును నిర్వహించారు. శ్రీ జి. ఆదిశేషగిరిరావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వాన్ని రచనను వరప్రసాదరావు చేపట్టారు.

నిర్మాత అయిన కథకుడు


అనేక జానపద చిత్రాల కథా రచయితగా పేరొందిన వీటూరి విజయలలిత పిక్చర్స్ బ్యానర్‌లో ఒక జానపద చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'అదృష్ట దేవత' అని పేరు పెట్టారు. కథ, మాటలు, స్క్రీన్‌ప్లేలు వీటూరిగారివే. దర్శకత్వాన్ని కె. ఎస్. ఆర్. దాస్, ఛాయాగ్రహణాన్ని ఎస్. ఎస్. లాల్, సంగీతాన్ని కోదండపాణి నిర్వహిస్తున్న ఈ చిత్రం అయిదురీళ్లు తయారైంది. ఏప్రిల్ 1 నుండి 12 వరకు మూడు సెట్లలో శారదా స్టుడియోలో 'అదృష్ట దేవత' షూటింగు జరిగింది. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను కాంతారావు, రామకృష్ణ, సత్యనారాయణ, రాజబాబు, త్యాగరాజు, ధూళిపాళ, మిక్కిలినేని, అల్లు రామలింగయ్య బాలకృష్ణ, కాశీనాథ్ తాతా, అశోక్‌కుమార్, రాజశ్రీ, విజయలలిత, గీతాంజలి, పుష్పకుమారి, సురేఖ, శ్యామల పోషిస్తున్నారు. వీరుగాక ధర్మారావు, కృష్ణమాచారి, వెంకటేశ్వరరావు (నూతన నటులు) వెండితెరకు పరిచయమవుతున్నారు.

"దక్షతవున్న నిర్మాత"

మనకున్న మంచి నిర్మాతల్లో శ్రీ విశ్వేశ్వరరావు ఒకరు. దక్షత, విజ్ఞత ఆయనలోని ప్రత్యేక అంశాలు. ఆయన నిర్మాత మాత్రమే గాదు. కవి, గాయకుడు + చక్కటి టెక్నీషియన్, ప్రేక్షకులకు ఎలాంటి కథలు నచ్చుతాయో ఆయనకు బాగా తెలుసు. ఇప్పుడు ఆయన జ్యోతి చిత్ర సిండికేటు బ్యానర్‌లో నిర్మించిన 'పెత్తందార్లు' సమాజ శ్రేయస్సుకుపయోగపడే కథాంశం కలిగినది. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను ఎన్. టి. రామారావు, శోభన్‌బాబు, రేలంగి, నాగయ్య, నాగభూషణం, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రాజబాబు, అల్లు రామలింగయ్య, ముక్కామల, ధూళిపాళ, సావిత్రి, విజయనిర్మల, సంధ్యారాణి, రమాప్రభ, హేమలత, కమలాదేవి పోషించారు. జ్యోతిపిక్చర్స్ ద్వారా విడుదలయ్యే ఈ చిత్రానికి మహారథి మాటలను, మహదేవన్ సంగీతాన్ని, రాము ఛాయాగ్రహణాన్ని, ఎస్. కృష్ణారావు శిల్పాన్ని నిర్వహించారు. ఈచిత్రాన్ని సి. ఎస్. రావ్. డైరెక్టు చేశారు.



'ఖడ్గవీర'లో రాజశ్రీ, రాజనాల



'నా దేశం'లో హరనాథ్, చంద్రకళ, సత్యనారాయణ

దర్శకానుభవం సినిమా

అమలాపురం నుండి తిరిగివచ్చిన దర్శక, నిర్మాత శ్రీ రాజేంద్రప్రసాద్ గారిని జగపతి ఆఫీసులో కలిసి, 'దసరా బుల్లోడు' చిత్రాన్ని డైరెక్టు చేస్తున్నారుగదా? దర్శకునిగా మీ అనుభవాన్ని ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకు తెల్పగలరా, అని అడిగాను. ఓ. ఎస్. అంటూ యిలా చెప్పారు :

'నేను అ, ఆలు యిసుకలో వ్రాసుకునే పిల్లవాణ్ణి. 'అ'కి ఆరు వంకర్లు, 'ఆ'కి పదహారు వంకర్లు వుంటాయి. అలాగే పసిపిల్లవాడికి భయం ఏమి తెలుసు? తేలు ఒకటే. చీమ ఒకటే. పరుగెత్తి ఒక్కగంతులో తేలు కొండె పట్టుకోబోతాడు. అది కుడితే యేమౌతుందో తెలియదు. అలాగే నేను దర్శకత్వాన్ని చేపట్టా, నేనెంతవరకు విజయవంతంగా బయటపడతానన్నది యిప్పుడు తేలే విషయం కాదు – సినిమా చూసి ప్రజలే చెప్పాలి. ఏ ఒక పిక్చరైనా విజయవంతం కావాలంటే పిక్చర్లో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణులు, కథ, అన్ని హంగులూ తృప్తికరంగా ప్రేక్షకులకు నచ్చేవిధంగా చేయకలగాలి. అంత మంది కలిసికట్టుగా చేయకలిగితే గాని రక్తి కట్టదు. కాని అదే సినిమా చెడగొట్టాలంటే ఏ ఒక్కరైనా చాలు. ఏ చిత్రమైనా విజయవంతం కావటానికి కారణం 'నేనే'నని ఎవరైనా చెప్పకలిగితే వారికి చెయ్యెత్తి దణ్ణం పెట్టడం తప్ప మనం చేయగలిగిందేముంది చెప్పండి? మరి 'దసరాబుల్లోడు' ను ఎలా డైరెక్టు చేస్తున్నారని ప్రశ్నించాను. 'నేను నిర్మాతగా ప్రజలకు పరిచయం. కాని సినిమా తీసేప్పుడు ఆఫీసు కుర్రాణ్ణుంచి — నిర్మాతవరకు పనిచేయటం నాకు చాలా సరదా. ఆరోగ్యం బాగున్నంతవరకు అన్నిపనులూ చేయాలంటే ఆనందం.

మీకు తెలుసా?

కొంతమంది తారలని వాళ్ళు నటించే చిత్రాల కథను గూర్చి అడిగితే "మాకు తెలియదు" అంటారు.

ప్రముఖ నటుడు దిలీప్‌కుమార్ ప్రతిరోజూ ఉదయం కాస్సేపు తన భార్య సయిరాబానుతో బ్యాండ్‌మింటన్ ఆడుతారట.

నటి కె. ఆర్. విజయ టెన్నిస్‌ను తన యింట్లోనే ప్రతి రోజూ ప్రాక్టీసు చేస్తుందట.



'పెత్తందార్లు'లో రాజబాబు, రమాప్రభ

అమలాపురంలో షూటింగు ఎలా జరిగిందో చెప్పగలరా? అని అడిగాను. 'మేము షూటింగుకు వెళ్ళినట్లు లేదు. పూర్వం కాలేజీలో చదువుకున్న రోజులు గుర్తుకు వచ్చాయి. గంట కొడితే భోజనం — పిలిస్తే లేచి షూటింగ్‌కి బయలుదేరడం — ఇక పనికి వెళ్ళాక తేడాలు లేవు. 'పనే పని' ఇక సోదర సాంకేతిక నిపుణులు, నటీనటులు నాకు చేయూత నిచ్చారు. నేనే ధైర్యంతో దర్శకత్వం అంగీకరించానో ఆ కరాలా అదంతా నిజమేనని నిరూపించారు. నాలుగుపాటలు, నాలుగు సీనులు 7 రోజుల్లో తీయకలిగామంటే — దానికి



'పచ్చని సంసారం'లో వాణిశ్రీ, కృష్ణ



'విప్లవం వర్థిల్లాలి'లో కాంచన



'నగ సాధిస్తా'లో రాజబాబు, విజయభాను

కారణం ఏ ఒక్కరూ కాదు. ప్రతిఒక్కరు ఒళ్ళు దాచుకోకుండా రాత్రింబవళ్ళు పనిచేసారు. అందరూ మంచి పేర్నందించే కుర్రాళ్ళే — అందరూ నిర్మాతలే. అలా అనుకుని పనిచేశాం. కనుకనే యింత విజయవంతంగా బయటపడ్డాం! ఏది, ఎందుకు జరుగుతుందనేది మనం చెప్పలేం. మనం చేయాలనుకున్నవన్నీ చెయ్యలేం — వద్దనుకున్నవన్నీ మానలేం. నేను దర్శకుణ్ణి కావాలనే కోరిక ఏ కోశాన లేదు. కాని నాచేతిలో వ్రాసిపెట్టి వుంది. తప్పించుకోవడం నావల్లకాలా — యిక ఒప్పదుగా మేమెంతవరకు చేయగలమో, చేయకలిగిందంతా చేస్తాం. నేనింత ధైర్యంగా చెబుతున్నానంటే నావల్లనే వాళ్ళందరూ నన్ను పట్టి బలవంతంచేసి నన్నీపనికి ఒప్పించారు. ఒప్పించిన వాళ్ళంతా తప్పుకునే వాళ్ళుకారు; ఈ చిత్రంలో నటించే నటీనటులు, సాంకేతికనిపుణులు, హేమాహేమీలు; నేను చేయవలసింది చాలా తక్కువ. వారు నాకు చేసిపెట్టేది చాల ఎక్కువ; కనుక విజయవంతంగా మీ ముందుకు రాగలననే ధైర్యంతో, నమ్మకంతో నేను దర్శకుణ్ణయ్యాను' అని ముగించారు.

హీరో అయిన హీరో కుమారుడు

హీరో నాగేశ్వరరావుగారి కుమారుడు ప్రధానపాత్ర ధరిస్తున్న మాతాపిక్చర్స్ వారి 'పెద్దలు మారాలి' చిత్రాన్ని పి.సి. రెడ్డి డైరెక్టుచేస్తారు. ఏప్రిల్ 7 న పాటల రికార్డింగు ప్రారంభమైంది.



'మూగ ప్రేమ'లో వాణిశ్రీ



ఉత్తమచిత్ర వారి తొలి చిత్రంలో సూర్యకాంతం, జమున.

సంగీత పాఠ్యాన్ని బి. గోపాలం అండ్ శీలగార్లు నిర్వహిస్తున్నారు. శ్రీమతి సరోజిని నిర్వహణలో తయారయ్యే ఈ చిత్రంలోని ముఖ్య భూమికలను జమున, హరనాథ్, సంధ్యారాణి, ఛాయాదేవి, విజయ (నూతన నటి) పుష్పకుమారి, నిర్మల, బేబిసావిత్రి, బెబిపద్మిని, సాక్షి రంగారావు ధరిస్తున్నారు. ఈ చిత్రానికి


సినిమా

ఆదుర్తి సుబ్బారావుగారి సతీమణి, వి. మధుసూదనరావుగారి సతీమణి కలిసి కధను వ్రాసారు; సంభాషణలను రామలక్ష్మి ఆరుద్ర సమకూర్చారు. మేనెలలో ప్రారంభం కానున్న 'పెద్దలు మారాలి' చిత్రానికి శ్రీ వెంకటరత్నం ఛాయాగ్రాహకుడు.

* * *

ఉగాది పర్వదినాన రామవిజేతావారి 'తల్లిదండ్రులు' షూటింగు ప్రారంభమైంది. జ్యోతి నారాయణరావుగారు స్విచ్ ఆన్ చెయ్యగా, ఆంధ్రప్రదేశ్ మంత్రి శ్రీ అప్పలనాయుడు క్లాప్ కొట్టారు. చిత్రంలో నటించే నటీనటులు+శ్రీయుతులు కె. వి. రెడ్డి, విశ్వేశ్వరరావు, గంగాధరరావుగార్లు వచ్చి యువ నిర్మాత ప్రభాకర్‌ను, వర్ధమాన దర్శకుడు బాబారావును ఆశీర్వదించారు. ఏప్రిల్ 7 నుండి 11 వరకు విజయా స్టుడియోలో జరిగిన మొదటి షెడ్యూలులో శోభన్ బాబు, పుష్పకుమారి మరియు హరనాథ్‌లు పాల్గొన్నారు. ఈ చిత్రంలో యిద్దరు కొత్త అమ్మాయిలు ప్రధాన పాత్రల్లో పరిచయమవుతున్నారు. తల్లితండ్రులుగా శ్రీమతి సావిత్రి, శ్రీ జగ్గయ్యగార్లు నటించే ఈ చిత్రం జూన్‌లో జ్యోతి పిక్చర్స్ ద్వారా విడుదల అవుతుంది.

—శ్రీనివాస్



"పసిడి మనసులు"లో శోభన్‌బాబు

త్యాగరాయ కళాశాలలో ఉగాది ఉత్సవాలు

'సాధారణ' ఉగాదిపండుగ సందర్భంగా ఈనెల 7వ తేదీన సర్ త్యాగరాయ కళాశాల కళామంటపము నందు ఉత్తరమద్రాసు ఉగాది మహోత్సవ సంఘం ఆధ్వర్యాన జరిగింది. ఉగాది కార్యక్రమం గీతాప్రవచనంతోను, పంచాంగ శ్రవణంతోను ప్రారంభమైంది. సమావేశానికి శ్రీ పింజల సుబ్బారావు ప్రధాన అతిధిగా వేంచేశారు. శ్రీగిడుతూరి సూర్యం అధ్యక్షత వహించారు. ప్రఖ్యాత కవి శ్రీ ఆచార్య ఆత్రేయ ఉపన్యసించారు. అధ్యక్షులు, ఉపన్యాసకులు ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించి, అది తెచ్చే ఆశలు, ఆశయాలను గూర్చి వివరించారు. ఉగాది సంఘం నిర్వహించిన వక్తృత్వపు పోటీ, లలిత సంగీతపు పోటీ, ఆటల పోటీలు, విచిత్ర వేషధారణ పోటీలలో గెలిచిన వారికి సినీ నటి శ్రీమతి సూర్యకాంతం బహుమతులను పంచిపెట్టారు. ప్రముఖులు పంపిన సందేశాలను శ్రీ బి. ఎస్. కాళహస్తి చదివారు. శ్రీ బి. సుబ్రహ్మణ్యం నివేదికను సమర్పించారు. శ్రీ సజ్జా వెంకటేశ్వర్లు వందన సమర్పణ గావించారు.

నాటి సాయంత్రం బేబీ ఉషారాణిచే నృత్యం, ప్రఖ్యాత నేపథ్య గాయకులు శ్రీ ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, కుమారి రమణగార్ల లలితసంగీత కచేరీ జరిగాయి.

(ఒ. వి.)

అంబత్తూరు ఆంధ్రసంఘం

అంబత్తూరు ఆంధ్రసంఘం వారు తమ సంస్థ 17 వ వార్షికోత్సవాన్ని ఉగాదినాడు వైభవంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె. ఎస్. ఇంద్రజాలం, శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ రాసిన 'పేటెంటు మందు' నాటిక సభ్యులు ప్రదర్శించారు.

నాటికలో శ్రీయుతులు ఎన్. కె. ఆర్., మల్లాది, ఎచ్. హెచ్. రావు, ఎస్.ఆర్. బి. సత్యనారాయణ, ఖాదర్, అనుముల మొదలగువారు నటించి ప్రదర్శనని రక్తి కట్టించారు.

(ఒ. వి.)

నవయువ కళాసమితి ద్వితీయ వార్షికోత్సవమును పురస్కరించుకొని మే నెలలో నాటక, నాటిక పోటీలు జరుప బడును. పోటీలలో ప్రవాసాంధ్రులు సైతము పాల్గొన వచ్చును. పోటీలలో పాల్గొన దలచిన వారు దరఖాస్తులను మార్చి 31 వ తేదీ లోపల కార్యదర్శికి పంపవలెను. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశములో నగదు బహుమతులు రోలింగ్ షీల్డులు మరియు అనేక ప్రత్యేక బహుమతులు యేర్పాటు చేయడమయినది. దరఖాస్తులకు ఇతర వివరములకు కార్యదర్శి, నవయుగ కళాసమితి, పమిడి, అనంతపురం జిల్లాకి వ్రాయవలెను.

* * *

ప్రఖ్యాత రంగస్థల నటులు, దర్శకులు అయిన కీ. శే. డాక్టరు గరికపాటి రాజారావు స్మారకార్థం నెలకొల్పిన డాక్టరు రాజారవు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యమున విజయనగరములో 1970 మేనెల 5, 6, 7, తేదీలలో నాటక, నాటిక, లలిత సంగీత పోటీలు నిర్వహించుటకు నిర్ణయించబడినది. వివరాలు కార్యదర్శికి రాసి పొందవచ్చును.

* * *



శ్రీ పి. గోవిందుచౌదరి

ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం సహ కార్యదర్శి, యింకా ఎన్నో జాతీయస్థాయి సంస్థలలో కార్యనిర్వాహక సభ్యులూ అయిన శ్రీ పి. గోవిందుచౌదరి లండన్ లోని బ్రిటిష్ డ్రామా లీగ్‌లో మూడునెలల పాటు నాటక నిర్వహణలో తర్ఫీదు పొందడానికి ఈ నెల 11 వ తేదీన బయలుదేరి వెళ్ళారు. ఇంగ్లండులో శిక్షణ అనంతరం వీరు ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, రష్యా, తదితర యూరోపు దేశాలని సందర్శిస్తారు. శ్రీ చౌదరి చక్కని నటుడే కాక ప్రతిభకల దర్శకుడు కూడా.

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాతప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాతప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంపనవసరం లేదు. 100 ఠరావు పేజీలయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్లు తిప్పి పంపకోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయములో ఏటువంటి బాధ్యతని స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

పుస్తకాలు

జనార్దనాష్టకం

కర్త: కందుకూరి—రుద్రకవి. డబుల్ క్రౌను 64 పేజీలు. త్రివర్ణ ఛాయా చిత్రసహితం... మేలురకం కాగితం. చక్కని అట్టబైండు. వెల: 12 రూ. ప్రతులకు—ఉహ్ ఎంటర్ ప్రైజెస్ ప్రైక్రాఫ్ట్స్ గార్డెన్స్, మద్రాసు—6.

మనోహరాలైన చిన్న చిన్న శృంగార కావ్యాలను ఆకర్షణీయాలైన చిత్రాలతో కూడా అందంగా ప్రచురింప జెయ్యాలనే ఉదార సంకల్పం కీర్తి కాయులూ, సరసహృదయులూ, మహా విద్వాంసులూ అయిన శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రిగారిది. ఆ సంకల్పంతోనే తొలిసారిగా రుద్రకవి జనార్దనాష్టకాన్ని పద్య భావాలను వ్యక్తం చేస్తున్న త్రివర్ణ చిత్రాలతో కూడా ప్రకటింపజేయ పూనుకుని— ఆ పని పూర్తికాకముందే దేహం చాలించారు. వారి సంకల్పాన్ని నెరవేర్చదలచి ఆనంద మోహన కావ్యమాలా స్థాపకులూ, ఉదారహృదయులూ అయిన శ్రీ వె.ఆ.కృ. రంగారావుగారు వ్యయ ప్రయాసలకోర్చి దీన్ని ఎంతోముద్దుగా వెలువరించారు. సుప్రసిద్ధ చిత్రకారులు శ్రీ బాపూ చిత్రించిన వర్ణచిత్రాలూ, సమగ్రాంధ్ర సాహిత్య చరిత్రను నూతన ఫక్కీలో రచిస్తూ పేరు పెంపులు గడించిన శ్రీ ఆరుద్ర సమగ్ర పీఠికా ఈ సువర్ణ రచనకు పరిమళాన్నికూరుస్తున్నవి.

శ్రీ ఆరుద్ర 'నాలుగు ముక్కలు' (ముక్కలంటే మాటలని కాదు— విభాగాలని నా నిర్వచనం) వ్రాయ దలచి వివరించ వలసిన విషయాన్ని 'కందుకూరు— రుద్రకవి— జనార్దనుడు—అష్టకం' అని నాలుగు విభాగాలు చేసి, ఆయా విషయాలను సమగ్రంగా చర్చించారు. మొదటి ముక్కలో శాసన ప్రమాణాలతో కూడా కందుకూరి ప్రాచీనతా, ప్రాశస్త్యం సమర్థించబడింది. రెండవ ఖండంలో రుద్రకవులెందరున్నారో, వారి రచనలేవో వివరిస్తూ, జనార్దనాష్టక కర్త పదహారో శతాబ్దం తృతీయ పాదంలో వుండిన ఇబ్రహీం పాదుషా కాలంలోని రెండవ రుద్రకవే అయి వుండాలని నిర్ణయించ బడింది. మూడవ విభాగంలో జనార్దన దేవుణ్ణి గురించీ, విష్ణురూపుడైన అతని వైభవ మూర్తుల లక్షణాలను గురించీ, వివిధ స్థలాల్లోని జనార్దనుని విగ్రహ స్వరూపాలను గురించీ వివరాలున్నాయి.

నాల్గవ భాగంలో అష్టకాల స్వరూప వివరణ సమగ్రంగా ఉన్నది. అష్టకాలంటే సరిగా ఎనిమిది పద్యాలే ఉండనక్కర్లేదనీ, ఎక్కువ కూడా వుండవచ్చుననీ, ఆ పేరుతో ఒక్క పద్యం ఉండడమూ సంభవమే అనీ ఉన్నది. అష్టకం మొదట్లో ఎనిమిది పద్యాలు గానే ఉండి క్రమంగా మార్పు చెందివుండవచ్చునని తోస్తుంది. ఈ జనార్దనాష్టకంలో పది పద్యాలు కానవస్తున్నవి. ఈ గ్రంథ పీఠికలో ఆయా సందర్భాలకు తగిన ఛాయా చిత్రాలు విషయానికి అందాన్ని చేకూరుస్తున్నవి.

ఇందులోని పది పద్యాలూ ఒక్కొక్కటి ఒక్కొక్క పలుచని గీతం మీద అధిభాగంలో పాఠాంతరాలతో కూడా, ప్రక్కను ఆర్ట్ పేపరు మీద పద్యభావాలను వివరిస్తూ, లబ్ధ ప్రతిష్ఠులైన చిత్రకారులు శ్రీ బాపు చిత్రించిన త్రివర్ణ చిత్రాలతో సహా ముద్రితాలయాయి. చిత్రాలు ఎంతో అందంగా ఉన్నవి. అమూల్యమైన పీఠికా, అందమైన చిత్రాలూ గ్రంథ ప్రాశస్త్యాన్ని యినుమడిస్తున్నవి. అనుబంధంగా ఇంతవరకూ ఉపలబ్ధాలైన అష్టకాలు పూర్తిగా ఇవ్వబడినవి. అందువల్ల ఇది అష్టక సంపుటి అని చెప్పవచ్చును. వాటి కోసం ఇతరత్రా వెతుక్కో నవసరం లేదు.

వీలైనంతవరకూ అచ్చుతప్పులు లేకుండానే పుస్తకం తయారైంది. పట్టికలో ఎక్కిన సవరణలే కాకుండా అవసరమైన సవరణలు కొన్ని జారి పోయాయి. వాటిలో 11 వ పేజీలోని 'జబగడదప్పు' పద్యం తొలిపాదం 'జబగడదష్ష లక్ష్మ శషసత్రు కపయ్యు ఝుభణ్ణటండువా' అనేదీ, 40 వ పేజీలోని 'కొదవలన్నియు దీర్చుకొంటివి గుణము లెరిగేశయ్యనూ' అనే మొదటి లైనూ ముఖ్యమైనవి.

ఇప్పటి కాగితపు వెలనూ, ముద్రణవ్యయాన్నీ బట్టి చూస్తే దీని వెల 12 రూ. పెట్టడం ఎక్కువని తోచదు. దీని విక్రయం వల్ల లభించే మొత్తంలో చాలా భాగం నిధిగా ఏర్పరచి స్వర్గీయ శ్రీ రామకృష్ణ శాస్త్రిగారి సాహిత్యాన్ని వెలికి తీసుకు రావాలనే ప్రకాశకుల సంకల్పం మేలయినది ప్రతిఫల నిరపేక్షగా 'ఆ' రుద్రకవి రచనకు 'ఆరుద్రకవి' చక్కని పీఠికతో మెరుగు పెట్టి తన సాహితీ సేవకు మెరుగు పెట్టుకున్నారు. అలాగే శ్రీ బాపు ఉచితంగా చిత్రాలు చిత్రించారు. ఈ విమర్శక, చిత్రకారులు ఇతరులకు ఆదర్శప్రాయులు.

ఊహకందని వ్యయ ప్రయాసలకోర్చి దీన్ని ప్రకటించిన ఉహ్ ఎంటర్ ప్రైజెస్ యజమానున్ని వేరే అభినందించ నక్కరలేదు. వారి ప్రయత్నానికి దోహదమిస్తూ, వారి ఉత్సాహాన్ని హెచ్చించి, యీ గ్రంథాన్ని బహుళ ప్రచారానికి తెస్తే చాలును. —ఆంగీరస

రామాయణ రహస్యాలు

రచన: శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి. 271 పేజీలు . రూ 4--భాషాపోషక గ్రంథమండలి, నిడుబ్రోలు, గుంటూరు జిల్లా.

పురాణగాథలను ఏ దృష్టితో చూస్తే ఆ విధంగా కనిపిస్తాయని ఒక వాడుక ఉండనే ఉంది. రామాయణ కథ త్రేతాయుగానికి చెందింది. పరమ పవిత్రగ్రంథం, రాముడు అవతారపురుషుడు అంటే గుడ్డిగా నమ్మారు జనం. అది మానవ శిలాన్ని తీర్చి దిద్దే మహాకావ్యమనీ, మహత్తర శక్తులు గల కవితానిధి అనీ పొగిడారు.

ఇప్పుడా గుణవిభాగాన్ని విడిచిపెట్టి, శ్రీ చౌదరి గారు రామాయణ దోష విచారణ మాత్రమే చేకొన్నారు. పండితులకూ విద్వాంసులకూ సయితం తెలియని దొసగులూ దోషాలూ అద్భుతమైన శైలిలో చిత్రించారు.

రామాయణ మంతటినీ తరిచి మథించి, ఆసక్తి కలిగించే ఇరవై కృతికలను, ఆకర్షణీయమైన తీరులో చౌదరిగారు అందిస్తున్నారు—వారి సొంతమాటల్లో కాదు, వాల్మీకి మాటల్లోనే. వారి తరానికీ సమర్థింపులకీ వాల్మీకి శ్లోకాలనే ఊతగా తీసుకున్నారు. ఇదే వారి ప్రజ్ఞకూ నైపుణికీ నిదర్శనం.

ఈ వ్యాఖ్యలతో ఏకీభవించాలనే నిర్బంధం ఏం లేదు. ఇష్టమున్నా లేకపోయినా, విడ్డూరాలనిపించే ఈ గాథలను విలాసార్థమైనా చదివి ఆనందించాలి.

ఏటి ఒడ్డున నీటిపూలు

శ్రీమతి కొలిపాక రమామణి రచన. 221 పేజీలు రూ 2. ఎం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం., మద్రాసు, సికింద్రాబాదు.

పోతే—ఇందులో ఇతివృత్తం:

ముగ్గురు నేస్తురాళ్లు— చారుమతి, శ్రీదేవి, పద్మ. ముగ్గురిలో చారుమతిని గురించిన కథ ప్రధాన భాగంగా నడుస్తుంది. నాయిక చారుమతిలో చెప్పతగిన హైలైట్సు మీ కనబడవు— తండ్రి పోయాక కుటుంబ భారం వహించి, సంసార శకటాన్ని లాక్కువస్తుంది. కోరికల్ని చంపుకుంటూ, చివరికి పరిస్థితులతో రాజీ పడుతుంది. అయితే ఒకటి—పెళ్లి అయినా, వైవాహిక సుఖమెరగని స్నేహితురాలు పద్మకు వివాహం రద్దు చేయించి, ఆమెను తన సోదరుడికే చేసుకుంటుంది.

పాత్రల చిత్రణ మరీ సామాన్యం. నడక చక్కగా ఉన్నా, సంఘటనలు పాఠకుల ఊహకి అతీతంగా ఉన్నప్పుడే రచనపై ఆసక్తి కలుగుతుంది.

ఇది రచయిత్రి తొలి రచన అనిపించటం లేదు. హృదయాన్ని కరగించే సొంపూ నరళీ కనిపిస్తుంది. సహజంగా ట్రాజెడీ కావలసిన నవలను కావాలని సుఖాంతం చెయ్యటం తెచ్చి పెట్టినట్టుంది.

—శివకుమారి

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 6 & 7 Thambu

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

